# ఎలా జీవించాలి?

మన ప్రశ్నలకు శ్రీరామకృష్ణుల సమాధానాలు


**రచయిత**

ఆచార్య పన్నాల శ్యామసుందర మూర్తి

**సహాయకులు**

మాదిరెడ్డి దాదారావు

**సలహా మండలి**

అమిరపు నటరాజన్

అమిరపు నరేష్

ఆచార్య (శ్రీమతి) చందలూరి చిరంజీవి



**ప్రకాశకులు**

**శ్రీరామకృష్ణ సేవా సమితి**

**బాపట్ల - 522101**

elA jIvincAli? (Telugu)
Code: /019

ఎలా జీవించాలి?
– మన ప్రశ్నలకు శ్రీరామకృష్ణుల సమాధానాలు (తెలుగు)

ప్రకాశకులు
శ్రీ రామకృష్ణ సేవాసమితి
బాపట్ల – 522101

© సర్వహక్కులూ ప్రకాశకులవి

ప్రథమ ముద్రణ: డిసెంబరు, 2016 (3000 ప్రతులు)

For Copies :
Sri Ramakrishna Seva Samithi,
Vijayalakshmi puram, Bapatla - 522101 AP
e-mail : rksamithibapatla@gmail.com
visit us at : www.unworldliness.org

# ప్రకాశకుల మనవి

ప్రాచీన భారతీయ విద్యావిధానంలో ముందు శిష్యుడు ప్రశ్న వేయాలి. శిష్యుడి ప్రశ్నను బట్టి గురువు అతడి అవగాహనా స్థాయిని అంచనావేసి దానికి తగ్గట్టుగా సమాధానమిచ్చేవాడు. ఏదైనా విషయం గురించి శిష్యుడు ప్రశ్నించలేకపోతే అతడికి ఆ విషయాన్ని అర్థం చేసుకునే శక్తి ఇంకా కలగలేదని అర్థం. అనాదిగా భారతీయ విద్యావిధానంలో గురుశిష్యుల మధ్య కొనసాగుతున్న పద్ధతి ఇది.

ఇదే పద్ధతిలో శ్రీరామకృష్ణ పరమహంస వద్దకు వచ్చే అనేకమందికి వారి స్థాయిని బట్టి, వారి ఆధ్యాత్మిక అభిరుచులను బట్టి ఆయన సమాధానమిచ్చేవారు. ఆ ప్రశ్నలు, సమాధానాలు ఒక చిన్న పుస్తకంలో లభ్యమైతే పాఠకులకు సౌకర్యంగా ఉంటుందన్న భావనతో మా సమితి అధ్యక్షులైన ఆచార్య పన్నాల శ్యామసుందర మూర్తిగారు ఈ సంకలనాన్ని చేశారు. విజయవాడకు చెందిన శ్రీ ఎమ్. దాదారావు గారు అందులో సహకరించారు. ఆ పుస్తకాన్ని సమితి ద్వారా ప్రచురించడం మాకెంతో సంతోషాన్నిస్తోంది. వారిరువురికీ మా కృతజ్ఞతలు.

ఈ పుస్తకంలో శ్రీరామకృష్ణులు, గురుదేవులు అనే మాటలు శ్రీరామకృష్ణ పరమహంసను సూచిస్తాయి. పాఠకుల ప్రయోజనార్థం కొన్ని సమాధానాలకు మరింత వివరణ కోసం సమితి మరొక ప్రచురణ అయిన 'ఒక కథ చెపుతా విను!' (code: /001) లోని కథలను సూచించాము.

ఈ చిరుగ్రంథం నరసాపురంలో 2016 డిసెంబరు 23, 24, 25న జరిగే రామకృష్ణ-వివేకానంద భావప్రచార పరిషత్ రజతోత్సవ భక్తసమ్మేళనంలో విడుదల చేయబడడం మాకెంతో ముదావహం.

ఆధ్యాత్మికాభిలాషులకు ఆ మార్గంలో ముందుకు సాగడానికి ఈ పుస్తకం ఎంతైనా సహకరిస్తుందనడం నిర్వివాదం.

– ప్రకాశకులు

1 డిసెంబరు, 2016

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | పరిచయం | 5 |
| 01. | సంఘంలో జీవించడం ఎలా? | 7 |
| 02. | గృహస్థజీవితం | 16 |
| 03. | మతాలు, మార్గాలు | 28 |
| 04. | గురువులు, సాధుసాంగత్యం | 32 |
| 05. | సాధన–ఆటంకాలు | 41 |
| 06. | కర్మమార్గం | 48 |
| 07. | జ్ఞానమార్గం | 51 |
| 08. | కామకాంచనత్యాగం, వైరాగ్యం | 55 |
| 09. | మనస్సు, ఏకాగ్రత, ధ్యానం, సమాధి | 63 |
| 10. | మాయ, పునర్జన్మ, అలౌకికవిషయాలు | 70 |
| 11. | భక్తిమార్గం | 74 |
| 12. | భగవంతుడు ఎందుకు కనపడడు? | 88 |
| 13. | భగవంతుడి లక్షణాలు | 94 |
| 14. | భగవత్సాక్షాత్కారం | 100 |
| 15. | నామస్మరణ, సంకీర్తన | 105 |
| 16. | శరణాగతి | 110 |

# పరిచయం

శ్రీరామకృష్ణులు సకలకళాప్రపూర్ణులు. సాధారణ వ్యక్తిగా దర్శనమిచ్చే ఆయనలో అసాధారణ వ్యక్తిత్వం, అపార దివ్యానుభవం, ఇంగిత జ్ఞానం దాగి ఉన్నాయి. ఆయన ఎన్నడూ పెద్దపెద్ద ప్రసంగాలు చేయలేదు. తమ వద్దకు వచ్చిన భక్తులకు, శిష్యులకు సరళమైన భాషలో అత్యున్నత ఆధ్యాత్మిక సత్యాలను బోధించేవారు.

శ్రీరామకృష్ణుల వద్దకు రకరకాల భక్తులు, పండితులు, శాస్త్రకోవిదులు, విద్వాంసులు, తర్కశాస్త్ర నిపుణులు, వైద్యులు, శాస్త్రజ్ఞులు, హేతువాదులు, సాధారణ జనులు, ఇతరులు వచ్చి ఆయనను తమ సందేహాలతో ముంచెత్తేవారు. నిజానికి సందేహాలు, ప్రశ్నలకు ప్రతిగా వెలువరించబడే సమాధానాల ద్వారానే అత్యున్నతమైన ఆధ్యాత్మిక సత్యాలు వెలికివస్తాయి.

భక్తుల సమస్యలకు వారివారి వ్యక్తిత్వాలను, మనస్తత్వాలను, ఆధ్యాత్మిక పరిణతిని బట్టి, ఎవరికి తగ్గ పరిష్కారాలను వారికి శ్రీరామకృష్ణులు సూచించేవారు. అవి కొందరిలో సామాజిక స్పృహను కూడా కలిగించేవి. నూట యాభై సంవత్సరాల క్రితం వేయబడిన ఆ భక్తుల ప్రశ్నలు

ఈనాటి సమాజానికీ, సాధకులకూ, భక్తులకూ కూడా చాలా చక్కగా వర్తిస్తాయి.

శ్రీరామకృష్ణుల కథామృతం, బోధామృతం, ఇతర గ్రంథాల నుండి భక్తుల ప్రశ్నలు సేకరించి, వాటికి ఆధునికతను జోడించి, నేటి తరానికి అన్వయం అయ్యేలా నివేదించడానికి ఈ గ్రంథంలో ప్రయత్నించబడింది. ఆ ప్రశ్నలకు సమాధానాలు కూడా శ్రీరామకృష్ణుల బోధనల స్ఫూర్తితో వ్రాయబడినవే. ఈ గ్రంథం సాధకులకు, భక్తులకే గాక అందరికీ సామాజిక స్పృహ కలగజేయగలదని ఆశిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని ప్రచురించిన శ్రీరామకృష్ణ సేవా సమితి, బాపట్ల వారికి నా కృతజ్ఞతాభివందనములు.

శ్రీరామకృష్ణ చరణసేవలో,

డా॥ పన్నాల శ్యామసుందర మూర్తి

1 డిసెంబరు, 2016

గుంటూరు

## 01. సంఘంలో జీవించడం ఎలా?

***1. ప్రశ్న: నా స్నేహితుడొకడు డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నాడు. చదువుల అంతాన్ని చూశాననీ, ఇక తానేమీ నేర్చుకో నక్కరలేదనీ అంటుంటాడు. అది ఎంతవరకూ సమంజసం?***

సమాధానం: ఈ ప్రపంచంలో ఎన్నో శాస్త్రాలు ఉన్నాయి. అన్నిటినీ అధ్యయనం చేయటం ఏ ఒక్కరికీ సాధ్యం కాదు. పట్టాలు పుచ్చుకున్నంత మాత్రాన చదువు పూర్తయినట్లు కాదు. ఎవ్వరూ తాము ఏదైనా పూర్తిగా నేర్చేసుకున్నామని చెప్పటం సరియైన విషయం కాదు. మనం చదువుకున్న దాని కన్నా నేర్చుకోవలసిన విషయాలు ఎన్నెన్నో ఉంటాయి. నా వరకు నేను 'జీవించి ఉన్నంతకాలం నేర్చుకుంటూనే ఉంటాను.' ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉంటూ క్రొత్త క్రొత్త విషయాలు నేర్చుకోవాలి.

***2. ప్రశ్న: మానవజీవితానికి లక్ష్యం ఏమిటి?***

సమాధానం: ప్రతి వ్యక్తికీ ఒక జీవిత లక్ష్యం ఉంటుంది. ధన సంపాదన, పేరుప్రతిష్టలు, పదవుల మీద కోరిక మొదలైనవి అందరికీ ఉంటాయి. క్రీడాకారులు, సంగీత విద్వాంసులు, పండితులు, కళాకారులు – అందరికీ ఏదోఒక లక్ష్యం ఉంటుంది. కానీ ఎనభైనాలుగు లక్షల జన్మలెత్తిన తర్వాత పొందిన ఈ మానవ జీవితపు లక్ష్యం –

భగవత్సాక్షాత్కారమే. అందుకు కావలసిన మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయం అనే మూడింటినీ పొందడం అతి దుర్లభమనీ, దేవుని అనుగ్రహం లేనిదే అవి లభించవనీ ఆదిశంకరులు చెప్పారు కదా! కాబట్టి మానవజన్మ నెత్తిన తర్వాత భగవత్సాక్షాత్కారం కోసం ప్రయత్నించాలి.

### *3. ప్రశ్న: ఆనందం ఎన్ని రకాలు?*

సమాధానం: ఆనందం మూడు రకాలు: విషయానందం, భజనానందం, బ్రహ్మానందం. ప్రాపంచిక విషయాల ద్వారా లభించే ఆనందం విషయానందం. భగవంతుడి దర్శనం కలగకపోయినా, ఆయన మన వాడని నమ్మకం కలిగిన తరువాత కలిగే ఆనందం భజనానందం. భగవంతుణ్ణి ముఖాముఖీ దర్శించిన తరువాత కలిగే ఆనందం బ్రహ్మానందం. శాలువా కప్పుకోవడానికి అలవాటు పడిన వాడు ముతక దుప్పటిని ఇష్టపడడు. తేనెటీగ పూలలోని మకరందాన్ని ఇష్టపడుతుంది కానీ, ఈగలలాగా కుళ్ళిన మాంసాన్ని ఇష్టపడదు. అదే విధంగా ఆధ్యాత్మికానందం చవిచూసిన సాధకునికి విషయానందం రుచించదు.

### *4. ప్రశ్న: పుణ్యపాపాలు లేవా?*

సమాధానం: ఉన్నాయి, లేవు! భగవంతుడు మనలో అహంకారం ఉంచినంతవరకూ మనలో భేదబుద్ధి కూడా ఉంటుంది. మంచిచెడులు, పాపపుణ్యాలు తెలుస్తూనే ఉంటాయి. అయితే, ఎవరిలో అహంకారం పూర్తిగా నశిస్తుందో వారు పాపపుణ్యాలకు, మంచిచెడులకు అతీతులు అవుతారు.

***5. ప్రశ్న: సర్వానికీ భగవంతుడే కర్త అయినప్పుడు మంచిచెడులు, పాపపుణ్యాల గురించి మాట్లాడడం ఎందుకు? పాపకార్యాలకు కూడా ఆయనే కర్త కదా! పాపాన్ని తన ఇష్టప్రకారమే చేయిస్తున్నాడు కదా?***

సమాధానం: పాపం అంటే ఆయనకు ఇష్టం అని ఎలా చెప్పగలవు? పాపపుణ్యాలను ఆయనే సృజించినా ఆయన నిర్లిప్తుడు. అంటే వాటితో ఆయనకు ప్రమేయం లేదు. గాలి దుర్వాసనలను, సువాసనలను రెంటినీ చేరవేయగలదు. కానీ దానికి మాత్రం ఇవేవీ అంటవు. ఆయన సృష్టే రకరకాలు. మంచిచెడులు, పాపపుణ్యాలు అన్నీ ఆయనే సృష్టించినా ఆయన వీటన్నింటికీ అతీతుడు. ఆయన లీలలను మనం తెలుసుకోలేము.

***6. ప్రశ్న: కులవ్యవస్థ గురించి మీ అభిప్రాయం ఏమిటి?***

సమాధానం: భగవంతుడు కులమత వ్యవస్థకు అతీతుడు. భగవంతుడి యందు అచంచలమైన భక్తిభావంతో కులమత వ్యవస్థ నుంచి బయటపడవచ్చు. భక్తులు ఏ కులానికీ చెందరు! వారు 'భక్త కులా'నికి చెందినవారు! పుట్టుకతో బ్రాహ్మణుడైనా భక్తి లేనివాడు బ్రాహ్మణుడు కాడు. పామరుడైనా భగవంతుడి యందు ప్రేమ కలిగివుంటే పరమపవిత్రుడే అవుతాడు. (ఒక కథ చెపుతా విను! 158. దివ్యావేశం పొందిన జాలరులు)

***7. ప్రశ్న: ఎవరితోనైనా మనస్స్పర్థలు కలిగినా, ఎవరైనా నన్ను అపార్థం చేసుకున్నా, మనశ్శాంతిని కోల్పోతున్నాను. ఆ స్థితిలో నేను అందరినీ ప్రేమించలేకపోతున్నాను. ఏమి చేయాలి?***

సమాధానం: మొదటవారితో మాట్లాడి సుహృద్భావం

నెలకొల్పడానికి ప్రయత్నించండి. అది సఫలం కాకపోతే చింతించకండి. భగవంతుణ్ణి శరణు వేడండి. ఆయనను ధ్యానిస్తూ, ఆయన ముందు మీ బాధను నివేదించుకోండి. భగవంతుడి కోసం తప్ప మరెవ్వరి కోసమూ మనస్సు కలతచెందనవసరం లేదు.

***8. ప్రశ్న: ప్రస్తుతం 'డాక్టరు' వద్దకు వెళ్ళాలంటే భయంగా ఉంది! టెస్టులు, ఫీజులతో రోగుల జేబులు కొల్లగొడుతున్నారు. డాక్టరు వృత్తి మీద మీ అభిప్రాయం ఏమిటి?***

సమాధానం: డాక్టరు (వైద్య) వృత్తి చాలా ఉన్నతమైనదనడంలో సందేహం లేదు. డబ్బు పుచ్చుకోకుండా, ఇతరులను బాధల నుంచి విముక్తి కలిగేలా చికిత్స చేయడం మహత్కార్యాలలో కెల్లా మహత్కార్యమే.

కానీ ధనం స్వీకరిస్తూ ఈ వృత్తి చేస్తే, కొంతకాలానికి మనిషి నిర్దయుడై పోతాడు. ధనార్జన నిమిత్తం వైద్యం చేయడం నీచమైన పని. అయితే నిస్వార్థబుద్ధితో కనుక వైద్యుడు తన ధర్మాన్ని నిర్వర్తిస్తే అది నిస్సందేహంగా ఉదాత్తమైన వృత్తి అవుతుంది.

***9. ప్రశ్న: మరి దుర్మార్గులను భగవంతుడు ఎందుకు సృష్టించాడు?***

సమాధానం: మహానుభావులను తయారుచేయడానికే! దుర్మార్గుల వలన కలిగిన కష్టాలను ఓర్చుకుంటూ, సాధు స్వభావంకలవారు మరింత ఆధ్యాత్మిక పురోభివృద్ధి సాధిస్తారు. ఇదంతా ఆయన లీల.

***10. ప్రశ్న: అన్నీ భగవంతుడే చేస్తున్నాడని భావిస్తే, మరి నేను చేసే దుర్మార్గాలన్నింటినీ కూడా ఆయనే చేయిస్తున్నాడనుకోవచ్చు కదా!***

సమాధానం: భగవంతుడు తాము చేసే పనులు చూస్తున్నాడనే జ్ఞానం ఉన్నవారెవరూ తప్పు పనులు చేయలేరు. దుర్మార్గంగా ప్రవర్తించలేరు.

ఆధ్యాత్మిక చైతన్యం జాగృతమైనవారు భగవంతుడికి ప్రీతి కలిగే రీతిలో ప్రవర్తిస్తారు. భగవంతుడి మీద వారికున్న ప్రేమ వలన వారు అన్నీ మంచి పనులే చేస్తారు.

***11. ప్రశ్న: లంచగొండితనాన్ని, హింసాప్రవృత్తిని నివారించలేమా?***

సమాధానం: మనం లంచగొండితనం, హింసాప్రవృత్తి ఎదుటివారిలో ఉందని ఎక్కువగా ఆందోళన చెందుతూ ఉంటాం. అటువంటి గుణాలు మనలో ప్రవేశించకుండా ఉండేటట్లు చేయమని భగవంతుణ్ణి ప్రార్థించాలి. అటువంటి పనులు చూసినపుడు, చేసినవారి దుర్గుణాలు పోవాలని దేవుణ్ణి వేడుకోవాలి. ఆయన కృపతో వారి అజ్ఞానం తొలగిపోయి, వారు అటువంటి పనులు మానివేస్తారు. అంతేకాక ఆ లక్షణాలు మన ప్రవర్తనలో కనపడకుండా మనం శాయశక్తులా, అహర్నిశమూ ప్రయత్నించాలి. అప్పుడే భగవంతుడు సానుకూల పరిస్థితులను కల్పిస్తాడు. దురాశ వలన లంచగొండితనం, అనుకున్నవి సాధించలేకపోవడం వలన క్రోధం కలుగుతాయి. నిత్యానిత్యవిచారణ ద్వారా ఈ రెండింటినీ తగ్గించుకోవచ్చు. మంత్రజపం వలన హింసా ప్రవృత్తి నశిస్తుంది.

***12. ప్రశ్న: ఈ రోజులలో ఆత్మహత్యలు సర్వసాధారణంగా జరుగుతున్నాయి. వాటి గురించి మీ అభిప్రాయం ఏమిటి? తల్లిదండ్రులు కోప్పడ్డారనో, ఎంసెట్‌లో రాంక్ రాలేదనో, ప్రేమ విఫలం అయిందనో యువకులు; కరవు పరిస్థితులు నెలకొన్నాయనో, అప్పుల ఊబిలో కూరుకుపోయామనో రైతులు; సంసారిక జీవనంలో సర్దుకోలేక దంపతులు; పిల్లల నిరాదరణకు గురైన వృద్ధులు - ఇలా ఎంతోమంది క్షణికావేశంలో ఆత్యహత్యలు చేసుకుంటున్నారు. దీనిని నివారించడం ఎలా?***

సమాధానం: 'క్షణికావేశం' అన్న మీ మాటలోనే ఈ ప్రశ్నకు సమాధానం ఉంది. మనోనియంత్రణ లేనివారు, జీవితంపట్ల సరైన అవగాహన లేనివారే ఆత్మహత్యకు పాల్పడతారు. ఆత్మహత్య మహాపాపం. చికాకులు, బాధలు భరించలేనివారు మానసిక ఒత్తిడితో, అశాంతితో ఆత్మహత్య చేసుకుంటూ ఉంటారు. కానీ ఆత్మహత్య వలన ఆ బాధల నుంచి విముక్తి లభించదు. మళ్ళీ జన్మించి కర్మఫలాన్ని అనుభవించవలసిందే.

మదగజాన్ని బురదలో కూరుకుపోయేలాగానూ, కుంటి వాణ్ణి కొండలమీద నుంచి దూకగలిగేలాగానూ భగవంతుడు చేయగలడు. భగవంతుడి ఆదేశం మేరకే అన్నీ జరుగు తున్నాయన్న నిర్మాణాత్మక దృక్పథం ఉంటే ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రాదు. మనం యంత్రాలం, ఆయన యంత్రాలను నడిపే చోదకుడు అన్న భావన మనకు ఎంతో ఊరటనిస్తుంది. తద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చు.

ఇక భగవత్సాక్షాత్కారం పొందినవారు దేహత్యాగం చేస్తే అది ఆత్మహత్య కాదు. భగవంతుణ్ణి పొందిన తరువాత ఈ

దేహంతో పని లేదు. విగ్రహం తయారయ్యాక మూస అవసరం లేదన్నదే దీనికి ఉదాహరణ.

### *13. ప్రశ్న: తమస్సుతో నిండినవారు తారసపడితే ఏమిచేయాలి?*

సమాధానం: పంచవటిలో ముక్కోపి అయిన ఒక సాధువు గురుదేవుల వద్దకు వచ్చి, తన హుక్కా వెలిగించుకోవడానికి నిప్పు దొరుకుతుందా అని అడిగాడు. గురుదేవులు ఎంతో భయభక్తులతో అతడు అడిగినదేదో అతడికి ఇచ్చివేశారు. ఆ సాధువు గదిలో నుంచి బయటకు వెళ్ళేవరకూ, గురుదేవులు ముకుళిత హస్తాలతో నిలబడేవున్నారు. ఆయనను చూసి భవనాథ్ అనే భక్తుడు, “ఆ సాధువు పట్ల మీకెంత భక్తి!” అని అన్నాడు. దానికి శ్రీరామకృష్ణులు నవ్వుతూ, “అతడు తమోగుణ నారాయణుడు. తమోగుణం కలవారిని అలాగే తృప్తి పరచాలి! పైగా అతడు సాధువు కూడా!” అన్నారు.

### *14. ప్రశ్న: దుష్టుడొకడు హాని చేయడానికి వచ్చినా లేక హాని చేసినా మనం చేతులు ముడుచుకు కూర్చోవాలా?*

సమాధానం: ఈ లోకంలో నివసించాలంటే, దుష్టులబారి నుంచి రక్షించుకునేందుకు కాస్త రజోగుణం ప్రదర్శించడం అవసరం. దుష్టుల ముందు ‘బుసకొట్టాలి’ సుమా! వారు మనకు హాని కలిగించకుండా ఉండడానికి వారిని భయ పెట్టడం అవసరం. కానీ అతడు హాని చేస్తాడని భావించి, ముందే నీవు వాడికి హాని చేయకూడదు. (ఒక కథ చెపుతా విను! 130. పాము–సాధువు)

***15. ప్రశ్న: మన సమాజంలో దుర్మార్గులు, దుష్టులు రోజురోజుకీ పెరిగిపోతున్నారనిపిస్తోంది. వీరితో ఎలా మసలుకోవాలి?***

సమాధానం: సర్వజీవులలో భగవంతుడున్నాడు. కానీ మంచివారితో సన్నిహితంగానూ, దుష్టులకు దూరంగానూ ఉండాలి. పులిలో కూడా నారాయణుడున్నాడు. అలాగని పులిని కౌగలించుకోరు కదా! పులిలో నారాయణుడున్నా, 'పులి వస్తోంది! పారిపో!' అని హెచ్చరించేవారు కూడా నారాయణులే కాబట్టి, వారి మాటలు వినాలి. (ఒక కథ చెపుతా విను! 19.మావటివాడూ నారాయణుడే)

***16. ప్రశ్న: అయ్యా! నేను మహాదుష్టుణ్ణి. నేను చేయని పాపం అంటూ లేదు. నేను ఎంత పాతకుడినంటే నేను కూర్చున్న ప్రదేశం కూడా అపవిత్రం అయిపోతుంది. నాకు ఏమైనా మార్గం ఉందా?***

సమాధానం: భగవంతుడి పట్ల విశ్వాసం కలిగి ఉంటే సకలం సిద్ధిస్తుంది. అయితే 'నేను పాపిని' అని సర్వవేళలా 'పాపాల' గురించి ఆలోచిస్తే 'పాపివే' అవుతావు. 'యద్భావం తద్భవతి' కదా! నీ ఆలోచనలను మార్చుకోవడానికి చిత్త శుద్ధితో ప్రయత్నించాలి. ఆయన తలచుకుంటే ఒక్క క్షణంలో నీ పాపాలన్నీ భస్మమవుతాయి. అది ఎలాగో తెలుసా? వేయి సంవత్సరాలుగా చీకటిలో మ్రగ్గుతున్న గదిలోకి దీపం తెచ్చా వనుకో! అప్పుడు ఆ గదిలో కొద్దికొద్దిగా వెలుతురు నిండు తుందా లేక క్షణంలో ఆ గది ప్రకాశవంతమవుతుందా? క్షణంలో కదా! అదే విధంగా భగవంతుణ్ణి చిత్తశుద్ధితో, ఆర్తితో తలచుకుంటే నీ పాపం మటుమాయం అవుతుంది.

***17. ప్రశ్న: మహాపురుషులు, సాధువులు, మహాత్ములు అనబడేవారి ప్రక్కన చాలాసార్లు దురాశాపరులు, స్వార్థపరులు, అసూయాపరులు, నయవంచకులు, దుష్టులు ఉంటారు. ఎందుకని?***

సమాధానం: అటువంటి వ్యక్తులుండడంలో కూడా ఒక అర్థం ఉన్నది. శ్రీకృష్ణుని జీవితంలో, ఆయనను ప్రేమను చూరగొన్న రాధ గురించి దుష్ప్రచారం చేసి, చాలా కష్టాలకు గురిచేసిన ఆమె అత్తగారు 'జటిల', ఆడపడుచు 'కుటిల' కనిపిస్తారు. కానీ ఈ అవరోధాల వలన రాధకు కృష్ణుడి మీది ప్రేమ మరింత అధికమయింది. అదే విధంగా ఇటువంటి దుష్టపాత్రల వలన మహాత్ముల బోధలు మరింత ప్రకాశవంతం అవుతాయి. అంతేకాదు ఆ దుష్టుల ప్రవర్తనలో కూడా మార్పు రావచ్చు. వారి దుష్టప్రవర్తన వలన కలిగే కష్టాల నుంచి భక్తులను ఆ భగవానుడే కాపాడతాడు.

***18. ప్రశ్న: ఈ రోజుల్లో భక్తిపరమైన సినిమాలు చాలా వస్తున్నాయి. వాటిలో భక్తుల పాత్రలు వేసే వాళ్ళు నిజజీవితంలో దుశ్శీలురుగా ఉంటారు. మరి అటువంటి సినిమాలు చూడవచ్చా?***

సమాధానం: భక్తి సినిమాలు చూడటంలో తప్పులేదు. కానీ ఆ భక్తుల పాత్రలు వేసేవారిని మనుష్యులుగా చూడక సాక్షాత్తూ ఆయా దేవతలనే చూడాలి. చెక్కతో చేసిన సీతాఫలం నిజమైన సీతాఫలాన్ని గుర్తుకు తెస్తుంది. అదే విధంగా భక్తుల పాత్రలు ధరించే నటుల్ని కూడా వారు తమ నిజజీవితంలో ఎటువంటి వారైనా, మన దృష్టిలో మాత్రం తాము పోషించే పాత్రకు సంబంధించిన దేవతగానే భావించి, ఆనందించాలి. అసలు, నకళ్ళను ఒకటిగానే చూడాలి.

## 02. గృహస్థజీవితం

***19. ప్రశ్న: సంసారంలో ఏ విధంగా మసలుకోవాలి? సంసారంలో ఉంటూనే ఆధ్యాత్మిక సాధనలు ఎలా చేయాలి?***

సమాధానం: పనులన్నీ చేస్తూనే ఉండాలి కానీ మనస్సును మాత్రం భగవంతుడి మీద ఉంచి – ఆలుబిడ్డలు, బంధువులు, తదితరులు – ఎవ్వరూ కూడా నీవారు కారు అనే ఎరుకను కలిగివుండు.

ఒక ధనవంతుని ఇంట పని చేసే దాసీ, అక్కడి పనులను తన సొంత పనులలాగే నిర్వర్తించినా, అక్కడ తనకు సంబంధించినది ఏదీ లేదని ఆమెకు స్పష్టంగా తెలుసు.

తాబేలు నీటిలో తిరుగుతున్నప్పటికీ, దాని మనస్సు మాత్రం గట్టు మీద ఉన్న దాని గుడ్ల మీదే ఉంటుంది. అలాగే మనం ఏం చేస్తున్నా మనస్సును భగవంతుడి మీద ఉంచాలి.

చేతులకు నూనె రాసుకుని, పనసపండు ఒలిచి తొనలను తీస్తే, చేతికి పనస జిగురు అంటదు. అలాగే భగవచ్చింతన చేస్తూ సంసారంలో మసలుకోవాలి.

బురదచేప బురదలోనే రోజంతా గడిపినా, దాని శరీరానికి బురద అంటదు. అలాగే మనం కూడా ప్రపంచంలో జీవిస్తున్నా ప్రాపంచికత అంటకుండా ప్రవర్తించాలి. నీటిలో పడవ ఉండవచ్చు కానీ పడవలో నీరు ఉండకూడదు కదా!

### *20. ప్రశ్న: సంసారంలో మంచి చెడులపట్ల ఎలాంటి వైఖరిని కలిగివుండాలి?*

సమాధానం: ఒక చోట పంచదార, ఇసుక కలసివుంటే, చీమ పంచదార రేణువులను మాత్రమే తీసుకుపోతుంది. ఆ చీమలాగే ఎవరు నీవారో (అంటే భగవంతుడు మాత్రమే నీవాడని) తెలుసుకుని జీవించాలి.

పాలు, నీరు కలిసిన మిశ్రమం నుంచి హంస పాలను విడదీసి స్వీకరిస్తుంది. అలాగే మనల్ని భగవంతుణ్ణి చేర్చేవారితోనే స్నేహం చేయాలి.

### *21. ప్రశ్న: అధిక సంపదల కోసం ప్రయత్నించవచ్చా?*

సమాధానం: అది ధార్మిక జీవనం కోసం అయితే చేయవచ్చు. అధిక సంపాదన న్యాయమార్గంలో, అంటే సరైన పద్ధతిలోనే చేయాలి. మన లక్ష్యం ధన సంపాదన కారాదు. భగవత్సేవయే మన లక్ష్యం! భగవంతుణ్ణి సేవించడానికి సంపాదించే ధనంలో దోషం ఉండదు. ధనం సంపాదించకపోతే ఆలుబిడ్డలను ఎవరు పోషిస్తారు? జీవన యాత్రకు సరిపడినంత వరకు మాత్రమే ధనం సంపాదించాలి. అదే సమయంలో ఏకాంత ప్రదేశంలో అశ్రుపూరిత నయనాలతో, ఆ లౌకిక కర్తవ్యనిర్వహణ నిష్కామభావంతో జరిగేటట్లు ప్రార్థించాలి.

దానధర్మాలు అధికంగా చేస్తూవుంటే, పేరుప్రతిష్ఠల మీద మోజు కలిగే ప్రమాదం ఉంది. కావాలని అనేక కార్యకలాపాలలో పాల్గొనడం మంచిది కాదు. వాటిలోపడి భగవంతుణ్ణి మరచిపోయే ప్రమాదం ఉంది. నీ ముందుకు వచ్చే

అత్యవసరమైన కార్యకలాపాలనే చేపట్టు. ధనాన్ని భగవత్సేవలోనూ, సాధువుల భక్తుల సేవలోనూ, దానధర్మాలలోనూ వెచ్చించేవారే, దానిని సద్వినియోగపరుస్తున్నవాళ్ళు. వారి ధనం సఫలం అవుతుంది.

***22. ప్రశ్న: కుటుంబ బాధ్యతలు ఎన్నాళ్ళు మోయాలి?***

సమాధానం: కూడుగుడ్డలకు కష్టపడనవసరం లేనంత వరకు. పిల్లలు తమ కాళ్ళ మీద తాము నిలబడ్డ తరువాత వాళ్ళ భారాన్ని వహించవలసిన అవసరం లేదు. పక్షి పిల్ల స్వయంగా ఆహారం సంపాదించుకోవడం నేర్చిన తర్వాత తల్లి వద్దకు వెడితే, తల్లి పక్షి దానిని ముక్కుతో పొడిచి వెళ్ళగొడుతుంది కదా!

***23. ప్రశ్న: లోకవ్యవహారాలలోనూ, వస్తువుల పట్ల ఎలా ఉండాలి?***

సమాధానం: దేవేంద్రనాథ్ మజుందార్ అనే భక్తుడు శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చినపుడు, చెప్పులు దూరంగా విడిచి రావడం గమనించిన గురుదేవులు, “అంత దూరంలో విడిస్తే ఎవరైనా ఎత్తుకు పోతారు. వాటిని దగ్గరగా వసారాలో విడిచిరా!” అని హితవు చెప్పారు.

ఒక భక్తుడు కత్తినీ, గొడుగునూ మర్చిపోయి వచ్చిన సందర్భంలో గురుదేవులు ఇలా అన్నారు. “నిరంతరం దైవోన్మత్తతలో శరీరం మీద బట్టలు ఉన్నాయో లేవో తెలియని స్థితిలో ఉన్నప్పటికీ నేను అన్ని విషయాలలోనూ జాగ్రత్తగానే ఉంటాను. మీరు పూర్తి స్పృహలో ఉన్నా అన్నీ మరచిపోతారెందుకు?”

***24. ప్రశ్న: అయ్యా! గృహస్థులమైన మేము పిల్లల బాధ్యతలలో, ఇంటిపనులలో ఎప్పుడూ తలమునకలై ఉంటాము. ఆధ్యాత్మిక సాధనలైన జప, ధ్యానాదులు చేసే సమయమే ఉండదు. మా గతి ఏమిటి?***

సమాధానం: నీతిమంతమైన జీవితాన్ని గడపాలి. భగవన్నామాన్ని క్రమం తప్పకుండా కొన్ని సార్లయినా జపించాలి. ఒకవేళ అందుకు కూడా తీరిక లేకపోతే మనస్ఫూర్తిగా భగవంతుడి పేరును కొన్నిసార్లు స్మరిస్తే చాలు. మరే ఇతర సాధనలూ చేయనక్కరలేదు.

***25. ప్రశ్న: నా మిత్రుని పుత్రుడు (ఎదిగిన కుర్రవాడు) మరణించాడు. అతడు పుత్రశోకంలో మునిగిపోయి ఉన్నాడు. అతణ్ణి ఎలా ఓదార్చాలి?***

సమాధానం: మనం మాత్రం ఏం చేయగలం? మనం కూడా మృత్యుదేవతను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. మరణం అనివార్యం. దేహధారణ చేసిన తర్వాత పుట్టెడు కష్టాలు అనుభవించవలసిందే! భగవంతుడి నామ సంకీర్తన, రూపధ్యానం, లీలాధ్యానం మొదలైన ఆయుధాలతో పోరు సాగించాలి.

భగవంతుడికి మన ముక్త్యారునామా ఇచ్చి, మన భారం ఆయన మీద మోపినప్పుడు మనకు దుఃఖం కలుగదు. అంతా ఆయన ఇష్టప్రకారమే జరగనీయండి. ఇల్లు, భార్య, పిల్లలు – ఇవన్నీ అనిత్యమే, మూణ్ణాళ్ళ ముచ్చట్లే! తాటి చెట్టే వాస్తవం. దాని నుండి రాలి పడిపోయే ఒకటి, రెండు తాటికాయల కోసం విలపించడం ఎందుకు?

***26. ప్రశ్న: సంసారజీవులకు తరించే ఉపాయమే లేదా?***

సమాధానం: ఖచ్చితంగా ఉంది. అప్పుడప్పుడు సాధుసాంగత్యం చేయాలి. అప్పుడప్పుడు ఒంటరిగా, ఈశ్వర చింతన చేస్తూ భక్తివిశ్వాసాల కోసం ప్రార్థించాలి. భగవంతుడు మనల్ని తప్పక ఆదుకుంటాడనే విశ్వాసం ఒక్కటుంటే చాలు. విశ్వాసానికి మించిన వేరొక వస్తువు లేదు సుమా!

***27. ప్రశ్న: స్వామీ! నాకిప్పుడు ఈ ఉద్యోగంవల్ల సాధన, జపం, ధ్యానం చేసేంత తీరిక లేదు. కనుక రిటైర్ అయ్యాక తీరికగా సాధన ప్రారంభిస్తాను. పైగా ఇప్పుడెన్నో సమస్యలు - కుటుంబపరంగా, ఆర్థికపరంగా, ఉద్యోగపరంగా ఎంతో ఒత్తిడిలో ఉన్నాను. ఇవన్నీ తీరాక సాధన చేస్తాను.***

సమాధానం: నీబోటివాడే ఒకడు సముద్ర స్నానానికి వెళ్ళాడట. ఎంతకీ నీటిలోకి దిగకుండా ఒడ్డునే వేచివున్నాడు. అతణ్ణి చూస్తున్న మరొకడు, "ఏమయ్యా! స్నానం చేయడానికి వచ్చి, చేయవెందుకు?" అని అడిగాడు. "సముద్రంలో అలలు ఆగిపోయాక స్నానం చేస్తాను!" అని అతడు సమాధానం చెప్పాడట!

అలాగే జీవితంలో పనులు, సమస్యలు ఉండడం అనేది సర్వసాధారణం. వాటిని ఎదుర్కొంటూనే సాధన చేయాలి. యుక్తవయస్సులో చేయలేనిది వృద్ధాప్యంలో ఎలా చేస్తారు? నిజానికి, ఆ సమస్యలే మనల్ని భగవంతుడి వైపు నడిపించడంలో సహాయపడతాయి!

***28. ప్రశ్న: మహాశయా! నాకు చాలామంది భక్తులతో పరిచయం ఉంది. వారిలో కొంతమందిని నేను బాగా ఇష్టపడతాను. వారి సాంగత్యంలోనే ఉందామని అనిపిస్తుంది. మరి కొంతమంది***

***సాంగత్యం నాకు నచ్చదు. ఈ వైఖరి సరియైనదేనా?***

సమాధానం: ఈ వైఖరి సరియైనది కాదు. అది సంకుచిత మనస్తత్వపు లక్షణం. భగవంతుడికి అర్పించే పూలు వైవిధ్యభరితంగా ఉన్నట్లే, ఆయన భక్తులు కూడా రకరకాల కోవలకు చెందిన వారుగా ఉంటారు. ఇతరులతో కలుపుగోలుతనంతో మెలగకపోవడం సంకుచిత మనస్తత్వాన్ని సూచిస్తుంది. కాబట్టి అటువంటి మనస్తత్వాన్ని వదిలించుకొని, భక్తులందరితో సఖ్యంగా ఉండాలి.

***29. ప్రశ్న: మాలో కామక్రోధాది శత్రువులు ఉన్నాయి. ఎంత వదిలించుకుందామన్నా అవి మళ్ళీమళ్ళీ తలెత్తుతున్నాయి. వాటిని తొలగించుకునే మార్గమేదో తెలియచేయండి?***

సమాధానం: కామం, క్రోధం, లోభం మొదలైన శత్రువులను భగవన్ముఖం చెయ్యండి. కామం అంటే ఏమిటి? కావాలన్న బలమైన కోరికే కామం. ఆ కామాన్ని భగవంతుడి మీదకు మరల్చండి. ఏదైనా కోరాలంటే భగవంతుణ్ణే కోరండి. క్రోధం చూపాలంటే, భగవన్మార్గంలో మీకు అవాంతరం కలిగిస్తున్న పరిస్థితుల మీద, మీ బలహీనతల మీద క్రోధం పూనండి. భగవంతుణ్ణి పొందాలనే లోభం కల్పించుకోండి. నాది నాది అనుకోవాలనుకుంటే భగవంతుణ్ణే నావాడని పలుకండి. నా రాముడు. నా కృష్ణుడు అని చెప్పండి. అహంకారం పోవడం ఎంతో కష్టం. కాబట్టి నేను దేవుడికి దాసుణ్ణి, సేవకుణ్ణి అన్న భావంతో దాన్ని పడివుండనివ్వండి. విభీషణుడిలాగా, 'నేను శ్రీరాముడి పాదాలు ఆశ్రయించాను. మరి ఎవరికీ తలవంచను!' అన్న అహంకారం కలిగి ఉండండి.

### *30. ప్రశ్న: స్వామీ! సంసారం మిథ్యయేనా?*

సమాధానం: భగవంతుణ్ణి తెలుసుకోనంతవరకూ క్షణక్షణం మారిపోయే ఈ సంసారాన్ని మిథ్య అనే అర్థం చేసుకోవాలి. లేకపోతే మనుష్యులు నేను, నాది అనుకుంటూ మాయలో మునిగిపోతారు. మాయలో నుంచి బయటపడే మార్గం కంటికి ఎదురుగానే ఉన్నా అందులోనుంచి బయటకు రాలేరు. ఎందరెందరో పుడుతున్నారు, గిడుతున్నారు. "జీవితం క్షణభంగురం" అన్నది నిత్యం మనకు అనుభవమవుతూనే ఉంది కదా! కాబట్టి, సంసారం మిథ్య, అనిత్యం. సాలెపురుగు తానుకట్టుకున్న గూటిలో తానే బందీ అయినట్టుగా కనిపిస్తుంది. కానీ సాలీడు తలుచుకుంటే బంధనాలను తెంచుకుని బయటపడగలదు. అలాగే, మనస్ఫూర్తిగా తలుచుకుంటే సంసారం అనే మాయ నుంచి బయటపడవచ్చు.

### *31. ప్రశ్న: భగవంతుడు మమ్మల్ని ఇలా సంసారంలో ఎందుకు బంధించాడు?*

సమాధానం: సంసారం కర్మక్షేత్రం. అందులో భగవదర్పిత బుద్ధితో కర్మలు చేయడం ద్వారా క్రమేణా జ్ఞానం కలుగుతుంది. అదే ఈ ప్రపంచం యొక్క అంతరార్థం. చేయవలసిన కర్మలు, చేయకూడని కర్మలు, నిష్కామ కర్మలు ఏవేవో గురువు ఉపదేశిస్తాడు. కర్మలు చేస్తున్న కొద్దీ మనస్సులోని మాలిన్యాలు నశించి పవిత్రత చేకూరుతుంది. పవిత్రత కలవారే భగవంతుడి సామ్రాజ్యానికి అర్హులు.

***32. ప్రశ్న: సంసారంలో ఇన్ని దుఃఖాలు ఎందుకుంటాయి?***

సమాధానం: ఈ ప్రపంచం అనేది భగవంతుడు ఆడే ఆట. దాన్ని పిల్లలు ఆడుకునే దాగుడుమూతలాటతో పోల్చవచ్చు. దాక్కుంటూ, అటుయిటూ పరిగెత్తుతూ దొంగకు దొరకకుండా తల్లిని తాకాలి. భగవంతుణ్ణి తెలుసుకోవడాన్ని తల్లిని తాకడంతో పోల్చవచ్చు. దాగుడుమూతలాటలో తల్లిని తాకాలి కాని ఆ ఆట ప్రారంభంలోనే ఆమెను తాకితే అది ఆమెకు సంతుష్టిని కలిగించదు. కొంచెం ఆట కొనసాగడమే అమ్మకు ఇష్టం. అలాగే ఈ ప్రపంచంలో మనం కష్టసుఖాలన్నింటినీ అనుభవిస్తూ, చివరికి భగవంతుణ్ణి చేరడమే ఆ ఆట!

***33. ప్రశ్న: అయ్యా! మీరైతే భార్య ఉన్నప్పటికీ కామవాసన లేశమైనా లేకుండా ఆధ్యాత్మిక సాధనలు చేసి, చరిత్రలోనే అపురూపమైన ఆదర్శ దాంపత్యం గడిపారు. కానీ కామవాసనలు, స్త్రీపురుష ఆకర్షణలు ఉన్న మాబోటి వాళ్ళ సంగతేమిటి? మాకది సాధ్యమేనా? కుటుంబ నియంత్రణ మీద మీ అభిప్రాయం ఏమిటి?***

సమాధానం: అందరూ మాలాగే ఉండాలని నేను చెప్పను. నేను 16 అణాల సాధన చేస్తే, అందులో 16వ వంతు – అంటే ఒక్క అణా వంతు సాధన – మీరు చేస్తే చాలని చెప్పాను. కాబట్టి, మీరు సంసారులలాగా జీవిస్తే తప్పేమీ లేదు. కానీ ఒకరిద్దరు పిల్లలు కలిగాక, అన్నాచెల్లెళ్ళలా జీవితం గడపాలి. ఒకరికొకరు ఆధ్యాత్మిక మార్గంలో సహకరించు కోవాలి. కామాన్ని జయించాలని మీరు నిజంగా కోరుకుంటే 'హరినామ స్మరణ'ను నిజాయితీగా, మనస్ఫూర్తిగా భక్తిశ్రద్ధల

తో చేయండి. ఆయన కరుణతో మీరు కామజయాన్ని సాధించ గలుగుతారు, దేహభ్రాంతిని వదిలించుకోగలుగుతారు.

***34. ప్రశ్న: ఈ ఆధునిక యుగంలో ఎక్కడ చూసినా వివాహబంధాలు విచ్ఛిన్నమవుతూ కనిపిస్తున్నాయి. ఎందుచేతనంటారు? అలా కాకుండా ఏదైనా మార్గం ఉందా?***

సమాధానం: కామకాంచనాలే ఈనాడు మనుష్యులకు ఆదర్శంగా తయారయ్యాయి. అందుచేతనే ఈ వైపరీత్యాలన్నీ! మనుష్యులు ఏదోవొక విధంగా కామకాంచనాలలో ఓలలాడాలని ప్రయత్నించడం వలన, ఓరిమిని కోల్పోయి, వైషమ్యాలకు తావిస్తున్నారు. మనం చూస్తున్న సమస్యలన్నింటికీ కారణం అదే. మనుష్యులకు చిన్నతనం నుంచీ ధర్మబుద్ధితో జీవించడం నేర్పాలి. నిస్వార్థబుద్ధితో జీవించడమే ధర్మజీవనం.

భగవంతుణ్ణి కేంద్రంగా చేసుకుని జీవిస్తే, ఏ సమస్యలూ ఉండవు. పిల్లలకు చిన్నప్పుడే సుమతీశతకం, కుమార, కుమారీ శతకాలు, రుక్మిణీకళ్యాణం, సీతారాముల చరిత్ర, హనుమంతుడి కథ మొదలైనవి ఉగ్గుపాలతో రంగరించి పోయాలి. తల్లిదండ్రులు రాజీకి తావులేకుండా తమ సొంత జీవితాలను ఆదర్శవంతమైనవిగా తీర్చిదిద్దుకోవాలి. వారిని చూసి పిల్లలు తమ జీవితాలను చక్కదిద్దుకుంటారు. అప్పుడే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

***35. ప్రశ్న: నాకు ఈ మధ్యనే వివాహం అయింది. నా భార్య నన్ను అమితంగా ప్రేమిస్తున్నది. నేను కూడా ఆమెను అలాగే ప్రేమిస్తున్నాను. ఆమె నా సొంత మనిషి, నా తోడు-నీడ***

***అనిపిస్తున్నది. ఆమె ప్రేమ ముందు భగవంతుడి ప్రేమ కూడా దిగదుడుపే అనిపిస్తోంది. ఆమె మీద నాకు ఇంత ప్రేమ ఎందుకు కలుగుతున్నది?***

సమాధానం: విద్యాస్వరూపిణి అయిన భార్యే నిజమైన జీవితభాగస్వామిని. భర్త భగవన్మార్గంలో పురోగమించడానికి ఆమె విశేషంగా సహాయపడుతుంది. అటువంటి భార్యాభర్తలు ఒకరిద్దరు పిల్లలు పుట్టిన తరువాత అన్నాచెల్లెళ్ళలాగా జీవిస్తారు. ఇద్దరూ భగవంతుడి భక్తులు – సేవకుడు, సేవిక. వారి సంసారం విద్యాసంసారం. భగవంతుడితోను, భక్తులతోను వారు సదా ఆనందం పొందుతారు. భగవంతుడు మాత్రమే తమ సొంత మనిషనీ, ఎప్పటికీ ఆయనే తమ తోడునీడగా ఉంటాడనీ తెలుసుకుంటారు.

అయితే, అవిద్యాస్వరూపిణి అయిన భార్య వలన భర్త చాలా ఇబ్బంది పడతాడు. జగజ్జనని యొక్క భువనమోహినీమాయకు లోనయినవాడు, ఆ భార్య కారణంగా ఎన్నో దుఃఖాలను అనుభవించినా, ఆమె కంటే సన్నిహితురాలు ఇంకెవరూ లేరని అనుకుంటాడు.

అయితే ఈ మాయలో నుంచి బయట పడేదెలా? భగవంతుణ్ణి చిత్తశుద్ధితో శరణువేడిన వారికి ఆయనే మార్గాన్ని చూపుతాడు.

***36. ప్రశ్న: అయ్యా! నా కుటుంబసభ్యులు నన్నెంతో ప్రేమిస్తారు. వారి కోసమే నేను ఈ సంసారాన్ని అంటిపెట్టుకుని, వదలలేకుండా ఉన్నాను. నా ఆలోచన తప్పు కాదు కదా?***

సమాధానం: ఈ సంసారబంధం అంతంత మాత్రమే.

బ్రతికివున్నప్పుడు ఎంత ప్రేమ చూపినా, మనిషి చనిపోయిన తర్వాత అతడి గురించి పట్టించుకోక తమ జీవితాలను ఎలా సర్దుకోవాలని బంధువులు ఆలోచిస్తారు. కాబట్టి ఈ సాంసారిక మైన ప్రేమ అంతా భ్రాంతి మాత్రమే! (ఒక కథ చెపుతా విను! 107. సంసారబంధం భ్రాంతి మాత్రమే)

### *37. ప్రశ్న: విషయవాంఛలను కొంచెం కొంచెంగా తీర్చుకుంటే తప్పేమిటి?*

సమాధానం: కోరికలు, అవసరాలు చిన్నచిన్నవిగానే కనిపించినా అవి ఒకదాని వెంట ఒకటి గొలుసుకట్టుగా వస్తూనే ఉంటాయి. ఈ ఒక్కటే కదా ఫర్వాలేదులే అనుకుంటే ముగిసిపోదు. ఒకదాని వెనుక ఒకటి వస్తూనే ఉంటాయి. క్రమక్రమంగా పెద్దపెద్ద కోరికలు కూడా పుట్టుకు రావడమే కాక అవే తప్పనిసరి అవసరాలలాగా కనిపిస్తాయి. అంతిమంగా మనిషిని తప్పుదోవ పట్టిస్తాయి. (ఒక కథ చెపుతా విను! 115. సన్న్యాసి-గోచీ)

### *38. ప్రశ్న: 'పాపోఽ హం, పాపకర్తాహం...' అని పూజలలో అర్చకులు మన చేత చెప్పిస్తూ ఉంటారు. అది ఎంతవరకూ సరైనది?*

సమాధానం: అది సరైన పద్ధతి కాదు. "పాపోఽ హం, పాపకర్తాహం, పాపాత్మా, పాపసంభవః, త్రాహి మాం కురు మే దేవ రక్షరక్ష మహేశ్వర!" అంటూ, "నేను పాపిని, నేను పాపంలో పుట్టాను, పాపపు పనులే చేస్తాను... నన్ను క్షమించు!" అంటూ ప్రార్థన చేస్తారు. ఇలా మాటిమాటికీ నేను పాపిని అనడం వల్ల మనం నిజంగానే పాపులమవుతాము!

దానికి బదులు 'పుణ్యోఽహం, పుణ్య కర్తాహం, పుణ్యాత్మా, పుణ్యసంభవః' అని చదవితే దానివల్ల నిజంగా మేలు కలుగుతుంది. భగవంతుడి మీద ప్రగాఢవిశ్వాసంతో, "హే భగవాన్! నేను నీ నామాన్ని ఉచ్చరిస్తున్నాను. నాకు తల్లీ, తండ్రీ నీవే! నేను తెలిసో, తెలియకో తప్పు చేశాను. మరల ఇకముందు ఎన్నడూ ఇటువంటి తప్పు చేయను!" అని వాగ్దానం చేయండి. సత్ప్రవర్తనతో మెలగండి! మనం చేసినది ఎంత హీనమైన పాపమైనా, భగవంతుడు మనల్ని క్షమించి, మనకు మార్గదర్శకుడు అవుతాడు.

***39. ప్రశ్న: (గిరీష్ చంద్ర ఘోష్) మహాశయా! తల్లిదండ్రులు ఘోరాపరాధం చేసి ఉంటే, మహాపాపం చేసి ఉంటే, ఏమి చెయ్యాలి?***

సమాధానం: తల్లి నీతి తప్పినా ఆమెను త్యజించకూడదు. తల్లిదండ్రులు మహాత్ములు.

## 03. మతాలు, మార్గాలు

***40. ప్రశ్న: అన్ని మతాలవారు పూజించే దేవుడు ఒక్కడే అని మీరంటారు కదా! అయితే మరి దేవుణ్ణి రకరకాలుగా ఎందుకు వర్ణిస్తారు?***

సమాధానం: ఒక కుటుంబంలోని పెద్దను అతడితో ఉన్న సంబంధాన్ని బట్టి కుటుంబసభ్యులు తండ్రిగానూ, అన్నగానూ, తమ్ముడుగానూ, మామగానూ, భర్తగానూ భావిస్తూ ఉంటారు కదా! అదే విధంగా భక్తులు తమతమ మనోభావాలను బట్టి దేవుణ్ణి రకరకాలుగా వర్ణిస్తూ ఉంటారు. రూపాలు, పేర్లు ఎన్ని ఉన్నా దేవుడొక్కడే.

***41. ప్రశ్న: మతాల నియమావళి వేర్వేరుగా ఉన్నప్పుడు మేము దేన్ని అనుసరించాలి?***

సమాధానం: అన్నింటిలోనుంచీ మంచిని తీసుకోవాలి. దయ చూపడంలో క్రైస్తవుని లాగా; ఆచారాలు, పట్టుదల విషయంలో మహమ్మదీయునిలాగా; ఉదార స్వభావంలోనూ, హృదయ విశాలతలోనూ హిందువులాగా ప్రవర్తించాలి.

***42. ప్రశ్న: మతాల మధ్య కొట్లాటలు, పోరాటాలు అనాదిగా సాగిపోతూనే ఉన్నాయి. ఇలా ఎందుకు జరుగుతున్నది?***

సమాధానం: వ్యాకులత, ఆసక్తి ఉన్నట్లయితే ఏ మతాన్ని అనుసరించినా ఫరవాలేదు. భగవంతుడు తప్పక సాక్షాత్కరిస్తాడు. వైష్ణవులైనా, శాక్తేయులైనా, వేదాంతులైనా, బ్రహ్మసమాజ భక్తులైనా అందరూ భగవంతుణ్ణి దర్శిస్తారు. కావలసినది ఆర్తి! అది ఉన్నట్లయితే ఏ మతాన్ని అనుసరించినా భగవంతుణ్ణి పొందవచ్చు.

కానీ స్వమతదురభిమానం ఉన్నవాళ్ళు మాత్రం నా మతం ఒక్కటే సత్యమనీ, తక్కినవన్నీ కాదనీ తలుస్తారు. తగవులాడుకుంటారు. కానీ భగవంతుడి స్థితి ఇది అని ఎవ్వరూ నిర్ణయించలేరు, నిర్వచించలేరు. అది ఎవ్వరికీ సాధ్యం కాదు. భగవంతుడు సర్వలక్షణ సమన్వితుడు. (ఒక కథ చెపుతా విను! 117. గుడ్డివాళ్ళు – ఏనుగు)

### *43. ప్రశ్న: నేను మతం మారదామనుకుంటున్నాను. ఏమంటారు?*

సమాధానం: లక్ష్యాన్ని సాధించాలంటే నిలకడతనం కావాలి. తమ మతానికే అంటిపెట్టుకొని ఉండలేని వారు తొందరపాటుతో ఒకదాని వెంట ఒకటిగా ఇతర మతాలకు మారి చివరకు తమ వృద్ధాప్యంలో అసలు మతప్రస్తావనే మానివేసి నాస్తికులుగా తయారవుతారు. అలాకాక తమకు నచ్చిన ఒకే మతానికి అంటిపెట్టుకుని ఉండేవారు లక్ష్యాన్ని సాధించగలుగుతారు. (ఒక కథ చెపుతా విను! 90. బావులు త్రవ్వడం)

### *44. ప్రశ్న: "నేను దాసుడను" అనే భావనలో ఆ 'నేను' ఎవరు? జీవాత్మ అంటే ఏమిటి?*

సమాధానం: 'నేను' అనేదే జీవాత్మ. దానినే సూక్ష్మశరీరం, లింగశరీరం అని కూడా అంటారు. మనోబుద్ధ్యహంకారచిత్తాలతో కూడినదే అది. అష్టపాశాలతో ఆత్మ బంధింపబడినప్పుడు జీవాత్మ అవుతాడు. అంటే, పరమాత్మ తనకు తానుగా మాయకు లోబడి బంధాలలో చిక్కుబడినప్పుడు జీవాత్మ అని పిలువబడతాడు.

### *45. ప్రశ్న: ఈ రోజులలో 'యోగ', 'యోగ' అంటూ ఆసనాలు వేయడం మొదలైనవన్నీ విపరీతంగా ప్రచారమవుతున్నాయి. వాటి గురించి మీ అభిప్రాయం ఏమిటి?*

సమాధానం: అదంతా 'హఠయోగం' క్రిందికి వస్తుంది. హఠయోగులు శరీరం లోపలి అంగాల శుద్ధి, తద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యమే తమ లక్ష్యంగా పని చేస్తారు. దేహాన్ని ఎక్కువ కాలం నిలుపుకోవడం కోసం, మరిన్ని ఇంద్రియ సుఖాలను అనుభవించడం కోసం కృషి చేస్తుంటారు. అది అంత మంచిది కాదు. కామకాంచన త్యాగం, తద్వారా భగవంతుడికి దగ్గర కావడమే జీవితగమ్యం కావాలి.

మరొకవైపు, భగవంతుడు ఇచ్చిన శరీరాన్ని ఆరోగ్యంగా నిలుపుకోవడం కూడా మన కర్తవ్యం. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అని ఆర్యోక్తి. భగవంతుడికి దగ్గరయ్యే సాధనలు చేయడానికి బలమైన శరీరం, బలమైన మనస్సు అత్యావశ్యకం. మానవ శరీరానికి చాలినంత వ్యాయామం ఇవ్వకపోతే రోగగ్రస్తం అవుతుంది. ఒక రోగి కంటే ఆరోగ్యవంతుడైన మానవుడే బాగా సాధనలు చేసి గమ్యాన్ని చేరుకోగలడు.

### *46. ప్రశ్న: అహింసా సిద్ధాంతం గురించి మీ అభిప్రాయం?*

సమాధానం: తమోగుణాన్ని హింసకు ప్రతిరూపంగా చెపుతారు. 'భగవంతుడి దర్శనం కోసం హఠం చేస్తూ, దర్శనభాగ్యం కలుగకపోతే గొంతు కోసుకుంటాను!' అని పలికే భావననే తామసిక భక్తి అంటారు! ఇది త్వరగా ఫలితాలను ఇస్తుంది. ఇక అహింసాసిద్ధాంతాన్ని నమ్మినవాడు తన

ధ్యానాన్ని భంగపరిచే దోమకు సైతం అపకారం చేయకూడదని అనుకుంటాడు. కానీ మనల్ని భగవంతుణ్ణి చేర్చే ధ్యానాన్ని భంగపరిచే దోమలను చంపడం పాపం క్రిందకు రాదు.

### *47. అయ్యా! మా ఊళ్లో ఒకాయన తాంత్రిక సాధనలు చేస్తుంటాడు. స్త్రీతో కలిసి వింతవింత పూజలు చేస్తుంటాడు. ఇదంతా సరైనదేనా?*

సమాధానం: అవన్నీ మంచి దారులు కావు. వాటిని వామాచారాలు అంటారు. స్త్రీలతో కలసి మూడు రకాలుగా సాధనలు చేయవచ్చు. వీరభావంతో చేసే సాధన అమిత కష్టమైన మార్గం. రెండవదైన దాస్యభావంతో సాధన చేయడం మంచిదే. మూడవదైన మాతృభావం అత్యంత శ్రేష్ఠమైనది. తల్లి యొక్క సంతానంగా మనల్ని మనం భావించుకోవడమే ఆ పద్ధతి. ఇది అన్నిటికన్నా మెరుగైనది. నాది ఈ భావనే!

ఒకసారి నరేంద్రుడు నా ముందే వామాచారాలను దూషించసాగాడు. నేనతనితో, 'ఇంటిలోకి పోవడానికి ముందు తలుపే కాదు, దొడ్డి తలుపు కూడా ఉంటుంది సుమా!' అని చెప్పాను. వామాచారాలు కూడా భగవంతుణ్ణి చేర్చే మార్గాలే కానీ వాటిలో మనిషి దిగజారిపోయేందుకు అవకాశమెక్కువ.

## 04. గురువులు, సాధుసాంగత్యం

*48. ప్రశ్న: ఉత్తమ గురువు ఎలా ఉంటాడు?*

సమాధానం - వైద్యులలో మూడు రకాలు ఉన్నట్లే ఆచార్యులలో కూడా మూడు రకాలు ఉంటారు. మొదటి రకం వైద్యుడు నాడి పరీక్షించి, ఔషధం వ్రాసి ఇచ్చి, రోగితో ఔషధం పుచ్చుకో! అర్థమయిందా? అని చెప్పి తన పాటికి తాను వెళ్ళిపోతాడు. వీరు అధమరకం వైద్యులు. ఇలాగే మొదటి రకం గురువు ఉపదేశం చేసి వెళ్ళి పోతారు. ఉపదేశం వల్ల ఆ శిష్యుడికి మేలు జరుగుతున్నదా, కీడు జరుగుతున్నదా అన్నది చూడరు.

ఇక మధ్యరకం వైద్యులు ఔషధం వ్రాసి ఇచ్చి రోగినే పుచ్చుకోమంటారు. రోగి వద్దంటే అతడికి నానారకాలుగా నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తారు. మధ్యరకం గురువులు ఇలా ఉంటారు. వీరు ఉపదేశాలు చేస్తారు. దానితోపాటు శిష్యులు వాటిని అనుసరించేటట్లు పలు రకాలుగా చెప్పి చూస్తారు.

ఇక ఉత్తమ వైద్యుడు, నయాన రోగి ఔషధం పుచ్చుకోకపోతే రోగికి బలవంతంగానైనా సరే మందు వేస్తాడు. అవసరమైతే రోగి ఛాతీ మీద తన మోకాలుపెట్టి ఔషధం నోటిలో పోస్తాడు. అలాగే ఉత్తములైన గురువులు ఉపదేశం చెయ్యడమే కాక శిష్యులను సన్మార్గులను చేసే ప్రయత్నంలో అవసరమైతే బలప్రయోగం కూడా చేస్తారు. శిష్యుడు మంచిదారిలో పడేవరకూ అతడి బాధ్యతను విడిచిపెట్టరు.

***49. ప్రశ్న: గురువు సహాయం లేనిదే భగవద్దర్శనం కలగదా?***

సమాధానం: సచ్చిదానంద పరబ్రహ్మమే అసలైన గురువు. సాధన ద్వారా ఇష్టదేవతా దర్శనం అయిన తరువాత గురువు దర్శనమిచ్చి, 'చూడు! ఇతడే నీ ఇష్టదేవత!' అని చెప్పి, ఇష్టదేవతలో ఐక్యమైపోతాడు. గురువు మార్గదర్శనం చేస్తాడు. అయితే, అసలు కావలసిన దేమిటంటే ఈశ్వరుడి పట్ల ప్రేమానురాగాలు, వివేక వైరాగ్యాలు.

***50. ప్రశ్న: గురువు ఎలా లభిస్తాడు?***

సమాధానం: భగవంతుడే గురువు రూపంలో మరల మరల అవతరిస్తూ ఉంటాడు. సరైన గురువు లభించనపుడు, గురువు కోసం మనస్ఫూర్తిగా ప్రార్థించాలి. అప్పుడు భగవంతుడే మార్గం చూపిస్తాడు.

***51. ప్రశ్న: మాకు తెలిసిన మహాత్ముడొకడు ఒక గ్రామంలో ఉంటున్నారు. దూరప్రాంతాల నుంచి ఆయన దర్శనం కోసం చాలామంది భక్తులొస్తుంటారు. కానీ గ్రామంలోని జనం మాత్రం ఆయన దగ్గరకు రారు. ఇలా ఎందుకు జరుగుతుంది? ప్రస్తుతం రామకృష్ణ మఠాలలో, సమితులలో కూడా అలాగే జరుగుతున్నది. దీనికి కారణం ఏమిటి?***

సమాధానం: ఒక నూనె దీపం వెలుగుతూవుంటే, దీపపు వెలుగులు ఆ చుట్టుపక్కలంతా వ్యాపిస్తాయి. కానీ ఆ దీపం క్రింద నీడ మాత్రం పోదు. ఇదీ అంతే. గంగాతీరంలో కట్టివేసిన ఆవు దప్పికతో పరితపించి పోతుంటుంది, కానీ కట్టివేయని ఆవులు మాత్రం చాలా దూరాల నుంచి కూడా వచ్చి గంగలో నీరు త్రాగి పోతుంటాయి. అదే విధంగా

బద్ధజీవులు భగవంతుణ్ణి గురించి వినడానికి ఇష్టపడరు. మాయక్రమ్మి ఉన్నంతవరకూ వారు భగవంతుణ్ణి విస్మరిస్తారు. ఆ మాయ తొలగిపోయినపుడే జ్ఞానోదయం అవుతుంది.

### *52. ప్రశ్న: ఈ రోజులలో చాలామంది గురువులు ఆధ్యాత్మిక బోధలు చేస్తున్నారు. వైద్యం చేస్తున్నారు. ప్రశ్నలు చెపుతున్నారు. నిజమైన గురువులను, సాధువులను గుర్తించడం ఎలా?*

సమాధానం: ఏ గురువులో ఈ లక్షణాలు కనిపిస్తాయో అతణ్ణి నిజమైన గురువుగా, సాధువుగా గుర్తించవచ్చు. 1) నిజమైన సాధువు హృదయం, శరీరం, మనస్సు పూర్తిగా భగవదర్పితమై ఉంటాయి. సదా భగవద్ధ్యానంలో లీనమై ఉంటాడు. 2) శిష్యుడి స్థాయికి దిగి బోధించడమే కాక, నిత్యజీవితంలో సరైన నడవడి, ప్రవర్తన, ఆచరణ కలిగివుంటాడు. 3) స్త్రీని లౌకిక దృష్టితో, మోహదృష్టితో చూడడు. స్త్రీకి దూరంగా ఉంటాడు. ఒకవేళ తనవద్దకు ఎవరైనా స్త్రీ వస్తే, ఆమెను తల్లిగా భావించి, ఎంతో మర్యాదతో ఆమెను ఆదరిస్తాడు. 4) లౌకిక విషయాల గురించి ఎక్కువగా మాట్లాడడు. భగవంతుణ్ణి గూర్చి మాత్రమే మాట్లాడతాడు. 5) అన్ని జీవరాశులలో భగవదంశను చూస్తూ, సేవ చేస్తాడు. 6) కానుకలను స్వీకరించడు, శిష్యుల నుంచి ఏమీ ఆశించడు. 7) సిద్ధులను, శక్తులను, మాయలను ప్రదర్శించడు. 8) బాహ్యా చిహ్నాలను అసలు కలిగివుండడు. 9) పేరుప్రతిష్ఠల కోసం వెంపర్లాడడు. 10) శిష్యులు తాముగా ఆయన పట్ల ఆకర్షితులౌతారు. ఆయనకు అటువంటి అద్భుతమైన ఆకర్షణ

ఉంటుంది. పంచదార ఉన్న చోటకు చీమలు తమంతట తామే చేరుకుంటాయి కదా! అటువంటి గురువు శిష్యుల కోసం పరుగులు పెట్టడు. శిష్యులే అతణ్ణి వెతుక్కుంటూ వెళతారు. అతడు శిష్యుల శ్రేయస్సునే కోరి మాట్లాడతాడు కానీ కల్లబొల్లి కబుర్లతో శిష్యులను మభ్యపెట్టడు. 11) నిజమైన గురువు సన్నిధిలో ప్రశాంతత, హాయి నెలకొనివుంటాయి. 12) క్షమాస్వరూపుడుగా ఉంటాడు. 13) నిజమైన గురువు నుంచి వచ్చే బోధలు సాక్షాత్తు భగవంతుడి వాణిలాగా, ఆయన పలుకులలాగా విని పిస్తాయి. భగవంతుడే మనతో మాట్లాడు తున్నాడనిపిస్తుంది. మన మేలు కోరే అతడి మాటలు ఒక్కొక్కసారి కటువుగా తోచినా వాటివెనుక నున్న ప్రేమ స్పష్టంగా గోచరిస్తుంది. 14) మన మనస్సులోని సంశయా లను, బాధలను తీర్చి, విశ్వాసాన్ని దృఢపరిచి, సరైన మార్గదర్శనం చేస్తాడు.

***53. ప్రశ్న: ఒక గురువుగారు మంచి శక్తులు చూపిస్తున్నారు. చేతిలో నుంచి విభూతి తెప్పిస్తారు. నోటిలో నుంచి శివలింగం తీస్తారు. మరి అటువంటి సిద్ధుల గురించి మీ అభిప్రాయం?***

సమాధానం: ధర్మమార్గం అతిక్లిష్టమైనది. కోరిక లవలేశం మిగిలివున్నా భగవత్సాక్షాత్కారం కలగదు. సూదిబెజ్జానికి చిన్న నలక అడ్డుపడినా, దారం దానిలోకి ఎక్కదు. అందువల్ల నిజమైన భక్తుడు భగవంతుణ్ణి ఏదీ కోరడు. భక్తిని మాత్రమే వాంఛిస్తాడు. అతడికి శక్తులుగాని, మహత్తులుగాని, ఏ ఒక్క సిద్ధి గానీ అవసరం లేదు. బృందావన గోపికలే దీనికి తార్కాణం. వారి ప్రేమ అతీంద్రియమైనది. అందువల్ల దానిలో

ఏ విధమైన కామం లేదు (ఒక కథ చెపుతా విను! 98. అష్టసిద్ధులు అనర్థదాయకాలు; 99. సిద్ధులు భగవద్దర్శనానికి ఆటంకాలు)

***54. ప్రశ్న: ఈ రోజులలో మహాత్ములు చాలామంది ఉపన్యాసాలు ఇస్తున్నారు. మంచి పారమార్థిక విషయాలే చెపుతున్నారు. శ్రోతలు, భక్తులు ఆసక్తిగానే వింటున్నారు. కానీ ఉపన్యాసం నుంచి బయటకు రాగానే భక్తులు పూర్వస్థితికి మారిపోతున్నారు. ఆ ప్రసంగాల ప్రభావం ఏమీ ఉండడం లేదు. కారణం ఏమిటి?***

సమాధానం: వినేవారికి చిత్తశుద్ధి లేకపోతే ఉపన్యాసాలు ఎటువంటి ప్రభావం చూపవు. రాతి గోడలో మేకు కొట్టగలమా? మేకు విరుగుతుందే కానీ, రాతిలోకి దిగదు. చేదుసొరకాయతో చేసిన సాధువు కమండలం, ఆ సాధువుతో పాటు అనేక తీర్థాలలో మునిగివస్తుంది. కానీ దాని చేదుగుణం పోదు.

పుస్తక పాండిత్యం వలన జ్ఞానం లభించదు. భగవదాదేశం పొందిన వ్యక్తి జ్ఞానానికి కొరత ఉండదు. ఆ జ్ఞానం భగవంతుడి నుంచి ప్రసాదింపబడుతుంది. అది ఎన్నటికీ తరగదు. అటువంటి వారు పండితులు కాకపోయినా వారి బోధలు జ్ఞానరాశులు. వారు చేసిన బోధలు వృథాపోవు. కాలక్రమంలో, ఏదోవొక సమయంలో అవి శిష్యుల జీవితం మీద ప్రభావం చూపుతాయి.

***55. ప్రశ్న: మా ఊళ్ళో ఒక గురువుగారున్నారు. ఆయన సాకార ఉపాసన చేస్తారు. అయన "నేను అర్థం చేసుకున్నదే సరైనది.***

***ఇతరులు చెప్పేది తప్పు!" అంటారు. ఇంకొక గురువుగారున్నారు. ఆయన నిరాకారోపాసన చేస్తారు. ఆయన కూడా తాను చెప్పేదే సరైనదంటారు. ఏది సరైనది?***

సమాధానం: ఒక చెరువుకు ఉన్న నాలుగు గట్టుల నుంచి నాలుగు మతాల వారు నీటిని వేర్వేరు పాత్రలతో తీసుకుపోతున్నారు. అదే నీటిని ఆక్వా, వాటర్, పానీ, వారీ అనే వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు. పాత్ర ఏదైనా, పేరు ఏదైనా అది నీరే కదా. అలా వేర్వేరు మతాల వారు వేర్వేరు మార్గాల ద్వారా, వేర్వేరు రూపాలను ఉపయోగించి, వేర్వేరు పేర్లతో వ్యవహరిస్తూ అదే భగవంతుణ్ణి చేరడానికి ప్రయత్నిస్తున్నారు. కాబట్టి ఒకే గమ్యాన్ని చేరే వేర్వేరు మతాలవారు కలహించుకోవలసిన పనిలేదు. ఎవరి ఉపాసన వారు నిష్ఠగా చేసుకోవచ్చు కానీ తాము చేసిందే సరైనదని, ఇతరులు అనుసరించేది సరైనది కాదని అనుకోకూడదు. (ఒక కథ చెపుతా విను! 2. దేవుడు ఒక్కడే, పేర్లు అనేకం)

***56. ప్రశ్న: భగవద్భక్తి చాలదా? ఈ సాధుసాంగత్యం కోసం స్వామీజీల వద్దకు వెళ్ళడం అవసరమా?***

సమాధానం: నిరంతరం సంసారంలో మునిగి ఉండడం వలన మనలో ప్రాపంచికత అనే రోగం ముదిరిపోయింది. దానికి విరుగుడు సాధుసాంగత్యమే. సాధుసాంగత్యం వలన భగవంతుడి పట్ల ప్రేమ అభివృద్ధి అవుతుంది. అలా ఏర్పడిన భక్తితో హృదయం నిండినప్పుడు అది భగవంతుడి కోసం ఆరాటపడుతుంది. బ్యాటరీ ఛార్జింగ్ చేసినట్టు సాధుసాంగత్యం ద్వారా మనకు కూడా ప్రేరణ లభిస్తుంది!

సాధుసాంగత్యంతో మరో ప్రయోజనం ఉంది. ఈ ప్రపంచంలో, 'ఏది శాశ్వతమైనది? ఏది కాదు? ఏది నిజం? ఏది భ్రమ?' అనే విచక్షణాజ్ఞానం అలవడుతుంది. అప్పుడప్పుడు ప్రక్కదోవ పట్టే బుద్ధి సాధుసాంగత్యం వల్ల దారిలోకి వస్తుంది. ఉదాహరణకు, మావటివాడు ఎక్కిన ఒక ఏనుగు దారిలో నడుస్తూ, హఠాత్తుగా ప్రక్కనే ఉన్న అరటిచెట్టును పెకలించడానికి ప్రయత్నిస్తుంది. వెంటనే మావటివాడు అంకుశంతో పొడిచి దాన్ని నివారిస్తాడు. అదే విధంగా సాధువులు మన బుద్ధికి మార్గదర్శనం చేస్తారు.

***57. ప్రశ్న: నేడు చాలామంది పండితులు, విద్వాంసులు టీవీలలో, బహిరంగ సభలలో దేవుణ్ణి గురించి ప్రసంగిస్తూ, జనబాహుళ్యంలో పేరుప్రతిష్ఠలు పొందుతున్నారు. వారిని గురించి మీ అభిప్రాయం ఏమిటి?***

సమాధానం: కేవలం పాండిత్యం ఉన్నవారు పురుగు పట్టిన పండులాంటివారు. అలాంటి పండు గట్టి పడుతుంది కానీ పండదు. ఆ పండుకు తాజాదనం ఉండదు. రంగు, రుచి సరిగా లేకపోవడం వలన తినడానికి పనికిరాదు. రాబందులు ఆకాశంలో ఎంతో ఎత్తులో ఎగురుతున్నప్పటికీ వాటి దృష్టి మాత్రం నేల మీద ఉన్న కుళ్ళిన శవాల మీదే ఉంటుంది! అదే విధంగా కేవలం పుస్తక పాండిత్యం ఉన్నవారు పేరుకు మాత్రమే వివేకవంతులు. వారు కుళ్ళిన శవాల లాంటి కామకాంచనాలకు దాసులు. అటువంటి వారు చెప్పే ఉపన్యాసాలను జనం కొద్ది రోజులు మాత్రమే వింటారు! ఆ తరువాత మరచిపోతారు. నాలుక చివర నుంచి వచ్చే

పలుకులకు, హృదయపూర్వకమైన చేతలకు చాలా తేడా ఉంది. ఎవరైనా ఇతరులకు బోధించాలంటే, వారు భగవంతుడి వద్ద నుండి యోగ్యతా పత్రం పొందాలి. మొదట భగవంతుణ్ణి హృదయమందిరంలో ప్రతిష్ఠించుకుని, ఆ తర్వాత ఎన్ని 'లెక్చర్లైనా' ఇవ్వవచ్చు. (ఒక కథ చెపుతా విను! 132. మందు–పథ్యం)

### *58. ప్రశ్న: మిమ్మల్ని అందరూ మహాత్ములు అంటారు. దాన్ని మీరు అంగీకరిస్తారా?*

సమాధానం: నారదుడూ, ప్రహ్లాదుడూ, శుకదేవుడు మొదలైన వారిని మహాత్ములని అనవచ్చు. నేను మాత్రం మీ కుమారుడిలాంటి వాణ్ణి! అయితే నన్ను కూడా మహాత్ముడని అనడం ఒక విధంగా సరియైనదే. ఎలాగంటే భక్తుడు గొప్పవాడవడానికి కారణం తన హృదయంలో భగవంతుణ్ణి ప్రతిష్ఠించుకుని తిరుగుతుండడమే. భక్తుడు తననే పెద్దవాడిగానూ, భగవంతుణ్ణి చిన్నవాడిగానూ చూస్తాడని వైష్ణవ గ్రంథాలలో చెప్పబడి ఉంది. ఆ రకంగా మీరు నన్ను మహాత్ముడని అనవచ్చు.

### *59. ప్రశ్న: 'గురువు' అనే పదం చాలా వాడుక మాటగా తయారయింది. దారిలో ఎదురైనవాణ్ణి కూడా 'గురూ!' అని పలకరిస్తున్నారు. అసలు గురువు అనే పదానికి అర్థం ఏమిటి?*

సమాధానం: 'గురువు' అంటే అజ్ఞానాంధకారాన్ని పోగొట్టేవాడు. గురువు అంటే వధూవరులను కలపడానికి ఏర్పాటు చేసే 'పెళ్ళిళ్ళ పేరయ్య' లాంటివాడు. సాధారణమైన

పెళ్ళిళ్ళ పేరయ్య వధూవరులను కలిపితే, గురువు ఒక వ్యక్తి ఆత్మను దివ్యాత్మతో (భగవంతుడితో) కలపడానికి సన్నాహం చేస్తాడు. గురువు చేసే మహోపకారాన్ని అర్థం చేసుకోలేనివాళ్ళే 'గురువు' అనే పదాన్ని తేలికగా వాడతారు.

## 05. సాధన-ఆటంకాలు

***60. ప్రశ్న: స్వామీ! భగవద్దర్శనానికిగల మార్గాలు ఏవో తెలపండి?***

సమాధానం: పుస్తకాలు చదివి నాలుగు ముక్కలు వల్లించినంత మాత్రాన ఏమిటి ప్రయోజనం? మాటలు కాదు చేష్టలు కావాలి! భగవంతుణ్ణి మనస్ఫూర్తిగా ప్రార్థించినపుడే ఈ ఉపదేశాల మర్మాన్ని తెలుసుకుంటారు. మనిషికి చురుకుదనం, హుందాతనం, నిజాయతీ ఉండాలి. చైతన్యం ఎవరికైతే మేలుకొంటుందో వారికే అవి ఉంటాయి. చైతన్యం మేలుకోనివారి మానవజన్మ వ్యర్థం.

సత్యవ్రతమే కలికాలంలో చేయగలిగిన తపస్సు. పరధనాన్ని మట్టిముద్దలాగా, పరస్త్రీలను మాతృభావనతో చూడడమే ఇంద్రియనిగ్రహం. సంపూర్ణమైన శరణాగతే మన గమ్యం. ఇవే భగవద్దర్శనానికి మార్గాలు.

సాధకులు తమ కష్టార్జితాన్ని తిండి, బట్ట, ఇల్లు, దైవార్చన కోసం, అతిథి అభ్యాగతుల సేవకోసం వినియోగించాలి. అతిగా ధనాన్ని కూడబెట్టాలని ఆశించకూడదు. ధనవంతులు ధనగర్వాన్ని, విద్యావంతులు విద్యామదాన్ని, అధికారంలో ఉన్నవారు స్థానమదాన్ని విడనాడాలి. అవి సాధనకు ప్రతిబంధకాలు.

***62. ప్రశ్న: కాశీలో ఒక సాధువును చూశాను. ఆయన ఇంద్రియనిగ్రహం లేనిదే అంతా వ్యర్థం. కేవలం నోటితో భగవంతుడి పేరు పలుకుతూ ఉంటే చాలదని అన్నారు. మరి మీ అభిప్రాయం?***

సమాధానం: ఆయన చెప్పింది నిజమే. భగవంతుడి మీద మనస్సును పూర్తిగా లగ్నం చేయడానికి ఇంద్రియ నిగ్రహం తప్పనిసరి. హృదయంలో భగవంతుడు ఉన్నాడని తెలుసుకున్నవాడు ధ్యానంలోనూ, భగవత్స్మరణతోనూ కాలం గడుపుతాడు. చివరకు సర్వసంగపరిత్యాగం చేసి భగవంతుణ్ణే చేరాలని శాయశక్తులా పాటుపడతాడు. అటువంటి వారు సంఘసేవ లాంటి పనులు చేయలేరు. ఈశ్వరుడి మీదే వారి మనస్సు లగ్నమైపోతుంది.

***63. ప్రశ్న: భగవద్దర్శనానికి చిత్తశుద్ధి కావాలా?***

సమాధానం: ఒక అద్దం మీద దుమ్ము పడితే దానిలో ప్రతిబింబం సరిగా కనపడదు. అలాగే చిత్తశుద్ధి లేని మనస్సులో ఆత్మ సరిగా ప్రతిబింబించదు. నిజానికి పరమేశ్వరుణ్ణి దర్శించాలన్న కోరికే కలుగదు. అనేక జన్మల తపస్సు వల్లనే చిత్తశుద్ధి, ఇంద్రియనిగ్రహం, ఔదార్యం, సరళస్వభావం, నైతికత మొదలైన దైవీ లక్షణాలు లభిస్తాయి.

***64. ప్రశ్న: ఏ ఉపాయం వలన మనకు భగవద్దర్శనం కలుగుతుంది?***

సమాధానం: భగవంతుడి మీద ప్రేమ కలిగి ఉండి, ఆయనొక్కడే నిత్యం, మిగిలినదంతా అనిత్యం అని నిరంతరం వివేకించుకోవాలి. (మహేంద్రనాథ్ గుప్తతో) పాముభూపంలో

చుట్టచుట్టుకొని మూలాధార పద్మంలో నిద్రిస్తున్న కుండలినీశక్తిని ఉపాసించాలి. కుండలినీశక్తి మేల్కొన్నప్పుడే భగవంతుడి దర్శనానికి మనకు అవకాశం లభిస్తుంది. నిర్జనప్రదేశంలో ఏకాంతంగా కూర్చొని వ్యాకులచిత్తంతో ప్రార్థిస్తే తప్పక ఈశ్వర దర్శనం కలుగుతుంది.

### *65. ప్రశ్న: మానవుడి బంధనాలు ఎలా తొలగిపోతాయి?*

సమాధానం: ముక్తి, బంధనం - రెండు మనస్సులోనే ఉంటాయి. "నేను ముక్తుణ్ణి! నేను ఈశ్వరుడి బిడ్డను! నేను సంసారంలో ఉన్నా సరే, అరణ్యంలో ఉన్నా సరే, నాకు బంధం ఎలా కలుగుతుంది? నేను ఈశ్వరుడి సంతానాన్ని కదా!" ఇలా నిరంతరం మనస్సులో చింతించండి! 'నేను ముక్తుణ్ణి! బద్ధుణ్ణి కాను!' అని దృఢంగా మనస్సులో సంకల్పించుకున్నవాడు తప్పకుండా ముక్తుడవుతాడు. రాత్రింబవళ్ళూ, 'నేను బద్ధుణ్ణి! నేను బద్ధుణ్ణి!' అని అనుకునేవాడు చివరకు బద్ధుడే అవుతాడు. రాత్రింబవళ్ళు 'నేను పాపిని! నేను పాపిని!' అనుకునేవాడు చివరకు పాపి అవుతాడు. భగవన్నామస్మరణతో దేహం, మనస్సు, రెండూ పవిత్రమౌతాయి. ఎప్పుడూ పాపం, నరకం అంటూ ఉంటే ఏమిటి ప్రయోజనం? చేసిన తప్పు ఒప్పుకుని, ఇక మీదట చేయనని నిశ్చయంగా పలికి, భగవన్నామం మీద విశ్వాసం ఉంచితే చాలు.

### *66. ప్రశ్న: ఆధ్యాత్మిక సాధకుని మానసిక వైఖరిని బట్టి భగవంతుడు అనుగ్రహిస్తాడా?*

సమాధానం: అవును! ఆధ్యాత్మిక సాధకుని మానసిక వైఖరిని బట్టి భగవంతుడు తనను తాను అభివ్యక్తం చేసు

కుంటాడు. భగవంతుణ్ణి సర్వవ్యాపిగా, నిరాకారుడుగా జ్ఞాని అనుభూతి చెందుతాడు. భక్తుడు భగవంతుణ్ణి తాను కొలిచిన రూపంలో అవగతం చేసుకుంటాడు. కాబట్టి భగవంతుడి యథార్థప్రకృతి గురించి నువ్వు నిజంగా తెలుసుకోవాలంటే, ఏకాంతంలో ఆయనను ధ్యానించు! ఓర్పు వహించు! ఆయనను శరణువేడి ప్రార్థించు! తగిన సమయం ఆసన్నమైనప్పుడు ఆయనే అంతా తెలియజేస్తాడు.

***67. ప్రశ్న: ఆధ్యాత్మిక సాధనలు చేస్తున్నప్పటికీ ఎన్నో సంశయాలు, ఆటంకాలు కలుగుతున్నాయి. వాటిని ఎదుర్కోవడం ఎలా?***

సమాధానం: అనుమానం పెనుభూతం! సంశయాత్ములు ఎన్నో యాతనలకు గురి అవుతారు. మనస్సు నుంచి సందేహాన్ని కూకటివేళ్ళతో పెకలించి వేయడం ఎంతో కష్టం. ప్రతి ఆధ్యాత్మిక సాధకుడు ఆ 'చీకటిరాత్రి'ని గడిపి తీరాలి. (సాధన మొదట్లో మంచి పురోగతి కనిపిస్తుంది. కానీ తర్వాత కొంతకాలం ఎటువంటి పురోగతి కనపడదు. ఆ సమయంలో సాధకుడు నిరాశనిస్పృహలు ఆవరించి దుఖంలో మునిగిపోతాడు. దీనినే చీకటిరాత్రిగా వ్యవహరిస్తారు.) అయినా పట్టుదలతో నామస్మరణ, జపధ్యానాలు చేయడమే మార్గం.

***68. ప్రశ్న: ప్రత్యక్షమైన భగవదనుభూతి ఏదీ కలుగకపోతే మాలాంటి సంశయాలతో కొట్టుకులాడే బలహీన మనస్కులకు భగవంతుడి ఉనికి పట్ల విశ్వాసం ఎలా కలుగుతుంది?***

సమాధానం: తగిన సమయంలోనే మనకు అనుభూతి కలుగుతుంది. మనకంటే ముందు సాక్షాత్కారం పొందినవారి

నుంచి ప్రేరణను పొందుతూ, నిస్పృహకు లోనవకుండా సాధనలు కొనసాగించాలి. సన్నిపాత (టైఫాయిడ్) రోగి చెంబుల కొద్దీ నీరు తాగుతాననీ, రాశులకొద్దీ అన్నం తింటాననీ ప్రేలాపన చేస్తాడు. కానీ వైద్యుడు ఆ మాటలు పట్టించుకోడు. అంతేకాక, రోగి కోరికను బట్టి ఔషధాన్ని నిర్ణయించడు. తాను ఏమి చేస్తున్నాడో వైద్యుడికి చక్కగా తెలుసు. అలాగే భగవంతుడు భక్తుని స్థాయిని బట్టి తాను చేస్తున్నది ఏమిటో తెలియబరుస్తాడు.

***69. ప్రశ్న: సంసారంలో ఉన్న మాకు ఆధ్యాత్మికసాధన చేయడంలో చాలా ప్రతిబంధకాలు కలుగుతున్నాయి. దానికి తోడు ఎన్నో కష్టాలు. మరి తరణోపాయం ఏమిటి?***

సమాధానం: నిజమే! సంసారంలో ఉండి, సాధనలు చేయడం కష్టమే. నిస్సందేహంగానే, శోకం, రోగం, దారిద్ర్యం ఇలా అనేక రూపాలలో ఎన్నో అడ్డంకులు ఎదురవుతూ ఉంటాయి. పిల్లలు చెప్పినమాట వినరు. భార్యతో పొసగదు. ఇవన్నీ తప్పవు. అయినా వీటన్నింటి బారి నుండి తప్పించుకునే ఉపాయం ఉంది. అప్పుడప్పుడు ఏకాంతవాసం చేస్తూ, భగవత్ప్రార్థనలతో కాలం గడపాలి. ఈశ్వరసాక్షాత్కారం కోసం సాధనలు చేయాలి.

***70. ప్రశ్న: (నరేంద్రుడు) ఆహారాది విషయాలలో 'యదృచ్ఛాలాభం' (దొరికిన దానితో తృప్తిపడడం) మంచిదని నా అభిప్రాయం.***

సమాధానం: నీ సంగతి వేరు. నీవు జ్ఞానివి, భక్తుడివి కూడా. రెండు తరగతులకూ చెందినవాడివి కాబట్టి, నీవు ఎలాంటి ఆహారనియమాలను పాటించక్కరలేదు. (మిగిలిన

భక్తులతో) పందిమాంసం తిన్నా సరే ఎవడి మనస్సు భగవత్ప్రేమామృతాన్ని గ్రోలుతూ ఉంటుందో అతడే ధన్యజీవి. ఎంతో నిష్ఠతో తయారుచేయబడిన హవిష్యాన్నం తింటూవున్నా, ఎవరి మనస్సు కామకాంచనాల వైపు పరుగులు తీస్తుందో అతణ్ణి 'ఛీ' కొట్టవలసిందే.

***71. ప్రశ్న: కొందరికి అతితక్కువ సమయంలోనే సిద్ధి కలుగుతుంది. మరికొందరికి ఎంతో శ్రమపడ్డా కలుగదు. అలా ఎందుకు జరుగుతుంది?***

సమాధానం: క్రితం జన్మలో ఎవరి మనస్సు శుద్ధసత్త్వ స్థాయికి చేరుకుంటుందో, వారి మనస్సుకు ప్రస్తుత జన్మలో లౌకిక కర్మల పట్ల ఆసక్తి పూర్తిగా తొలగిపోతుంది. వారు సర్వదా భగవద్దర్శనానికి సన్నద్ధంగా ఉంటారు. అందువలన వారికి త్వరగా దర్శనం కలుగుతుంది. మిగిలినవారు కూడా శుద్ధసత్త్వ స్థాయికి చేరుకుంటే వారికీ సిద్ధి కలుగుతుంది. అది ప్రస్తుత జన్మలోనే కావచ్చు లేదా మరుజన్మ కూడా కావచ్చు. (ఒక కథ చెపుతా విను! 166. అత్యంత సాధనాఫలితం)

***72. ప్రశ్న: 'హృదయ్' మిమ్మల్ని ఎంతగానో సేవించాడు. కానీ అతడికి దుర్గతి (కటిక పేదరికం) ఎందుకు పట్టింది? మీనుంచి ఎందుకు దూరంగా వెళ్ళిపోవలసివచ్చింది?***

సమాధానం: అతడు నాకెంతో సేవ చేశాడు. కానీ తరువాతి కాలంలో ఎంతో కష్టం కలిగించాడు కూడా. నన్ను ఎగతాళి చేసేవాడు. తక్కిన అందరి మీద పెత్తనం చెలాయిస్తూ, పెద్దపెద్దగా అరిచేవాడు. పిడుగు పడ్డప్పుడు కిటికీలకు ఉన్న

గాజు చక్రాలు టకటక కొట్టుకుంటాయి. సత్త్వగుణ స్థితిలో ఉన్న నేను హృదయ్ కేకల్ని, కోలాహలాన్ని సహించలేక పోయేవాణ్ణి. అందుకే అమ్మ అతణ్ణి ఇక్కడ ఉండనివ్వలేదు. చివరి రోజులలో మరింతగా మితిమీరి ప్రవర్తించాడు. రోజూ ఏదో ఒక గొడవ పెట్టుకునేవాడు. నన్ను దుర్భాషలాడేవాడు. ఇక్కడికి వచ్చేవారిని డబ్బు కోసం పీడించేవాడు. అతడు కనుక ఇక్కడే ఉన్నట్లయితే, ఇప్పుడు వస్తున్న యువశిష్యులు రాగలిగేవారు కాదు. అందుకే అమ్మ అతణ్ణి తొలగించింది.

## 06. కర్మమార్గం

***73. ప్రశ్న: పగలూ, రాత్రీ పనులలో కూరుకుపోయివున్న మాకు కర్మయోగ విధానాన్ని తెలియజేయండి?***

సమాధానం: వస్తువిషయాల మీద అభిమానం వదలిపెట్టాలి. శరీరపోషణకు, కుటుంబపోషణకు అవసరమైన కర్మలను మాత్రమే అంటే కనీసావసరాలను తీర్చుకోవడానికి పనిచేస్తే, ఏ పాపమూ అంటదు. మానవుడు తన సహజస్వభావం చేత కర్మలను విడిచిపెట్టలేడు. అలాగని, కర్మలే జీవితపరమావధి అని ఎన్నడూ అనుకోకూడదు. భగవత్సాక్షాత్కారమే జీవితపరమావధి. అందువల్ల భక్తి కావాలని ప్రార్థించాలి.

పనుల్ని తెచ్చిపెట్టుకోవద్దు. ఏదేదో చేయాలని ప్రాకులాడవద్దు. చక్కగా చేయగలిగినవే చేయాలి. తలకు మించిన పనులను తలకెత్తుకోవద్దు. వాటిలోపడి భగవంతుణ్ణి మర్చిపోతాం. సాధన ప్రారంభదశలో ఈ కర్మ సంబంధమైన గందరగోళం ఎక్కువగా ఉంటుంది. కానీ భగవంతుణ్ణి సమీపించిన కొద్దీ కర్మలు క్షీణిస్తాయి. చివరకు సంపూర్ణ కర్మ పరిత్యాగం, సమాధి లభిస్తాయి.

***74. ప్రశ్న: కర్మయోగం ద్వారా భగవద్దర్శనం కలుగదా?***

సమాధానం: కర్మయోగపు గమ్యం కూడా భగవద్దర్శనమే. కర్మల ద్వారా మనస్సుని ఈశ్వరుడి మీద నిలపడమే కర్మయోగం. చేసే పని యొక్క ఫలితాల మీద ఆసక్తి లేకుండా పనిచేయాలి. అంటే కర్మఫలాలను భగవంతుడికి అర్పిస్తున్నాననే భావంతో పనిచేయాలి. అప్పుడే అది

కర్మయోగం అవుతుంది. ధ్యాన, ధారణాది సాధనలు కర్మయోగమే.

***75. ప్రశ్న: మీరెప్పుడూ భగవంతుణ్ణి మొదట సాక్షాత్కరింపజేసుకుని, ఆ తర్వాత లోకంలో పనులు చేయమంటారు కదా! అంటే ముందు పనులన్నింటినీ మానివేయాలా? గృహకృత్యాలు, సాంసారిక కర్మలను త్యజించాలా?***

సమాధానం: లేదు! లేదు! ధ్యానం, పారాయణ, భగవన్నామ స్మరణలాంటివి చేస్తూ ఉండాలి. లోకంలో జీవించడానికి తప్పని సరైన కర్మలు చేయవచ్చు. కానీ ఇహపరాలలో ఏ విధమైన ఫలాలను ఆశించకుండా, ఏ విధమైన భయం లేకుండా, మీ కర్తవ్యాలను చేయడానికి కావలసిన శక్తినిమ్మని కండ్లనీళ్ళతో భగవంతుణ్ణి ప్రార్థించాలి. ఏ పనుల్లో మునిగివున్నా మనస్సు మాత్రం భగవంతుడి మీదే ఉండాలి.

పిల్లలు స్తంభాన్ని ఒకచేతితో పట్టుకుని గిరగిర తిరుగుతూ ఆడుకోవడాన్ని మీరు చూసే ఉంటారు. ఒకచేతితో స్తంభాన్ని పట్టుకోవడం వల్ల వారికి పడిపోతామనే భయముండదు. అలాగే లోకంలో మసలుతున్నప్పుడు మనం ఒక చేతితో భగవంతుణ్ణి పట్టుకుని మరొకచేతితో పనులు చేసుకోవాలి. తీరిక చిక్కిన తర్వాత రెండు చేతులతో భగవంతుణ్ణి పట్టుకోవచ్చు అంటే మన సమయాన్ని పూర్తిగా భగవంతుడి సేవలో గడుపవచ్చు.

***76. ప్రశ్న: అన్నదానం, విద్యాదానం వంటివి ఈ రోజులలో చాలా సంస్థలు చేస్తున్నాయి. వాటి గురించి మీ అభిప్రాయం ఏమిటి?***

సమాధానం: అన్నదానం, విద్యాదానం వంటివి చాలా మంచి పనులే. కానీ ఇలాటి కార్యకలాపాలను శివారాధనగా భావించి, నిష్కామ దృష్టితో చేయాలి. స్వార్థచింతనను పూర్తిగా విడనాడాలి. అపుడే ఇవి మనల్ని భగవంతుడి వద్దకు తీసుకువెడతాయి. కానీ అధిక సంఖ్యాకులు పేరుప్రతిష్ఠల కోసం వీటిని చేస్తారు. అలా చేయడం నిష్ప్రయోజనం. అలా చేస్తే అవి మనల్ని భగవంతుడి వద్దకు తీసుకుపోవు సరికదా ఆయనకు దూరం చేస్తాయి!

***77. ప్రశ్న: ఈ రోజులలో ప్రతి దేవాలయంలోనూ, పుష్కరాలలోని ప్రతి ఘాట్‌లోనూ, ప్రతి వీథిలోనూ అన్నదానాలు ఎక్కువగా జరుపుతున్నారు. అన్నదానం అంటే చాలు విరాళాలు కూడా బాగా ఇస్తారు భక్తులు. అన్నదానం మీద మీ అభిప్రాయం?***

సమాధానం: జనులకు అన్నదానం చేయడం ఒక విధమైన భగవత్సేవే. సకల ప్రాణులలో ఆయన అగ్నిరూపంలో వెలసివున్నాడు. అందువలన అన్నదానం చేయడం అంటే భగవంతుడికి ఆహుతి అర్పించడమే. అలా అని దుష్టులకు భోజనం పెట్టరాదు. ఎంతమంది తిన్నారన్న దానికన్నా అన్నార్తులు తిన్నారా లేదా అనేదే ముఖ్యం. కాబట్టి ఇటువంటి కార్యక్రమాలను నిష్కామంతో, నిస్వార్థతతో, పేరుప్రతిష్ఠలు ఆశించకుండా చేయాలి. అప్పుడే ఫలితం ఉంటుంది.

## 07. జ్ఞానమార్గం

***78. ప్రశ్న: బ్రహ్మ సత్యం - జగన్మిథ్య అని అంటారు. మరి ఈ జగత్తు మిథ్యయేనా?***

సమాధానం: మారిపోయే స్వభావం కల జగత్తును మిథ్య అంటారు. భగవంతుడు ఎన్నడూ మార్పు చెందడు. అందువలన ఆయనను సత్యం అంటారు. క్షణక్షణం మారిపోయే జగత్తు వెనుక కూడా శాశ్వతుడైన బ్రహ్మమే ఉన్నాడని కనుగొన్నప్పుడే రెండూ సత్యమనే సంగతి విశదమౌతుంది. సమస్తం భగవంతుడి స్వరూపంగా చూడడానికి బదులు, మానవుడు 'నేను', 'నాది' అనుకుంటూ సంసారంలో బద్ధుడవుతున్నాడు. పట్టుపురుగు తాను అల్లుకున్న గూటిలోనే చిక్కుకుపోయి మరణిస్తుంది. సంసారం కూడా ఆ గూటివంటిదే. తనలోనూ, అందరిలోనూ పరబ్రహ్మన్నే చూడగలిగిన వానికి 'బ్రహ్మ సత్యం – జగత్ సత్యం' అవుతుంది!

***79. ప్రశ్న: వేదాంత మతం ఏమి బోధిస్తుంది?***

సమాధానం: వేదాంతవాదులు 'బ్రహ్మ సత్యం', 'జగత్తు మిథ్య' అంటారు. సృష్టిలో ఉన్న సర్వభూతాలూ బ్రహ్మమే కాబట్టి, మనందరం కూడా బ్రహ్మస్వరూపాలమే. అందువలన జ్ఞానులు 'సోఽహం' (అతడే నేను) అనే భావనను సాధన చేస్తుంటారు. కానీ సాధారణ మానవులకు 'నేనే భగవంతుడు' అనే భావనకు బదులు 'నేను భగవంతుడి దాసుణ్ణి' లేదా 'నేను భగవంతుడి బిడ్డను' అని అనుకోవడం మేలు. సంసారులకు

భగవంతుడి పట్ల ఆ విధమైన అభిమానం కలిగివుండడమే శ్రేయస్కరం. ఈ కలియుగంలో వాత్సల్యభావన లేదా భక్తియోగమే శ్రేష్ఠం. ఇంద్రియాలు మనకు అందించే శబ్ద, రస, రూప, గంధ జ్ఞానాన్ని విషయజ్ఞానం అంటారు. విషయాల పట్ల ఆకర్షితమయ్యే మన బుద్ధిని విషయబుద్ధి అంటారు. మనస్సు ఉన్నంతవరకూ ఈ విషయబుద్ధి పోదు. 'సోऽహం' అనే భావన కలుగదు. సదా విషయబుద్ధితో ఉండే సంసారులకు 'సోऽహం' కంటే 'దాసోऽహం' అన్న భావనే మెరుగైన మార్గం. ఈ భావనను రోజూ అభ్యాసం చేయాలి. భగవంతుడి పట్ల అనురాగం కలిగివుండాలి. ఆయనను చూడాలన్న కోరికతో రోజుకు ఒకసారైనా విలపించాలి. 'అభ్యాసం – అనురాగం' అనేవి రెండే ఉపాయాలు.

### *80. ప్రశ్న: స్వామీ! జ్ఞానదృష్టి లేదా దివ్యదృష్టి అంటే ఏమిటి?*

సమాధానం: 'నేను' అనే భావన కొంచెం కూడా లేని స్థితిలో మన మనస్సు ఆత్మలో పూర్తిగా విలీనం అవుతుంది. దీనినే జ్ఞానదృష్టి అంటారు. అంతేకానీ, ఇతరుల ఆలోచనలు తెలుసుకోవడం, భూతభవిష్యత్తులను చెప్పడం మొదలైన మహత్తులు జ్ఞానదృష్టి అనిపించుకోవు.

### *81. ప్రశ్న: జ్ఞాని పరమహంస కాగలడా?*

సమాధానం: పరిశీలనచేత, స్వానుభవంచేత, వీధులూడ్చేవాడి స్థితి నుంచి సార్వభౌముడి స్థితి వరకూ గల సమస్త దశలను పరిశోధించి, విషయభోగాలు తుచ్ఛమైనవని నిశ్చయానికి వచ్చిన బుద్ధి కలిగిన నాడు జ్ఞాని పరమహంస అవుతాడు.

***82. ప్రశ్న: మహాశయా! ఆత్మజ్ఞాని లక్షణమేమిటి?***

సమాధానం: ఎవరైతే ఈ లోకంలో జీవించి వున్నా మృతుడై ఉంటాడో వాడే ఆత్మజ్ఞాని. అంటే ఎవరిలో అయితే కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు పూర్తిగా నశించాయో వాడే ఆత్మజ్ఞాని.

***83. ప్రశ్న: 'మాయ'కు, 'దయ'కు తేడా ఏమిటి?***

సమాధానం: ఈ రెండూ వేర్వేరు విషయాలు. తన సొంతమనుష్యుల మీద, మనం ఏదో ప్రతిఫలం ఆశించే వారి పట్ల చూపే ప్రేమ 'మాయ'. నిష్కామంతో సకలభూతాల పట్ల చూపేది 'దయ'. ఈ దయ వలన సమస్తప్రాణికోటికీ సేవ చేసి చిత్తశుద్ధిని పొందవచ్చు. మాయ కూడా భగవంతుడి సృష్టే కానీ, అది మనల్ని అజ్ఞానంలో, బంధాలలో ఉంచుతుంది. చిత్తశుద్ధిని సాధించడం ద్వారా కామక్రోధాదుల మీద జయాన్ని సాధిస్తే తుదకు భగవంతుడి దర్శనం కలుగుతుంది. నేను మీకు చాలా గోప్యమైన విషయాన్ని చెప్తాను. కామాన్ని జయించడానికి నేను కూడా చాలా శ్రమపడవలసి వచ్చింది సుమా!

***84. ఆ మధ్యన ఒకానొక మహాత్ముడు తన ప్రసంగంలో తాను మహాజ్ఞానిననీ, తనను మించిన జ్ఞాని లేడనీ తన గురించి తాను గొప్ప చెప్పకున్నాడు. అసలు జ్ఞానిని గుర్తించడం ఎలా?***

సమాధానం: ఆ జ్ఞానికి దేహబుద్ధి ఉన్నదో లేదో గమనించండి. దేహబుద్ధి నిర్మూలన కాకుండా జ్ఞానం పొందడం అసాధ్యం. జ్ఞానయోగం ఈ యుగానికి చాలా కష్టమైనది. ఈ కాలంలో జీవుడు అన్నగత ప్రాణి. దానికి తోడు

ఆయుష్షు తక్కువ. పైగా ఏమి చేసినా దేహబుద్ధి తొలగదు. వ్యాధి, శోకం, సుఖం, దుఃఖం లాంటి భావనల గురించిన ఎరుక ఉన్నంతవరకూ ఎవరూ జ్ఞాని కాలేరు. వీటన్నింటికీ అతీతుడుగా ఉండాలి. చేతిలో ముల్లు గుచ్చుకుని ధారగా రక్తం కారుతూ, బాగా నొప్పిగా ఉన్నా సరే, ఆ స్థితిలో కూడా శరీరానికేగానీ, నాకేమీ జరగలేదని చెప్పగలిగేవాడే జ్ఞాని!

### *85. ప్రశ్న: అజ్ఞానం, జ్ఞానం, విజ్ఞానం - అనే మాటలకు అర్థం ఏమిటి?*

సమాధానం: నానా విషయాలను తెలుసుకోవడం అజ్ఞానం. పాండిత్యం ఉందన్న అహంకారం కూడా అజ్ఞానమే. సర్వభూతాలలోనూ ఉన్నది ఒకేవొక్క భగవంతుడు అన్న నిశ్చయాత్మకమైన బుద్ధిని జ్ఞానం అంటారు. అన్నింటా భగవంతుడే ఉన్నాడని అనుభూతి చెందడాన్ని విజ్ఞానం అంటారు.

## 08. కామకాంచనత్యాగం, వైరాగ్యం

***86. ప్రశ్న: ప్రతి ఒక్కరూ సంసారాన్ని పరిత్యజిస్తే అది భగవంతుడి సంకల్పానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నట్లే కదా?***

సమాధానం: ప్రతి ఒక్కరూ ఎందుకు సన్న్యసించాలి? అక్కరలేదు. అంతమాత్రాన, మనుష్యులందరూ కూడా కుక్కలు, నక్కల మాదిరిగా కామకాంచనాలలో మునిగి ఉండాలన్నదే భగవంతుడి సంకల్పమా? ఆయనకు మరే అభిలాష లేదా? ఆయన సంకల్పమేమిటో ఎవరికి తెలుసు? ప్రాపంచిక జీవితం ప్రతి ఒక్కరూ గడపాలన్నదే ఆయన సంకల్పం అని మీరంటారు. కానీ భార్య పిల్లలు మరణించినప్పుడు, దానిని భగవంతుడి సంకల్పంగా మీరెందుకు పరిగణించరు? తినడానికి పిడికెడు అన్నం లేనప్పుడు, మీ పేదరికాన్ని కూడా భగవత్సంకల్పంగా ఎందుకు భావించరు?

***87. ప్రశ్న: ఆధ్యాత్మిక మార్గంలో వెళ్ళదలుచుకున్న వారు సన్న్యాసం తీసుకోవాలా? సన్న్యాస, గృహస్థ మార్గాలలో ఏది గొప్పది?***

సమాధానం: అందరూ సన్న్యాసం తీసుకోవలసిన అవసరం లేదు. సన్న్యాస, గృహస్థ మార్గాలలో దేనికదే గొప్పది. మీ సంస్కారాలను బట్టి, అధికార భేదాన్ని బట్టి మీకనువైన మార్గాన్ని ఎంచుకోవాలి.

గృహస్థుగా ఉండి సాధనలు చేయడం కోటలో ఉండి అంటే సురక్షిత ప్రదేశంలో ఉండి యుద్ధం చేయడం లాంటిది. గృహస్థుకు మానసిక త్యాగమే అత్యవసరం కానీ బాహ్యత్యాగం అవసరం లేదు. సన్న్యాస జీవితం అంటే విశాలమైన

మైదానంలో శత్రువును ఎదుర్కోవడం అని చెప్పుకోవచ్చు. అలాంటప్పుడు ఎటునుండి ఏమైనా తగలవచ్చు కదా. ఎంతో గుండెదిటవు, బలం, సామర్థ్యం ఉంటే తప్ప సన్యాస జీవితంలోకి అడుగుపెట్టకూడదు. సన్యాస జీవితానికి బాహ్య, ఆంతరిక త్యాగాలు – రెండూ అవసరమే. ప్రలోభాలను అత్యంత శక్తితో, ధైర్యంతో ఎదుర్కోవలసి ఉంటుంది.

***88. ప్రశ్న: స్వామీ! మేము జీవితమంతా ఇంద్రియసుఖాలనూ అనుభవించినా తనివి తీరడం లేదు. వాటి మీద మాకు వైరాగ్యం కలగడం లేదెందుకు?***

సమాధానం: ఈ విషయంలో సరైన అవగాహన, వివేకం, విచక్షణ లేకపోవడం వలనే విషయసుఖాల పట్ల వైరాగ్యం కలగదు. ఒకవేళ కలిగినా అది క్షణికమే. ఎంతగా ప్రక్కకు తీసినా, మళ్ళీమళ్ళీ నీటిని కప్పివేసే నాచు లాగా మాయ మనలను కప్పివుంచుతుంది. ఇంద్రియ సుఖాలను అనుభవించాలనే కోరికలు సముద్రంలో తరంగాలలాగా అవిచ్ఛిన్నంగా పుడుతూనే ఉంటాయి. అంతేకాదు, అగ్నిలో ఆజ్యం పోస్తే, అది ఆ అగ్నిని మరింత ప్రజ్వలింపజేసినట్టు, ఈ విషయవాంఛలను అనుభవిస్తున్న కొద్దీ వాటి మీద వ్యామోహం ఇంకాయింకా పెరిగిపోతూ ఉంటుంది. ఐతే నిరంతర భగవన్నామ స్మరణ, నిత్యానిత్య విచక్షణ ద్వారా వైరాగ్యం అలవడుతుంది.

***89. ప్రశ్న: మీరు కాంచనత్యాగం చేయమని చెప్తారు. మరి ఈ లౌకిక ప్రపంచంలో అదెలా సాధ్యపడుతుంది?***

సమాధానం: తప్పక సాధ్యపడుతుంది. ముందుగా త్యాగం

అంటే ఏమిటో అర్థం తెలుసుకోండి. సంసారులకు సంబంధించినంతవరకూ త్యాగం అంటే పూర్తిగా వదిలివేయమని కాదు. తృప్తి అనేదాని నుండి త్యాగం ఉద్భవిస్తుంది. ముందు తృప్తిని అలవాటు చేసుకోండి. ఉన్నదానితో తృప్తిపడడం నేర్చుకుంటే త్యాగం దానంతట అదే అబ్బుతుంది. శరీరం ఉన్నంతకాలం అవసరాలు తప్పవు. అయితే కనీస అవసరాలకు మించిన దాన్ని వదలివేయడమే త్యాగం అనవచ్చు. తెల్లవారి లేస్తే డబ్బు లేకుండా పని జరుగుతుందా చెప్పు!

సన్న్యాసికి ఉండే నియమం వేరు. అతడు అన్నింటినీ పూర్తిగా వదలివేయాలి. అతడి అవసరాలను గృహస్థులు చూసుకోవాలి. కానీ గృహస్థులు అవసరాలు ఎవరు తీరుస్తారు చెప్పు? అందుకే ధర్మమార్గంలో అర్థకామాలను పొందవచ్చు. అది తప్పు కాదు. ధర్మబద్ధంగా అర్థకామాలతో వ్యవహరించిన వాడికి మోక్షప్రాప్తి తప్పక కలుగుతుంది. గృహస్థుడు తాను చేసే ప్రతి పనినీ భగవదర్పితంగా చేస్తే బంధాలలో పడడు.

### *90. ప్రశ్న: మాకు వైరాగ్యం కలగడం లేదు. ఎందువలన?*

సమాధానం: వైరాగ్యం కలగకపోవడానికి కారణం భగవంతుడి మాయ. మాయాప్రభావం వలన శాశ్వతమైనవి అశాశ్వతంగానూ, అశాశ్వతమైనవి శాశ్వతంగానూ అగుపిస్తాయి. ఈ సంసారం అనుక్షణం మారిపోతూ ఉంటుంది. అంటే అది అశాశ్వతం. భగవంతుడొక్కడే శాశ్వతుడు. మాయామేఘాలు ఆవరించి వున్నంత వరకూ జ్ఞానమనే సూర్యుణ్ణి మనం చూడలేము. కామకాంచనాలనే

మాయామేఘాలను తొలగించడానికి మన నిజస్వరూపం మీద ధ్యానించాలి. అంటే 'నేను ఎవరిని?' అని చింతించాలి. ఈ ధ్యానంలో ముందుకుపోయిన కొద్దీ మాయామేఘాలు, పూర్వసంస్కారాలు నశించి ఆధ్యాత్మిక పురోగతి కలుగుతుంది.

***91. ప్రశ్న: నా స్నేహితుడొకడున్నాడు. అతడు గృహస్థు. ఒక మహాపురుషునితో ఎప్పుడూ సత్సాంగత్యం చేస్తుంటాడు. లౌకిక సుఖాలు నిస్సారంగా ఉన్నాయనీ, సన్న్యాసం పుచ్చుకోవాలనీ అంటుంటాడు. అతనికి మీ సలహా?***

సమాధానం: ఆలోచనారహితంగా ఏదీ చేయకూడదు. ఎవరి ద్వారా ఏ పని చేయించాలో ఆ ఒక్క భగవంతుడికే తెలుసు. సంసారాన్ని వదిలేస్తే, అతని భార్యాబిడ్డల సంగతి ఎవరు చూస్తారు? అతని కోసం భగవంతుడు ఏర్పాటు చేసిన దానిని తారుమారు చేయడానికి ప్రయత్నించకూడదు. ప్రతిదీ సముచితకాలంలో జరుగుతుంది. సంసారంలో జీవించడ మంటే ఒక కోటలో జీవించడంలాంటిది. శత్రువును కోట బయటకు వెళ్ళి ఎదుర్కోవడం కన్నా కోట లోపలి ఉండి పోరాడడమే సులువు. మనస్సును భగవదాయత్తం చేసినపుడు మాత్రమే సంసారాన్ని త్యజించగలుగుతాం. అతనికి ఆ స్థితి వుంటే సంసారాన్ని వదలివేయవచ్చు. అంతేకానీ అంతకు ముందు కాదు. అటువంటి మనఃస్థితి రావడం చాలా కష్టం. పండును దాని సముచిత సమయంలోనే పక్వానికి రానివ్వాలి సుమా!

***92. ప్రశ్న: మీరు ఏకాంతవాసం అని మాటిమాటికీ చెపుతున్నారు. అంటే ఇల్లు వదలిపెట్టి పోవాలా?***

సమాధానం: అవసరం లేదు. సమయం దొరికినపుడల్లా ఒకటి రెండు రోజులు ఏకాంతవాసం చేయాలి. ఆ రోజులలో సంసారంతో ఎటువంటి సంబంధం పెట్టుకోకూడదు. సర్వం మరచి, ఈశ్వరచింతనలోనే మునిగిపోవాలి. ఏకాంతవాసం, సాధుసాంగత్యం – ఇవే సాధనకు ఆవశ్యకాలు.

***93. ప్రశ్న: సర్వ అనర్థాలకూ మూలమైన ఈ శరీరాన్ని వదలివేస్తే బాగుంటుంది కదా!***

సమాధానం: జన్మనెత్తిన తర్వాత ప్రారబ్ధకర్మలను అనుభవించక తప్పదు. కర్మఫలాన్ని అనుభవించేంత వరకూ శరీరం ఉండితీరుతుంది. ఒక గుడ్డివాడు గంగా స్నానం చేశాడు. వాడి పాపాలన్నీ నశించాయి. కానీ గుడ్డితనం మాత్రం పోలేదు. పూర్వజన్మలలో చేసుకున్న కర్మ మిగిలి ఉంది కాబట్టి వాడు దాన్ని అనుభవించి తీరాలి.

***94. ప్రశ్న: ఏ మార్గం మంచిది? మనస్సులో వ్యథతో సంసారాన్ని త్యజించడమా? లేక సంసారంలోనే ఉంటూ భగవచ్చింతన చేయడమా?***

సమాధానం: మనస్సులో వ్యథపడుతూ సంసారాన్ని త్యజించేవారు హీన శ్రేణికి చెందినవారు. సంసారంలోనే ఉంటూ ఆసక్తి లేకుండా కర్మలు చేస్తూ ఉన్నట్టయితే, అంతా మిథ్యేనన్న జ్ఞానాన్ని పొందవచ్చు. సంసారంలో ఉండే జ్ఞాని గాజుతో చేసిన ఇంట్లో నివసించే వ్యక్తిలాంటివాడు. అతడు లోపలా బయటా కూడా, అంటే ఈ ప్రపంచాన్నే కాక పారమార్థిక ప్రపంచాన్ని కూడా, చూడగలడు.

**95. ప్రశ్న: వైరాగ్యాలలో ఎన్ని రకాలు ఉన్నాయి?**

సమాధానం: తీవ్ర వైరాగ్యం, మంద వైరాగ్యం అని రెండు రకాలు. తీవ్రవైరాగ్యం ఉన్న మనిషి తాను చేపట్టిన పనిని దానిని సాధించేవరకూ విడిచిపెట్టడు. మందవైరాగ్యం ఉన్నవాడు మొదలుపెట్టిన పనిని మధ్యలోనే మానివేస్తాడు. (ఒక కథ చెపుతా విను! 71.ఇద్దరు వ్యవసాయదారులు)

**96. ప్రశ్న: ఈ శరీరం ఉపయోగం లేనిది, నశించేది అయితే, ఈ స్వామీజీలు శరీరం గురించి ఎందుకు అంత శ్రద్ధ చూపిస్తున్నారు?**

సమాధానం: వ్యర్థంగానూ, ఖాళీగానూ ఉన్న పెట్టెను ఎవరైనా జాగ్రత్తగా దాస్తారా? ఖరీదైన ఆభరణాలు డబ్బు ఉన్న పెట్టెనే జనులు జాగ్రత్తగా కాపాడతారు. అలాగే, భక్తులు ఈశ్వరుడు నివసిస్తున్న ఈ శరీరాన్ని చూసుకుంటారు. దాన్ని అలక్ష్యంగా వదిలేయరు. మన శరీరాలన్నీ ఈశ్వరుడనే సంపద ఉన్న పెట్టెల లాంటివి.

భగవంతుణ్ణి తెలుసుకోవడానికి మనకు ఉపయోగపడే ఏకైక పరికరం ఈ దేహం. భగవంతుడే మనకు దీన్ని ఇచ్చాడు. కనుక దానిని చక్కగా ఉంచడం ద్వారా భగవంతుడి సేవను చక్కగా చేయగలుగుతాము, ఆయననే తెలుసుకోగలుగుతాము.

**97. ప్రశ్న: జీవితంలో సౌకర్యవంతంగా, సుఖంగా కాలం గడపడానికి మేము అనేక వస్తువులను కొంటూ ఉంటాము. అవి మాకెంతో విలువైనవిగా అనిపిస్తాయి. వాటి గురించి మీ అభిప్రాయం?**

సమాధానం: ఒకటి అనే అంకె తర్వాత సున్నాలు చేరిస్తే వాటి విలువ పెరుగుతుంది. ఆ ఒకటి లేకుంటే మిగిలేది విలువలేని సున్నాలే. భగవంతుడే ఆ ఒకటి అనే సంఖ్య. ఈ ప్రపంచంలో భగవంతుణ్ణి చేర్చలేని పనులు, వస్తువులన్నీ సున్నాలకిందే లెక్క. మానవులు తాత్కాలికమైన వస్తువుల ద్వారా సుఖాన్ని పొందడానికి ప్రయత్నిస్తే అది తాత్కాలిక సుఖమే అవుతుంది. శాశ్వతుడైన భగవంతుడిలో ఆనందాన్ని వెతుక్కుంటే శాశ్వతమైన ఆనందం దొరుకుతుంది. కాబట్టి మనం చేసే పనులు, కొనే వస్తువులు అన్నీ మనల్ని దేవునివైపు నడిపించేవై ఉండాలి.

### *98. ప్రశ్న: కామినీకాంచనాలను త్యజించడమంటే స్త్రీలను ద్వేషించమని మీ ఉద్దేశ్యమా?*

సమాధానం: లేదు, లేదు - ద్వేషించకూడదు. స్త్రీలను కామదృష్టి లేకుండా జగన్మాత యొక్క అంశగా దర్శించాలి. ప్రతి స్త్రీని మాతృమూర్తిగా దర్శించండి. అప్పుడే ఆధ్యాత్మిక పురోభివృద్ధి సాధ్యపడుతుంది. సత్యవ్రతం పాటిస్తూ, పరస్త్రీలను తల్లిగా చూసేవాడికి తప్పక భగవత్సాక్షాత్కారం కలుగుతుందని తులసీదాస్ అన్నాడు కదా!

### *99. ప్రశ్న: బద్ధజీవులకు ఎటువంటి స్థితి కలిగితే ముక్తి కలుగుతుంది?*

సమాధానం: ఈశ్వరుడి కృపచేత తీవ్రమైన వైరాగ్యం కలిగినప్పుడు, కామకాంచనాల మీద ఆసక్తి నుంచి తప్పించుకోవచ్చు. తీవ్ర వైరాగ్యం ఎలాంటిదో తెలుసా? భగవంతుడి కోసం ప్రాణాలను సైతం విడచిపెట్టగల

వ్యాకులతతో కొట్టుకుంటున్న వారికే తీవ్రవైరాగ్యం అబ్బినట్లు! ఆ విధమైన స్థితికి చేరినవాడు సంసారాన్ని వదిలి భగవత్సాక్షాత్కారం కోసం కష్టపడతాడు. గట్టిపట్టుదలతో సాధన చేస్తాడు. మందవైరాగ్యం ఉన్నవాడు ఎలా ఉంటాడో తెలుసా? ఏదో రోజులు గడచిపోతున్నాయి. పోతేపోనీ! వీలైనప్పుడు ఏదోవొక దేవుణ్ణి స్మరించుకుందాం, లేకపోతే ఏదైనా తీర్థంలో మునిగివద్దాం అని మందవైరాగ్యులు అనుకుంటూ ఉంటారు.

### *100. ప్రశ్న: విషయభోగాల మీద 'వితృష్ణ' అంటే ఏమిటి?*

సమాధానం: కామకాంచనాలే విషయభోగాలు. విషయభోగాలను అనుభవించిన తర్వాత వాటి రుచి తగ్గిపోయి, వెగటు పుడుతుంది. దీనినే 'వితృష్ణ' అంటారు. ఈ వితృష్ణ కలగకపోతే ఈశ్వరుడి పట్ల వ్యాకులత కలుగదు.

### *101. ప్రశ్న: వివేకం అంటే ఏమిటి?*

సమాధానం: ఈశ్వరుడు 'సత్', మిగిలినదంతా 'అసత్' అని తెలుసుకోవడమే వివేకం. 'సత్' అంటే నిత్యం, శాశ్వతం. 'అసత్' అంటే అనిత్యం, తాత్కాలికం. వివేకి ఈశ్వరుడే. వివేకం ఉదయించినపుడు ఈశ్వరుణ్ణి తెలుసుకోవాలనే ఇచ్ఛ కలుగుతుంది. దేహసౌఖ్యాలు, పేరుప్రతిష్ఠలు, సిరిసంపదలు అనిత్యాలు. సదసద్విచారం చేసినప్పుడు ఈశ్వరతత్త్వం అర్థం అవుతుంది.

## 09. మనస్సు, ఏకాగ్రత, ధ్యానం, సమాధి

***102. ప్రశ్న: మనస్సు, మనస్సు అంటూ ఉంటారు కదా! దాని స్వరూపం ఏమిటి?***

సమాధానం: మనస్సు సూక్ష్మాతిసూక్ష్మమైన భౌతికశక్తి. దాని నుండి అన్ని కోరికలూ వెలువడుతూ ఉంటాయి. కోరికల్ని తొలగిస్తే మనస్సు మరి ఉండదు. కాబట్టి కోరికే మనస్సు స్వరూపం. మనస్సులోనే జగత్తు ఉంటుందనీ, మనస్సులోనే అది మాయం అవుతుందని తోతాపురి చెప్పేవారు. సాలె పురుగు తన దేహంలో నుంచి దారాలను బయటకు తీసి గూడు అల్లి, మరల తనలోకే దారాలను తీసుకున్నట్లు, మనస్సు తనలో నుంచే ప్రపంచాన్ని బయటకు తీసి, మరలా తనలోకే ఉపసంహరించుకుని, మరుగుపరుస్తుంది. మనస్సు ఆత్మ నుంచి బయటకు వెడలినప్పుడు ప్రపంచం తోస్తుంది. మనస్సు తన స్వస్వరూపాన్ని విచారిస్తూ అంతర్ముఖం అయినప్పుడు ఆత్మను చేరుకుంటుంది. మనస్సు ఎప్పుడూ స్థూలవస్తువులను ఆశ్రయించి ఉంటుంది. ఒంటరిగా ఉండలేదు.

***103. ప్రశ్న: మనస్సును స్వాధీనం చేసుకోవడానికి ఉపాయాలు లేవా?***

సమాధానం: ప్రాణం అనేది మనస్సు యొక్క స్థూలరూపం. మరణకాలం దాకా మనస్సు ప్రాణాన్ని శరీరంలో నిలిపి, మరణించేటప్పుడు దాన్ని తనతోపాటు వేరే శరీరానికి తీసుకొనిపోతున్నది. ప్రాణాయామంతో మనస్సును

నియంత్రించవచ్చు. కానీ ప్రాణాయామం తెలిసిన వ్యక్తి వద్ద శిక్షణ తీసుకోవాలి. రూపధ్యానం, లీలాధ్యానం, మంత్రజపం, ఆహారనియమాలు మొదలైన సాధనలతో మనస్సును నియంత్రించవచ్చు. నీటిలో ఉన్న బరువైన దుంగను చేరుకోవాలనుకో. దానికి ఒక గొలుసును తగిలించి, గొలుసుకున్న ఒక్కొక్క కొక్కాన్నే పట్టుకుంటూ నెమ్మదిగా ఆ దుంగను చేరుకోవచ్చు. అలాగే మనస్సుకు నెమ్మదినెమ్మదిగా మార్గనిర్దేశం చేస్తూ, సాధన అలవాటు చేస్తే దానిని వశపరచుకోవచ్చు. మనస్సులోని విషయవాసనలు ఒక్కొక్కటిగా బలహీనపడి ఏకాగ్రత సాధ్యపడుతుంది. తద్వారా ఆత్మవిచారణకు మార్గం సుగమం అవుతుంది.

### *104. ప్రశ్న: మహాశయా! మనస్సును స్వాధీనం చేసుకోవడం చేతకావడం లేదు. దీనికి సులభోపాయం ఏదైనా ఉందా?*

సమాధానం: ఎందుకు లేదు? ఉంది! అయితే ఒక్కసారిగా మనస్సును స్వాధీనం చేసుకోలేము. నీ చిన్నప్పుడు నీ తల్లి నీకు పాలు, పళ్ళరసాలు ఎలా త్రాగించింది? ఒక చెంచాతోనో, ఉగ్గుగిన్నెతోనో కదా! ఆ తర్వాత చిన్న గ్లాసుతో, ఇంకా కొంచెం పెద్దయ్యాక పెద్ద గ్లాసుతోనో, చెంబుతోనో త్రాగగలుగుతున్నావు కదా! ఇదీ అంతే! నీ మనస్సు పసిపాపలాంటిది. దానికి ఒక్కసారిగా ఏ అంశాన్నైనా ఎక్కించాలనుకోవడం వెర్రితనం. కొంచెం కొంచెంగా అలవాటు చేస్తే, కొంతకాలానికి అది ఎంతైనా స్వీకరించడానికి సిద్ధపడుతుంది. మనస్సును ఓపికగా పసిపిల్లను సాకినట్లు సాకితే అంతా సాధ్యపడుతుంది.

### *105. ప్రశ్న: (గిరీశ్చంద్ర ఘోష్) మనస్సు కొన్నిసార్లు ఉన్నతమైన స్థితిలోనూ, కొన్నిసార్లు హీనస్థితిలో దిగజారి ఉంటున్నది. ఎందుకని?*

సమాధానం: సంసారంలో అంటే కామకాంచనాల నడుమ ఉన్నప్పుడు అలాగే ఉంటుంది. సంసారి ఈగలాంటి వాడు. ఈగ కొన్నిసార్లు మిఠాయిల మీద వాలినా, కొన్నిసార్లు చెత్తకుప్పల మీద కూడా వాలుతూ ఉంటుంది. సంసారి మనస్సు భగవదాలోచనలు చేస్తున్నప్పుడు ఉన్నతంగానూ, కామ–కాంచనాల మీద లగ్నమయినపుడు నీచస్థాయిలోనూ ఉంటుంది. కేవలం పూవుల మీద మాత్రమే వాలే తేనెటీగల (సన్న్యాసుల) లాగా మీరు తయారవ్వాలి. అపుడు వేరే వస్తువులు రుచించవు. అలాంటి మనస్సు ఉన్నతస్థాయులలోనే కొనసాగుతూవుంటుంది. భగవదనుగ్రహం ఉంటే మనస్సు ఆయన మీదే నిలుస్తుంది.

### *106. ప్రశ్న: మేము చిన్నప్పటి నుంచీ చెడు అలవాట్లకు లోనయివున్నాం. వాటి ప్రభావం ఎలా ఉంటుందో కూడా తెలియని స్థితిలో ఉన్నాం. వీటి ప్రభావం గురించి వివరించండి.?*

సమాధానం: మన అలవాట్లను బట్టి మన వ్యక్తిత్వం తయారవుతుంది. అలవాట్లు చెడ్డవైతే వ్యక్తిత్వం చెడిపోతుంది, అలవాట్లు మంచివైతే వ్యక్తిత్వం మంచిదవుతుంది. మనకు ఏది అలవాటైతే అది లేకుండా ఉండలేము. కానీ వాటిని మార్చుకోవడం సాధ్యమే. నెమ్మదినెమ్మదిగా అలవాట్లను మంచివిగా తయారుచేసుకోవాలి. (ఒక కథ చెపుతా విను! 104. అలవాట్ల ప్రభావం)

***107. ప్రశ్న: బంధానికీ, మోక్షానికీ కూడా మనస్సే కారణం అని చెపుతున్నారు. అదెలా సాధ్యం?***

సమాధానం: బంధానికీ, మోక్షానికీ కారణం కేవలం మనస్సే. సంకల్పానికి తగినట్లే ఫలితం వస్తుంది. చేస్తున్న వృత్తి ఎలాంటిదైనా ఎవరైతే హృదయంలో పవిత్రత కలిగివుంటారో వారే ముక్తిని పొందుతారు. (ఒక కథ చెపుతా విను! 119. సన్న్యాసి–వేశ్య)

***108. ప్రశ్న: భగవద్ధ్యానం ఎలా ఉండాలి?***

సమాధానం: మనస్సు దేవుని యందు లగ్నమైతే, భగవంతుడు అత్యంత సమీపంలోనే, అంటే హృదయంలోనే కనిపిస్తాడు. కానీ ఇక్కడ ఒక్క విషయం జ్ఞాపకముంచు కోవాలి. భగవంతుడితో సంబంధం పెరిగేకొద్దీ మనస్సు ప్రాపంచిక విషయాలకు దూరమైపోతుంది. భగవద్ధ్యానం చేసేటప్పుడు బాహ్యస్పృహ లేకుండా భగవంతుడిలో లీన మవ్వాలి. (ఒక కథ చెపుతా విను! 43.బిల్వమంగళుని కథ)

***109. ప్రశ్న: భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడానికి 'ధ్యానం' చేస్తే చాలా?***

సమాధానం: అదేం మాట? మొహం మొత్తిపోయేలా ఒకే పద్ధతిని ఆశ్రయించుకుని నేను ఎలా ఉండగలను? చేపను రకరకాలుగా వండి తింటారు. పులుసు, వేపుడు, ఊరగాయ – ఇలా రకరకాలుగా తింటారు. అలాగే, నేను పూజ, జపం, ధ్యానం, నామసంకీర్తన, గుణగానం, లీలాధ్యానం – ఇలా అనేక విధాలుగా ఆయనలో తాదాత్మ్యం చెందుతూ ఉంటాను. ఒక్కొక్కసారి ఆయన నామోచ్చారణ చేస్తూ నాట్యం చేస్తాను.

ముఖ్యంగా కావలసింది వ్యాకులత. భగవంతుడి కోసం ప్రాణాలు తహతహలాడిపోవాలి. భగవంతుడి కోసం విలవిల లాడితే ఆయన దర్శనానికి ఇక ఎక్కువ కాలం వేచివుండ నక్కరలేదు. (ఒక కథ చెపుతా విను! 8.వ్యాకులత ఎలా ఉండాలో చూపిన గురువు)

### *110. ప్రశ్న: ధ్యానం చేయాలంటే నా మనస్సు, శరీరం సహకరించడం లేదు. ఏమి చేయాలి?*

సమాధానం: పంటినొప్పితో బాధపడేవాడు రోజువారీ పనులన్నీ యాంత్రికంగా చేసుకుపోతూనే ఉంటాడు. కానీ మనస్సంతా పంటినొప్పి మీదే ఉంటుంది సుమా! అలాగే కళ్ళు తెరుచుకుని పనులు చేసుకుంటూ, మాట్లాడుతూ కూడా ధ్యానం చేయవచ్చు. అలాగే కుర్చీలో కూర్చొని, మంచం మీద పడుకుని, నడుస్తూ కూడా భగవత్స్మరణను నిరాటంకంగా చేసుకోవచ్చు. 'డెంటల్ మెడిటేషన్' (పంటినొప్పి ధ్యానం) చేయాలి!

### *111. ప్రశ్న: భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నప్పడే మనస్సు ఇంద్రియ సుఖాల వైపు మరలుతున్నది. దీనిని ఎలా నివారించగలం?*

సమాధానం: ఎప్పుడైతే మనస్సు నిజంగా, చిత్తశుద్ధితో భగవంతుడి వైపు మరలుతుందో, అది ఇక ఇంద్రియసుఖాల వైపు మరలదు. (ఒక కథ చెపుతా విను! 53.రామభక్తుడైన రావణుడు; 56. విభీషణుడు– లంకా రాజ్యం)

### *112. ప్రశ్న: ధ్యాన సమయంలో ఏదైనా కోరిక కలిగితే ఏమి చేయాలి?*

సమాధానం: అలా కోరిక కలిగినప్పుడు ధ్యానం ఆపి,

భగవంతుణ్ణి ప్రార్థించండి. ఆ కోరికను మనస్సు నుండి తొల గించమని చిత్తశుద్ధితో, నిజాయతీతో ఆయనను వేడుకోండి. అలాచేస్తే ఆ విధమైన అడ్డంకులన్నీ తొలగిపోతాయి.

***113. ప్రశ్న: ధ్యానంలో నా మనస్సు ఏకాగ్రమవ్వడం లేదు. చంచలమైపోతోంది. దీనికి కారణం ఏమిటి?***

సమాధానం: ఈగలు తినుబండారాల మీద వాలుతాయి, అశుద్ధం మీద కూడా వాలుతాయి. కానీ తేనెటీగ మాత్రం పుష్పాలమీదే వాలి మకరందాన్ని గ్రోలుతుంది. కానీ ఇంక దేనిమీదా వాలదు. అలాగే విషయాసక్తి ఉన్నవారు ఈగల వంటి వారు. దైవప్రార్థన చేసి ఆనందాన్ని కొంతసేపు అనుభవించినా, పాత వాసనల చేత వారు అల్పమైన ఇంద్రియ సుఖాలనే మలాన్ని వెతుక్కుంటూ పోతున్నారు. అభ్యాసయోగం అని ఒకటున్నది కదా! పట్టువదలకుండా అభ్యాసం చేస్తే క్రమంగా మనస్సు గొప్ప ఏకాగ్రతను సాధిస్తుంది.

***114. ప్రశ్న: భగవంతుణ్ణి ఏ స్థానంలో ధ్యానించాలి?***

సమాధానం: హృదయస్థానంలోనే భగవంతుణ్ణి ధ్యానిం చాలి. అదే తగిన స్థానం.

***115. ప్రశ్న: భగవంతుణ్ణి ఏ రూపంలో ధ్యానించాలి?***

సమాధానం: సాకారం నా తల్లి. నిరాకారం నా తండ్రి. త్రాసులో రెండు తట్టలూ సమానమే కదా. ఈ రెంటిలో ఏ విధంగా ధ్యానించే వారినీ నిందించవద్దు. ఏదోవొక భావాన్ని ఆశ్రయించి విశ్వసిస్తే చాలు. భగవంతుడు సర్వం తానై ఉన్నాడు. మంచిచెడులకు, పాపపుణ్యాలకు, భక్తిజ్ఞానాలకు,

సర్వానికీ ఆయనే కర్త. సర్వానికీ ఆయన అతీతుడు కూడా. ఈ విధమైన విశ్వాసం ఉంటే చాలు.

***116. ప్రశ్న: సహస్రారంలో మనస్సు లయమైనప్పుడు బ్రహ్మజ్ఞానం కలుగుతుందంటారు కదా! ఆ స్థితిలో మానవుడు ఏమి దర్శిస్తాడు?***

సమాధానం: సహస్రారంలో మనస్సు లగ్నమైనప్పుడు కలిగే అనుభవాన్ని వర్ణించలేము. సముద్రపు లోతును కొలవడానికి పోయిన ఉప్పుబొమ్మ పరిస్థితి ఏమిటో ఇది కూడా అంతే. బొమ్మ సముద్రంలో దిగగానే అందులో కరిగిపోతుంది. అది ఇంక తిరిగివచ్చి ఏమి సమాచారం చెప్పగలుగుతుంది? అలాగే సహస్రారంలోకి మనస్సు ప్రవేశిస్తే ఆ మనస్సే నశిస్తుంది. ఆ అనుభవం ఎలా ఉంటుందో నోటితో వర్ణించలేము.

***117. ప్రశ్న: సమాధిలో ఎన్ని రకాలు ఉన్నాయి?***

సమాధానం: జ్ఞానులకు కలిగేది 'జడసమాధి'. దీనిలో 'నేను' అన్న భావన ఉండదు. భక్తులకు కలిగేది 'చేతన సమాధి'. దీనిలో 'నేను' అన్న భావన ఉంటుంది. సేవకుడు-సేవించడం, ప్రేమికుడు-ప్రేమించడం అనే భావాలు ఉంటాయి. ఈశ్వరుడు సేవలందుకునేవాడు, భక్తుడు సేవకుడు. ఈశ్వరుడు రసస్వరూపుడు, భక్తుడు రసికుడు. భక్తుడు చక్కెర తిని ఆనందించాలని కోరుకుంటాడు కానీ, జ్ఞానిలాగా తానే చక్కెరగా మారాలని కోరుకోడు.

## 10. మాయ, పునర్జన్మ, అలౌకికవిషయాలు

***118. ప్రశ్న: 'మాయ' అనే మాట సాధారణంగా ఆధ్యాత్మిక ప్రసంగాలలో వినిపిస్తూ ఉంటుంది. అసలు మాయ అంటే ఏమిటి?***

సమాధానం: తల్లిదండ్రులు, సోదరీసోదరులు, ఆలుబిడ్డలు, బంధువులు, సిరిసంపదలు, కీర్తిప్రతిష్ఠలు, తెలివితేటలు - వీటి పట్ల మనకు ఉండే మమతే మాయ!

***119. ప్రశ్న: యోగమాయ అంటే ఏమిటి?***

సమాధానం: యోగమాయ అంటే ప్రకృతి-పురుషుల యోగం. ఈ జగత్తులో కనపడేది అంతా ప్రకృతి-పురుషుల కలయికే. శివసమేతంగా ఉన్న కాళికాదేవిని చూశారా! శివుడు ఒక శవంలాగా కదలకుండా పడి ఉంటాడు. ఆ శివుని స్పర్శ చేతనే శక్తి విజృంభిస్తుంది. శివుడి హృదయం మీద పాదాలు మోపి, ఆమె శివసమేతంగా సృష్టి, స్థితి, లయ చేస్తున్నది. శివుడు నిర్గుణ పరబ్రహ్మం. శుద్ధసత్త్వుడు. అందుచేతనే శవంలాగా పడివున్నాడు. ఆమె సగుణ పరబ్రహ్మం. సృష్టి అంతటిలో ఆమె తనను తాను వ్యక్తీకరించుకుంటోంది.

***120. ప్రశ్న: మహాశయా! విద్యామాయ, అవిద్యామాయ అంటే ఏమిటి?***

సమాధానం: విద్యామాయ, అవిద్యామాయ - ఇవి రెండూ కూడా భగవంతుడిలోనే ఉన్నాయి. విద్యామాయ మనల్ని

భగవంతుడి వైపు నడిపిస్తుంది. అవిద్యామాయ మనకు భగవంతుడంటే విముఖత్వం కలిగేలా చేస్తుంది. జ్ఞానం, వైరాగ్యం, కారుణ్యం, భక్తి మొదలైన లక్షణాలు విద్యామాయ యొక్క స్వరూపాలు. తత్త్వజ్ఞానం, బ్రహ్మానంద ప్రాప్తి మొదలైనవి విద్యామాయ యొక్క కరుణ వలననే సాధ్య మవుతాయి. నిజానికి విద్యామాయ తోడ్పాటుతోనే మనం భగవంతుడి వైపు పయనిస్తాం. అవిద్యామాయ మనల్ని అజ్ఞానంలోకి త్రోసివేసి, భగవంతుణ్ణి మనకు దూరం చేస్తుంది.

### *121. ప్రశ్న: మహాశయా! పునర్జన్మ గురించి మీ అభిప్రాయం ఏమిటి?*

సమాధానం: ఎంతకాలం మానవుడు అజ్ఞానంలో ఉంటాడో అంతవరకూ మానవుడు జన్మ లెత్తవలసిందే. భగవత్సాక్షాత్కారం కలిగాక, అంటే జ్ఞానం చేకూరిన తర్వాత జన్మ లెత్తవలసిన అవసరం లేదు.

"మృత్యుసమయంలో మనిషి ఏ చింతనతో ప్రాణం విడు స్తాడో, అతడు ఆ భావాన్ని అనుసరించే మళ్ళీ జన్మించవలసి ఉంటుంది," అని భగవద్గీత చెపుతున్నది. జడభరత మహారాజు ఆఖరి క్షణాలలో తన పెంపుడు జింకను తలచి నందువలన అతడు మళ్ళీ జింకగా జన్మించవలసి వచ్చింది.

### *122. ప్రశ్న: అవతారాలను మీరు నమ్ముతారా?*

సమాధానం: మహాత్ములు భగవంతుడి అవతారాల గురించి ప్రస్తావించారు కాబట్టి, వాటిని నేను నమ్మకుండా ఉండలేను. మనకున్న కొద్దిపాటి జ్ఞానంతో భగవంతుణ్ణి ఎలా అర్థం చేసుకోగలం?

### *123. ఆత్మతత్త్వం ఏమిటో తెలిసేది ఎలా? ఆత్మ ఉందని ఋజువేమిటి?*

సమాధానం: ఋజువా? ఆత్మసాక్షాత్కారం సాధ్యమే. తపస్సు చేసి ఋషులు ఆత్మను తెలుసుకున్నారు. కానీ సైన్స్ ద్వారా దాన్ని తెలుసుకోలేము. సైన్స్ ఇచ్చేదంతా ఇంద్రియాల ద్వారా తెలుసుకోగలిగిన సమాచారం మాత్రమే. కానీ అత్యంత సూక్ష్మమైన ఆత్మతత్త్వాన్ని సమాచారం విశదపరచలేదు. మన తెలివితేటలకు అది పట్టుబడదు.

వైద్యునితో సహవాసం చేయగా చేయగా నాడి చూడడం తెలిసినట్లు, సాధు సహవాసం చేయగా, చేయగా ఆత్మతత్త్వం బోధపడుతుంది.

### *124. ప్రశ్న: స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణాలు - ఈ పదాలకు అర్థాలు తెలపండి?*

సమాధానం: మనం ధరించివున్న పాంచభౌతిక శరీరమే స్థూలశరీరం. మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం – ఇవన్నీ సూక్ష్మశరీరం. ప్రకృతి లేదా ఆద్యాశక్తి కారణశరీరం. పరిశుద్ధమైన ఆత్మ లేదా పరబ్రహ్మం మహాకారణం.

### *125. ప్రశ్న: 'థియోసఫీ' గురించి మీ అభిప్రాయం ఏమిటి?*

సమాధానం: ఆ మతంలో అలౌకిక శక్తులు పొందడానికి ప్రయత్నిస్తారని విన్నాను. ఒక భక్తుని ఇంట్లో ఒక సిద్ధుణ్ణి చూశాను. అతడి వశంలో ఉన్న పిశాచం ఎన్నో వస్తువులను తీసుకువచ్చి ఇచ్చింది. ఇలా వశీకరణలు చేయడం వలన, మాయమంత్రాల వలన ప్రయోజనం ఏమిటి? వాటివల్ల

భగవంతుణ్ణి దర్శించగలమా? లేదు కదా! భగవద్దర్శనానికి ఉపయోగపడనివన్నీ వ్యర్థమే.

### *126. ప్రశ్న: దయ్యాలున్నాయా?*

సమాధానం: ఖచ్చితంగా ఉన్నాయి. భక్తుడొకడికి దయ్యాల వలన హాని జరుగబోతుంటే నేను రక్షించాను. గోపాలేర్-మా ఇంట్లో కూడా నేను దయ్యాలను చూశాను.

అయితే మీరు వాటి గురించి ఆలోచించకుండా భగవంతుణ్ణి పొందడానికి ప్రయత్నించండి. ఎందుకంటే నిరంతరం వాటి గురించి ఆలోచిస్తే మీరు కూడా దయ్యాలైపోతారు!

## 11. భక్తిమార్గం

### *127. ప్రశ్న: భక్తి అంటే ఏమిటి?*

సమాధానం: మనస్సుతో, వాక్కుతో, శరీరంతో భగవంతుడి సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడమే భక్తి. కళ్ళతో ఆయనను దర్శించాలనుకోవడం, చెవులతో ఆయన గుణగానాన్ని వినడం, చేతులతో ఆయనను పూజించడం, నోటితో ఆయన స్తోత్రపాఠాలను చదవడం, మనస్సులో ఆయన లీలలనే స్మరించడం, సమస్త ప్రాణులలో ఆయననే చూస్తూ వాటికి హితం చేయడానికి ప్రయత్నించడం – ఇవన్నీ భక్తి లక్షణాలు.

### *128. ప్రశ్న: భగవద్భక్తి ఎలా వృద్ధి చెందుతుంది?*

సమాధానం: మామూలు అద్దం మీద బొమ్మలు ఏర్పడవు కానీ ఛాయాగ్రహణంలో చేసినట్టు రసాయనం పూసిన అద్దం మీద ఏర్పడతాయి. అలాగే మానవహృదయం మీద భక్తి అనే రసాయనాన్ని పూసినప్పుడు భగవంతుడి ప్రతిబింబం ఏర్పడుతుంది.

### *129. ప్రశ్న: భక్తిని పెంపొందించుకోవడం ఎలా?*

సమాధానం: మనలోని భక్తి పెరగడానికి ఏకాంతవాసం ఎంతోగానో దోహదపడుతుంది. తోడు పెట్టిన పాలను

కదపకుండా ఉంచితేనే అవి పెరుగుగా తోడుకుంటాయి. పాలను మాటిమాటికీ కదిపితే అవి తోడుకోవు. అలా పాలవంటి మన మనస్సును కుదుపులవంటి బాహ్యామైన ఆకర్షణల నుంచి దూరం చేసినపుడే భక్తి అనే పెరుగు తయారవుతుంది.

అలాగే నిత్యానిత్య విచారణ కూడా తోడ్పడుతుంది. భగవంతుడొక్కడే సత్యం (నిత్యం). మార్పు చెందని పదార్థం. మిగిలినవన్నీ అసత్యం (అనిత్యం). అంటే మారిపోయేవే! అత్యంత సౌందర్యవంతులైన వారి దేహంలోనైనా సరే ఉండేవి ఎముకలు, రక్తమాంసాలు, మలమూత్రాదులే కదా! అవన్నీ ఏదోవొకరోజు అంతరించేవే. నిత్యం ఈ భావన చేస్తే అది మన మనస్సును ఆకర్షణల నుంచి దూరం చేసి భక్తిని పెంపొందిస్తుంది.

### *130. ప్రశ్న: తీర్థయాత్రలు చేసి తీరాలా?*

సమాధానం: ఎక్కడి మనిషి అక్కడే కూర్చుని భక్తి పొందగలిగితే తీర్థయాత్రలకు వెళ్ళవలసిన అవసరం లేదు కదా! కాశీకి వెళ్ళి చూసినా ఇవే చెట్టుచేమలు, ఆకులలములు! కాబట్టి, తీర్థయాత్రలు చేసినా భక్తి కలగకపోతే యాత్రాఫలం దక్కనట్లే!

కానీ ఒక విషయం! నీరు ఎక్కడ తవ్వినా దొరుకుతుంది కానీ చెరువులలో, బావులలో తవ్వకుండానే లభిస్తుంది. అలాగే పుణ్యక్షేత్రాల సందర్శన ఆధ్యాత్మిక పురోగతికి దోహదపడుతుంది. ఎందరో మహా భక్తులు సందర్శనల వలనా, వారివారి జపతప సాధనల వలనా, తీర్థప్రదేశాలలో

ఆధ్యాత్మిక స్పందనలు ఏర్పడతాయి. అక్కడకు వెళ్ళినపుడు వాటిని అనుభూతి చెందడానికి ప్రయత్నించాలి. అపుడు మనస్సు భగవంతుడి మీద లగ్నమవుతుంది. కానీ సాధారణంగా జనులు పుణ్యం కోసం వెంపర్లాడుతూ తీర్థప్రదేశాలను దర్శిస్తారు కాబట్టి, వారికి ఫలం దక్కదు!

### *131. ప్రశ్న: 'మట్టి ప్రతిమ'ను పూజిస్తే దేవుణ్ణి పూజించినట్లవుతుందా?*

సమాధానం: 'విశ్వవ్యాపి' అయిన భగవంతుడు మట్టి ప్రతిమ రూపంలో మాత్రం ఉండడా? మట్టి ప్రతిమను పూజించడం పొరపాటైతే, ఆ విషయం సర్వాంతర్యామి అయిన భగవంతుడికి తెలియదా? తనను ఏ భావంతో పూజిస్తున్నారన్నదే ఆయనకు ముఖ్యం కానీ, అది మట్టి ప్రతిమా, రాతి విగ్రహమా అన్న విషయం ఆయన పట్టించుకోడు. ఆయనే ఈ మట్టి ప్రతిమలనూ, రాతి విగ్రహాలనూ కూడా సృష్టించాడు. మనసారా చేసే ఏ పూజతోనైనా ఆయన సంతృప్తి చెందుతాడు. అయినా ఈ తలనొప్పి అంతా నీకెందుకు? నీ సంగతి నీవు చూసుకో! నీకు ఏ రీతిన భక్తి కలుగుతుందో, జ్ఞానం ఏ విధంగా అబ్బుతుందో చూసుకో! దాని కోసం ప్రయత్నించు!

### *132. ప్రశ్న: నేను 30 ఏళ్ళుగా దేవుణ్ణి కొలుస్తున్నాను. నా అంతటి భక్తులు లేరనిపిస్తున్నది. ఏమంటారు?*

సమాధానం: భక్తిలో ఎక్కువతక్కువలు ఉండవు. భక్తుడిలో అహంకారం ఉంటే అది తాను భక్తుడినన్న భావనలో లేశమాత్రంగా మిగిలి ఉంటుంది. అటువంటివాడు

సర్వజీవులలోనూ దైవాన్నే చూస్తూ వారందరికీ కూడా సేవ చేయడానికి ప్రయత్నిస్తాడు. కాబట్టి నిజమైన భక్తుడు తనను ఇతరుల కన్నా గొప్పవాడిగా భావించడు. ఒకవేళ నిజమైన భక్తుడెవరైనా త్రోవ తప్పితే భగవంతుడే వారికి మార్గదర్శనం చేస్తాడు. (ఒక కథ చెపుతా విను! 50.అర్జునుడి కథ)

***133. ప్రశ్న: ఆధ్యాత్మిక సాధనలకు మధ్యలో విరామం ఇవ్వవచ్చా?***

సమాధానం: కొంతకాలం భక్తి సాధనలు చేసి, పిమ్మట ఆ విషయమే మరచిపోయి ఇతర వ్యవహారాలలో దిగితే, నీ హృదయంలో నుంచి ఆ భక్తి అంతా హరించుకుపోతుంది. కానీ నీ హృదయాన్ని పవిత్రమైన భక్తి అనే అమృత సాగరంలో నిత్యం ముంచివుంచితే అలా జరుగదు.

***134. ప్రశ్న: నాకు సంస్కృతం రాదు. సంస్కృత శ్లోకాలు పలకడానికి నోరు తిరగదు. మరి నాకు భగవంతుణ్ణి చూడడం సాధ్యపడుతుందా? దేవుణ్ణి ప్రార్థించడానికి సంస్కృత శ్లోకాలే రావాలా?***

సమాధానం: భగవంతుణ్ణి ప్రార్థించడానికి సంస్కృతమే రానవసరం లేదు. పండితులైనా, పామరులైనా ఆయనను తెలుసుకోవడానికి ఆర్తితో ప్రార్థించాలి. అలా చేసేవారందరి పట్ల ఆయన సమానంగా తన ప్రేమానురాగాలను చూపుతాడు. దేవుణ్ణి ఏ భాషలోనైనా వేడుకోవచ్చు.

చంటిబిడ్డడు తండ్రిని వచ్చీరాని భాషలో పిలిచినా తననే పిలుస్తున్నాడని తండ్రి అర్థం చేసుకుంటాడు గదా. భగవంతుడు కూడా ప్రార్థనలోని వ్యాకులతను చూస్తాడు గానీ వ్యాకరణాన్ని చూడడు.

***135. ప్రశ్న: భగవంతుడి భక్తుడైన వాణ్ణి అతడి భార్య, 'నువ్వు నన్ను నిరాదరిస్తున్నావు. నేను ఆత్మహత్య చేసుకుంటాను!' అని బెదిరిస్తే ఏమి చేయాలి?***

సమాధానం: అలాంటి భార్యను పరిత్యజించాలి. ఆత్మహత్య చేసుకోనివ్వు, మరేదైనా చేసుకోనివ్వు! భగవన్మార్గంలో అడ్డంకులు కలిగించే భార్య అవిద్యాస్త్రీ. అయితే, భగవంతుడి పట్ల నిజమైన ప్రేమ కలిగిన వ్యక్తికి ఎటువంటి వారైనా వశంలోకి వస్తారు. భార్యాబిడ్డలు, దేశాన్ని పాలించే రాజు, కరుడుగట్టిన దుష్టులు సైతం అనుకూలురుగా మారతారు.

***136. ప్రశ్న: అధికంగా భగవచ్చింతన చేస్తే బుర్ర పాడవుతుందా?మా స్నేహితుడొకడు ఎల్లప్పుడూ భగవంతుణ్ణి గురించి ఆలోచిస్తూ పిచ్చివాడై పోయాడు. దీని గురించి మీ అభిప్రాయం ఏమిటి?***

సమాధానం: భగవంతుడు చైతన్యస్వరూపుడు. కాబట్టి, ఏ చైతన్యంతోనైతే ఈ విశ్వమంతా చైతన్యం పొందుతుందో, కాళ్ళూ, చేతులూ, శరీరం కదలాడుతున్నాయో, దానిని చింతన చేయడం ద్వారా చైతన్యం కోల్పోవడం జరుగదు. శరీరం కదలుతున్నది లేదా మనస్సు చంచలంగా ఉంది అని లోకులు అంటూ ఉంటారు. నిజానికి భగవంతుడే వాటిని కదిలేటట్లు చేస్తున్నాడు. ఇంద్రియాలు తమంతటతాము పని చేస్తున్నాయని మనం భ్రమపడుతూ ఉంటాము. అంతర్గత చైతన్యమే దీనికంతకూ కారణమని తెలుసుకోము. అందువలన ఆ చైతన్య స్వరూపుని చింతన చేస్తే బుర్రపాడవడం అనే ప్రశ్నే లేదు. విశ్వవ్యాప్తమైన ఆ చైతన్యాన్ని ధ్యానించేవాడు చైతన్యస్వరూపుడే

అవుతాడు. మీ స్నేహితుడు దేవుడి గురించి కాక, ఐహిక చింతన చేసివుంటాడు. అందుకే మతి చెడిపోయి ఉంటుంది.

***137. ప్రశ్న: ఈ కాలంలో చాలామంది "మేం భక్తులం, మేం భక్తులం" అని చాటుకుంటూ ఉంటారు. కానీ వారు చేసేవన్నీ పాపపు పనులే! మరి నిజమైన భక్తులను గుర్తించడం ఎలా?***

సమాధానం: భగవంతుడి పేరు వినగానే శరీరం పులకించి కన్నుల వెంట ఆనందాశ్రువులు రాల్చే భక్తుడే నిజమైన భక్తుడు. ఎవరూ లేని ఏకాంత స్థలంలో కూడా భగవంతుడు తనని గమనిస్తున్నాడని గ్రహించి, పాపకార్యాలకు దూరంగా ఉండేవాడే నిజమైన భక్తుడు. దైనందిన జీవితంలో డబ్బు గురించి, ఇచ్చిన మాట గురించి నిక్కచ్చిగా వ్యవహరించేవాడు, అబద్ధమాడని వాడు నిజమైన భక్తుడు. ప్రవహించే నీరు కొన్ని చోట్ల సుడులు తిరిగినా, వెంటనే వాటిని అధిగమించి ముందుకు సాగిపోతుంది. అలాగే తన హృదయంలో నిరాశ, దుఃఖం, అవిశ్వాసం వంటి సుడులలో చిక్కుకున్నా, కష్టాలలో పడినా, అవి తాత్కాలికమేనని గ్రహించి నిజమైన భక్తుడు ముందుకు సాగుతాడు.

***138. ప్రశ్న: నాకు మా అమ్మ అంటే చాలా ఇష్టం, ప్రేమ. భగవంతుడికి బదులుగా ఆమె రూపాన్ని ధ్యానించవచ్చా?***

సమాధానం: తప్పకుండా చేయవచ్చు. తల్లి – గురువు, బ్రహ్మస్వరూపిణి.

***139. ప్రశ్న: మా ఊళ్ళో గుడిలోని కృష్ణుని విగ్రహం కాలు విరిగిపోయింది. ఆ విగ్రహం తీసి వేరే విగ్రహం ప్రతిష్ఠించాలని అందరూ అంటున్నారు. మీరేమంటారు?***

సమాధానం: అదేంటి? మీ అమ్మాయికి పెళ్ళి చేసిన తరువాత ప్రమాదంలో అనుకోకుండా అల్లుడి కాలు విరిగిపోతే, అతడికి వైద్యం చేయిస్తారా లేకపోతే అల్లుణ్ణే మార్చేస్తారా? ఇదీ అంతే. ఆ విగ్రహానికి మరమ్మత్తు చేసి పూజించవచ్చు. విగ్రహం ఒక రాయి అన్న భావన కాకుండా సజీవమైన దైవం అన్న భావన ఉంటే ఈ అనుమానం రానేరాదు.

***140. ప్రశ్న: మా ఊళ్ళో దసరా ఉత్సవాలు చాలా బాగా జరుగుతాయి. ఉత్సవాల చివర రోజున దుర్గామాత విగ్రహాన్ని నదిలో నిమజ్జనం చేస్తారు. కానీ ఈసారి నిమజ్జనం చేసేటపుడు భక్తుడొకడు వీరావేశంలో ఊగిపోతూ జగజ్జనని ప్రతిమని నిమజ్జనం చేయడానికి తాను అంగీకరించననీ, చేస్తే రక్తపాతం చేయడానికి కూడా వెనుకాడననీ బెదిరించాడు. దుర్గామాత లేకుండా నేను జీవించలేనని అంటున్నాడు. అతణ్ణి సమాధానపరచడం ఎలా?***

సమాధానం: జగజ్జనని లేకుండా జీవించమని అతణ్ణి ఎవరంటారు? ఎవ్వరూ అనరు. ఆమె ప్రతిమను నదిలో నిమజ్జనం చేసినంత మాత్రాన ఆమె ఎక్కడికీ పోదు. తల్లి కుమారుడికి దూరంగా ఉండగలదా? పదిరోజుల పాటు పూజామందిరంలో ప్రతిమ రూపంలో అతడి ఆరాధనను స్వీకరించిన ఆ మాత, మరునాటి నుండి అతని హృదయంలో నిరంతరం ఆసీనురాలై పూజలను స్వీకరిస్తుంది. సందేహం లేదు.

***141. ప్రశ్న: నాకు తెలిసిన ఒక భక్తుడు అతిగా ఆహార నియమాలను పాటిస్తూ, ఉపవాసాలు చేస్తూ, జపధ్యానాదులు చేస్తున్నాడు. అది మంచిదేనా?***

సమాధానం: ఏదీ అతిగా చేయడం మంచిది కాదు. క్రమం తప్పకుండా ఆహారం తీసుకుంటూ, జపధ్యానాలు చేయవచ్చు. మీ ఇష్టదైవం (జగజ్జనని) మీకు అపరిచితురాలు కాదు. ఆమె మీ సొంతం. ముందు భుజించి ఆ తర్వాత ప్రార్థిస్తే ఆమె కోపగించుకోదు. ఈ కలియుగంలో తీవ్ర తపశ్చర్యలకు మానవదేహం తట్టుకోలేదు. అనారోగ్యస్థితిలో ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించడం దాదాపు అసాధ్యం. కాబట్టి శరీర ఆరోగ్యాన్ని జాగ్రత్తగా పరిరక్షించుకోవాలి.

***142. ప్రశ్న: మహాశయా! 'మార్జాల కిశోర న్యాయం, మర్కట కిశోర న్యాయం' అంటుంటారు. అదేమిటో వివరించండి?***

సమాధానం: భక్తులు రెండురకాలుగా ఉంటారు. ఒక రకం వారు పిల్లికూన (మార్జాల కిశోర) స్వభావం కలిగి ఉంటారు. పిల్లికూన పూర్తిగా తన తల్లిమీదనే ఆధారపడి ఉంటుంది. తల్లి ఎక్కడ ఉంచితే అక్కడ ఉంటుంది. పక్క మీద ఉంచినా, నేలమీద ఉంచినా ఇదేమిటని అడగదు. కేవలం 'మ్యావ్ మ్యావ్' అని మాత్రమే అంటూ ఉంటుంది. తల్లి ఇష్టప్రకారమే జరగనివ్వాలనే ఉద్దేశ్యాన్ని కలిగి ఉంటుంది. దాని బాధ్యత అంతా తన తల్లి పిల్లిదే.

మరొక కోవకు చెందిన భక్తులు 'కోతిపిల్ల' (మర్కట కిశోరం) స్వభావం కలిగి ఉంటారు. కోతిపిల్ల తల్లి కోతిని పట్టుకుని ఉంటుంది. తల్లి కోతి చెట్టుకొమ్మల మీదనుంచి

దూకుతూ పోతున్నా సరే, దాన్ని పట్టుకుని ఉండే బాధ్యత పిల్లకోతిదే! కానీ తల్లికోతికి ఎటువంటి బాధ్యత ఉండదు. ఈ కోవకు చెందిన భక్తులకు కొద్దిగా కర్తృత్వభావన ఉంటుంది. రెండు రకాల వారూ దైవభక్తులే కానీ మార్జాలకిశోరన్యాయంతో వ్యవహరించడం మంచిది. గురు, శిష్యుల విషయంలో కూడా ఇది వర్తిస్తుంది.

తండ్రి పిల్లవాడి చేతిని పట్టుకుని నడిపిస్తే పిల్లవాడు పడిపోతాడన్న భయం ఉండదు కానీ పిల్లవాడు తండ్రి చేతిని పట్టుకుంటే పట్టుజారి పడిపోవచ్చు కదా! (ఒక కథ చెపుతా విను! 86.ఇద్దరు పిల్లలు – గాలిపటము)

***143. ప్రశ్న: మాకు తెలిసిన భక్తురాలు ఒకామె తనకు రోజూ ధ్యానంలో దివ్యదర్శనాలు, దేవీదేవతల దర్శనాలు కలుగుతుంటాయని చెబుతుంటుంది. దీనిని బట్టి ఆమె మహా భక్తురాలని అనుకోవచ్చా?***

సమాధానం: కేవలం దివ్యదర్శనాలు కలిగినందువలననే మహాభక్తురాలని అనుకోవలసిన అవసరం లేదు. అటువంటి దర్శనాలు కలిగినా సరే, భక్తులెవరూ తాము పొందిన దర్శనాలను ఇతరులకు వెల్లడించకూడదు. అలా వెల్లడించడం వలన ఆధ్యాత్మిక పురోగతికి ఆటంకం కలగడమే కాక అహంకారం తలెత్తవచ్చు. ఆపైన దర్శనాలు కలగడం ఆగిపోవచ్చు. దర్శనాలతో ఆగిపోక, ముందుకు సాగాలి.

***144. ప్రశ్న: స్వామీ! ఎంత ప్రయత్నించినా భగవంతుడి మీద వ్యాకులత కలగడం లేదు. కారణమేమిటి?***

సమాధానం: ప్రతి దానికీ తగిన సమయం రావాలి. కేవలం

ఆలోచన వస్తేనే ఆకలి పుట్టదు. అదే విధంగా వ్యాకులత రావాలి అని అనుకొన్నంత మాత్రాన భగవంతుడి మీద వ్యాకులత జనించదు. భగవంతుడు తప్ప నాకు మరేమీ వద్దు అన్న భావన కలిగినప్పుడే ఆ వ్యాకులత మనస్సులో జాగృతమవుతుంది. ఐహిక వాంఛలను వదిలి, కామకాంచనాలను పరిత్యజించి, లౌకికసుఖాలకు పూర్తిగా స్వస్తి చెప్పినప్పుడు మాత్రమే భగవంతుడి మీద వ్యాకులత కలుగుతుంది.

బిడ్డ పడుకోబోయే ముందు, "అమ్మా! నేను బయటకు వెళ్ళవలసివచ్చినప్పుడు నన్ను లేపు!" అని తల్లితో అన్నాడట. అందుకు తల్లి నాయనా, "అది వచ్చినపుడు అదే నిద్రలేపుతుందిలే. అందుకోసం ఆదుర్దాపడవద్దు!" అని చెప్పిందట.

### *145. ప్రశ్న: భగవంతుడి మీద నాకు ప్రేమ కలగడం లేదే? ఏమి చేసేది?*

సమాధానం: భగవంతుడి నామం మీద రుచి కలిగించమని ఆయననే వేడుకో. నీ అంతట నీవు దానిమీద అభిరుచిని కలిగించుకోవడానికి ప్రయత్నించు. నీకు నచ్చినా నచ్చకపోయినా, మొదట ఏదోవొక నామాన్ని బలవంతంగానైనా స్మరించు! శివుడో, కృష్ణుడో, రాముడో, ఏదోవొక పేరు. మెల్లమెల్లగా నామం మీద రుచి కలుగుతుంది. భగవద్భక్తి, అనురాగం వృద్ధి అవుతాయి. అన్ని వికారాలు సమసిపోతాయి. భగవంతుడి కృపచేత ఆనందం కూడా కలుగుతుంది. తద్వారా అన్ని పాపాలు నశిస్తాయి.

ఇంద్రియసుఖాల మీద ఉండే మక్కువ పలాయనం అవుతుంది. కలవరపడవద్దు.

***146. ప్రశ్న: భక్తులను భగవంతుడు ఎలా కరుణిస్తాడు?***

సమాధానం: భక్తుడు భగవంతుడి వైపు ఒక అడుగు వేస్తే, భగవంతుడు భక్తుని వైపు పది అడుగులు వేస్తాడు.

***147. ప్రశ్న: మా స్నేహితుడు మంచి భక్తుడు. కాలమంతా భగవద్ధ్యానంలోనే గడుపుతాడు. కానీ ఇంతకు ముందు అతని జీవితమంతా వ్యసనాలతో గడిచింది. మరి అతనికి ఆధ్యాత్మిక పురోగతి ఉంటుందా?***

సమాధానం: గత సంస్కారాలను వదిలించుకోవడం చాలా కష్టం. “వెల్లుల్లిని నలగగొట్టిన పాత్రను వేయిసార్లు తోమినా సరే, ఆ వెల్లుల్లి వాసన పోవడం కష్టం”. ఐతే ఆ వెల్లుల్లి వాసన వస్తున్న పాత్రను పొయ్యి మీద ఉంచి వేడి చేస్తే ఆ వాసన పోతుంది. కొత్త పాత్రలా తయారు అవుతుంది. జ్ఞానాగ్నిలో మనిషి తన చెడు సంస్కారాలను దగ్ధం చేయాలి. అప్పుడు తప్పక ఆధ్యాత్మిక పురోగతి కలుగుతుంది.

***148. ప్రశ్న: (నరేంద్రుడు) ఈశ్వరుడు దయామయుడని పలుకకూడదా?***

సమాధానం: అలా చెప్పకూడదని కాదు నా ఉద్దేశ్యం. భగవంతుడు మన సొంతవాడు, పరాయివాడు కాదు అనే ఎరుక కలిగి ఉండాలనేదే నా అభిమతం.

***149. ప్రశ్న: సత్త్వగుణం, రజోగుణం, తమోగుణాల చేత ప్రభావితులైన భక్తుల విశిష్టతను వివరించండి.***

సమాధానం: భక్తులు తమలో ఏ గుణాలు ప్రబలంగా ఉంటే, వాటిని అనుసరిస్తూ భగవంతుణ్ణి అర్చిస్తారు. తమోగుణం కల భక్తులు శక్తి రూపంలో దేవుణ్ణి అర్చిస్తారు. పశుబలులను ఇస్తూ, మాంసాహారాన్ని నివేదిస్తాడు. రజోగుణం కల భక్తుడు వైభవంగా పూజ చేసి, పంచభక్ష్య పరమాన్నాలను నివేదిస్తాడు. సత్వగుణం గల భక్తుడి పూజలో ఆడంబరమేమీ ఉండదు. అతడు పూజ చేస్తున్నట్లు కూడా ఎవరికీ తెలియదు. పూవులు దొరకకపోతే ఆకులతో లేదా గంగాజలంతో పూజ చేసి బెల్లం ముక్కను నైవేద్యంగా పెడతాడు. ఎప్పుడైనా సాధ్యపడితే పరమాన్నం వండి నివేదిస్తాడు. వీరందరూ కాక మూడు గుణాలకూ అతీతుడైన భక్తుడు కూడా ఉన్నాడు. అలాంటి భక్తుడు చిన్నపిల్లవాడి స్వభావాన్ని కలిగి ఉంటాడు. భగవన్నామ స్మరణే అతడికి పూజ.

### *150. ప్రశ్న: నేను దాసుణ్ణి అనే అహంకారం వల్ల ఏ దోషమూ లేదు కదా?*

సమాధానం: లేదు. నేను ఈశ్వరుడికి దాసుణ్ణి, నేను అతడి భక్తుణ్ణి అనుకోవడంలో ఏ తప్పూ లేదు. ఇలాంటి అహంకారాన్ని ఉంచుకోవడంలో దోషం లేదు. ఇటువంటి భావనవల్ల ఈశ్వరదర్శనం కూడా లభిస్తుంది.

### *151. ప్రశ్న: శుద్ధభక్తి అంటే ఏమిటి?*

సమాధానం: భగవంతుడి సాక్షాత్కారం అయినప్పుడే శుద్ధభక్తి లభిస్తుంది. అది లభించిన భక్తుడు భగవంతుణ్ణి తన ప్రేమతో బంధిస్తాడు. ఆవుదూడకు దాని తల్లి ఆవు

కనపడకపోతే అంబా అని అరుస్తుంది. వెంటనే తల్లి ఆవు పరిగెత్తుకొస్తుంది. అలాగే భక్తుడు పిలిచిన వెంటనే భగవంతుడు వస్తాడు. ఇదే శుద్ధ భక్తి.

***152. ప్రశ్న: భక్తియోగం ప్రత్యేకతను తెలపండి.***

సమాధానం: జ్ఞాన యోగి ఒక పురుషుడిలా రాజదర్బారు వరకే పోగలుగుతాడు. కానీ అతణ్ణి అంతఃపురంలోనికి ప్రవేశించనీయరు. కానీ భక్తి మార్గంలో ఉన్నవాడు స్త్రీలా అంతఃపురంలోనికి కూడా వెళ్ళగలుగుతాడు.

***153. ప్రశ్న: భక్తులలో ఎన్ని తరగతులవారు ఉన్నారు?***

సమాధానం: "భగవంతుడు ఆకాశంలో ఎంతో దూరంలో ఉన్నాడు" అని అధమ భక్తుడు పలుకుతాడు. "భగవంతుడు అన్ని జీవులలో చైతన్యస్వరూపుడు గానూ, ప్రాణస్వరూపుడు గాను ఉన్నాడు" అని మధ్యమ భక్తుడు పలుకుతాడు. ఉత్తమ భక్తుడు, "భగవంతుడు సకల చరాచరసృష్టి అంతా నిండి ఉన్నాడు, అన్ని నామరూపాలూ అతడివే. అతడు తప్ప వేరే ఏమీ లేదు" అని పలుకుతాడు.

***154. ప్రశ్న: ఈ కాలంలో ఎంతోమంది భక్తులు కనపడుతున్నారు. వారిలో దొంగ భక్తులు కూడా ఉంటున్నారు. దీన్ని గురించి మీ అభిప్రాయం?***

సమాధానం: భగవంతుడి సృష్టిలో అన్ని రకాల మనుష్యులూ కనిపిస్తారు. అలాగే భక్తులుగా చలామణీ అయ్యే మోసగాళ్ళు కూడా కనిపిస్తారు. వారిచేత మోసపోకుండా మనం జాగ్రత్తగా వ్యవహరించాలి. (ఒక కథ చెపుతా విను! 118. కేశవా! గోపాలా!)

***155. ప్రశ్న: అయ్యా! మీరు బ్రాహ్మణులు కదా! మరి జందెం ఎందుకు తీసివేశారు?***

సమాధానం: భగవదున్మాదసమయంలో నా స్థితే మారిపోయింది. పెద్ద గాలివానకు కొట్టుకు పోయినట్లు నా పాతచిహ్నాలన్నీ ఎగిరిపోయాయి. బాహ్య ప్రపంచ స్పృహే నాకు లేదు. నేను ధరించిన వస్త్రమే నా ఒంటిమీద నిలబడనప్పుడు, జందెం మాట ఏం చెప్పేది? నాకు పట్టిన వెర్రి నీకు కూడా పట్టినపుడు ఆ స్థితి ఏమిటో అర్థమవుతుంది.

## 12. భగవంతుడు ఎందుకు కనపడడు?

### *156. ప్రశ్న: నిజంగా భగవంతుడున్నాడా? మనం ఆయనను దర్శించగలమా?*

సమాధానం: ఖచ్చితంగా ఉన్నాడు. ఆయనను తప్పక దర్శించవచ్చు. తనకు ఆయన అత్యంత సమీపంలో ఉన్నాడని ఏ భక్తుడు భావిస్తాడో అతడికి భగవంతుడు దర్శనమిస్తాడు. ఒకసారి ఆయనను ప్రార్థించగానే నీకెలాంటి స్పందన రాకపోయినంత మాత్రాన ఆయనే లేడని నిర్ణయించకూడదు.

### *157. ప్రశ్న: భగవంతుడికి చెవులున్నాయా? ఆయనను ఎంతో ప్రార్థించాను. కాని ఎలాంటి జవాబు రాలేదు. నిజంగా ఆయన నా ప్రార్థనలు ఆలకించాడా?*

సమాధానం: చీమలు నడుస్తుంటే వచ్చే శబ్దాన్ని కూడా భగవంతుడు వినగలుగుతాడు. అటువంటి వాడు నీ ప్రార్థనలను వినలేడా? కొంచెం ఆలోచిస్తే నీ ప్రార్థనలను ఆయన ఎందుకు వినలేదో తెలుస్తుంది. కాలువగట్టుకు పీతలు చేసిన కన్నాల లాంటివి కోర్కెలు. కాలువ నీరు పంటచేనుకు పారకుండా ఆ కన్నాలలోనుంచి కారిపోయినట్టు, నీవు జపధ్యానాలను అనుష్ఠించినా వాటి ఫలం నీ కోర్కెలనే కన్నాల గుండా కారిపోతోంది. కాబట్టి, నీ మనస్సులో కోర్కెలు

పూర్తిగా అంతరించేదాకా నీ ప్రార్థనలు భగవంతుడికి చేరవు. నూరుమార్లు బల్లగుద్ది చెపుతాను. నీ ప్రార్థనలను ఆయన తప్పక వింటాడు. అయితే నీ ప్రార్థన చిత్తశుద్ధితో ఉండాలి. లౌకికులు తమ భార్యాబిడ్డల కోసం విలపించేటట్లు భగవంతుడి కోసం విలపిస్తారా?

### *158. ప్రశ్న: భగవంతుడు మన కోరికలన్నీ తీరుస్తాడా?*

సమాధానం: తీరుస్తాడు! ఆయన కల్పతరువు. ఆ కల్పవృక్షాన్ని ఆశ్రయించి ఏది కోరితే అది లభిస్తుంది. ఎవరెవరు ఎటువంటి కోరికలతో సాధనలు చేస్తారో, వారివారి కోరికలు ఆయా విధాలుగా నెరవేరుతాయి. భావం ఎలా ఉంటుందో, ఫలం కూడా అలాగే ఉంటుంది. భోగభాగ్యాలు కావాలని కోరితే వాటి వెనుక ఒక పెద్దపులి ఉంటుందని గుర్తుపెట్టుకో. భగవంతుణ్ణి హృదయపూర్వకంగా ప్రార్థిస్తే ఆయన నీకు సాక్షాత్కరిస్తాడు. (ఒక కథ చెపుతా విను! 1. బాటసారి–కల్పవృక్షం)

### *159. ఈ కాలంలో మూడు యోగాల గురించి ముఖ్యంగా చెపుతున్నారు. అవి జ్ఞాన, కర్మ, భక్తి యోగాలు. ఏ యోగం అనుసరించాలో తెలియక చాలా గందరగోళంగా ఉంది. మీ సలహా ఏమిటి? మేము ఏ యోగం అనుసరిస్తే సులభంగా భగవంతుణ్ణి చేరగలం?*

సమాధానం: ఏ యోగమార్గం ద్వారా వెళ్ళినా ఫర్వాలేదు. మనస్ఫూర్తిగా ఆ మార్గాన్ని అనుసరిస్తే భగవంతుణ్ణి పొందవచ్చు.

జ్ఞానయోగం – ఇది విచారణ మార్గం. ఇది కాదు, ఇది

కాదు అంటూ బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య అంటూ విచారణ చేస్తాడు. సదసద్విచారణ చేస్తాడు. విచారణ ఎక్కడైతే ఆగిపోతుందో అక్కడ సమాధి స్థితి ఏర్పడుతుంది, బ్రహ్మజ్ఞానం లభిస్తుంది.

కర్మయోగం – కర్మల ద్వారా మనస్సుని భగవంతుడి మీద లగ్నం చేయడం అంటే అనాసక్తతతో కర్మలు చేయడమే కర్మయోగం. గృహస్థులు నిర్లిప్తతతో ఫలాన్ని భగవంతుడికి సమర్పించి ఆయనపట్ల భక్తితో తమ విద్యుక్త ధర్మాలను నిర్వర్తిస్తే అది కూడా కర్మయోగమే అవుతుంది. భగవంతుడికి ఫలితాన్ని సమర్పించి పూజ, జపం మొదలైన కర్మలు అనుష్ఠించడం కూడా కర్మయోగమే. కర్మయోగం ద్వారా భగవంతుణ్ణి పొందవచ్చు.

భక్తియోగం – భగవంతుడి నామగుణ కీర్తనలు చేస్తూ ఆయన మీద మనస్సును లగ్నం చేయడమే ఈ యోగం యొక్క ధ్యేయం. కలియుగానికి భక్తియోగమే సులభమైన మార్గం. అదే ఈ యుగ ధర్మం. మిగిలిన మార్గాలకంటే దీని ద్వారా సులభంగా భగవంతుణ్ణి చేరుకోవచ్చు. బ్రహ్మజ్ఞానాన్ని కోరే వ్యక్తి భక్తిమార్గాన్ని అవలంబించినా అదే జ్ఞానాన్ని పొందుతాడు. భక్తవత్సలుడైన భగవంతుడు తలచుకుంటే బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

***160. ప్రశ్న: భక్తి యోగంతో సర్వం సిద్ధిస్తుందా?***

సమాధానం: నిస్సందేహంగా! నేను వ్యాకులచిత్తంతో దివ్యజననితో ఇలా మొరపెట్టుకున్నాను, “అమ్మా! యోగులు యోగసాధన ద్వారా పొందే అనుభూతులను, జ్ఞానులు

తత్త్వవిచారణలో పొందే జ్ఞానాన్ని నాకు ప్రసాదించు!” అలా అమ్మయే నాకంతా తెలిసేలా చేసింది.

### *161. ప్రశ్న: ఎన్నో సంవత్సరాలుగా ఎంతో జపం చేశాం. తీర్థయాత్రలు చేస్తున్నాం. ఐనప్పటికీ పురోగతి కనిపించడం లేదు. ఎందువలన?*

సమాధానం: మనస్సులో వ్యాకులత లేకపోతే కాశీకి వెళ్ళినా ఏమి ప్రయోజనం? మనోవ్యాకులత కలిగినపుడు నీవు ఎక్కడ ఉంటే ఆ చోటే కాశీ అవుతుంది. వ్యాకులతతో పిలిస్తే భగవంతుడు దర్శనం ఇస్తాడు. గోపీజనం వ్యాకులతతో పిలిచిన ప్రతిసారీ ఆయనను చూడగలిగారు.

ఉదాహరణకు నాటకం ప్రారంభంలో గుసగుసగా మాటలు వినిపిస్తాయి. కృష్ణుడు కనిపించడు. కానీ నారదుడు వచ్చి కృష్ణా, గోవిందా అని వ్యాకులతతో కీర్తిస్తాడు. తన భక్తుడి ప్రార్థన విన్నప్పుడు కృష్ణుడు వేదిక మీదికి రాకుండా ఉండలేడు.

### *162. ప్రశ్న: స్వామీ! ఈశ్వరుణ్ణి ఎంత ప్రార్థించినప్పటికీ ఆయనను పొందలేకపోవడానికి కారణమేమిటి?*

సమాధానం: వ్యాకులతకు వివేకవైరాగ్యాలను జోడించాలి. అప్పుడు తక్కిన విషయాల మీది ఆకర్షణలు సమసిపోయి మనస్సు ఆయన మీదే నిలుస్తుంది. అటువంటి మనస్సుతో ఈశ్వరుణ్ణి పొందాలనే ఆరాటంతో విలపించాలి. నీవు జ్ఞానమార్గంలో ఉన్నా, భక్తిమార్గంలో ఉన్నా ఆయన పట్ల ఉన్మాదం లేనిదే ఆయన దర్శనం కాదు. ఇది ఒక్క రోజులో వచ్చేది కాదు. రేయింబవళ్ళూ ఆ ఆరాటంలో మునిగిపోవాలి.

భగవంతుడి వైపు వెళ్ళకుండా మనకు అడ్డుపడేది మాయ! ఆ మాయ ఎంత బలమైనదంటే భగవంతుడే జీవునిగా అవతరించినా ఆ మాయా ప్రభావంలో పడి మైమరిచిపోతాడు. మానవాకారం దాల్చిన రాముడు "సీతా! సీతా!" అని ఎలుగెత్తి ఏడ్చాడు! ఇలాగే అనేక ఉదాహరణలు చెప్పవచ్చు. కానీ మనం ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. భగవంతుడు తలచుకుంటే చాలు, జీవుడు ముక్తుడౌతాడు. సిగ్గు, ద్వేషం, ఉన్నతకులంలో పుట్టానన్న గర్వం, సంకోచం, దాచిపెట్టే స్వభావం, ఇత్యాదులన్నీ భగవంతుడి మార్గంలో ప్రతిబంధకాలే.

***163. ప్రశ్న: (ఒక భక్తుడు ఇలా అడిగాడు) భగవంతుణ్ణి సొంతమనిషిగా భావించి ప్రార్థించినా నేనెందుకు ఆయనను చూడలేకపోతున్నాను?***

శ్రీరామకృష్ణులు: (చిన్నగా నవ్వి ఇలా అన్నారు): నీ సొంత బిడ్డను ఎలా ప్రేమిస్తావో అలాగే ఆయనను ప్రేమించి, ఆయన కోసం పరితపిస్తున్నావా?

భక్తుడు: లేదండి! నేనెప్పుడూ ఆయన కోసం అంతగా పరితపించలేదు!

శ్రీరామకృష్ణులు: నీకు ఆయనొక్కడే అత్యంత ప్రీతిపాత్రుడన్న భావనతో ప్రార్థన చేయి. నిజం చెపుతున్నాను! భక్తులంటే ఆయనకు అత్యంత అనురాగం. వారికి దర్శనం ఇవ్వకుండా ఆయన ఉండలేడు. తనను కోరుకోక ముందే భక్తుల వద్దకు వచ్చేస్తాడు. ఒక వ్యక్తి భగవంతుడి వైపుకు ఒక అడుగు వేస్తే ఆయన పది అడుగులు వేస్తాడు. భగవంతుడి కన్నా సన్నిహితంగా, ఆప్యాయంగా మరెవ్వరూ ఉండలేరు.

***163. ప్రశ్న: మాకు తెలిసిన కొంతమంది యువకులున్నారు. చూడటానికి మామూలుగా కనిపిస్తారు, కానీ వారెంతో భక్తి ప్రపత్తులతో, జ్ఞానం కలవారై ఉంటున్నారు. అంత చిన్నతనంలోనే వారికి అటువంటి జ్ఞానం ఎలా కలిగింది?***

సమాధానం: కజ్జికాయల్ని రెండు రకాలుగా చేయవచ్చు. ఒక రకంలో శనగపిండి నింపుతారు, మరొక రకంలో పాలకోవా నింపుతారు. లోపలి పదార్థం ఏదైనా, పైకి చూడడానికి మాత్రం కజ్జికాయలు ఒకే రకంగా ఉంటాయి. అదే విధంగా మనుష్యులలో కూడా రకరకాల వారు ఉంటారు. మనుష్యులలో ఉండే ప్రేమభక్తి, భగవద్దర్శనకాంక్షలను కజ్జికాయలలోని పాలకోవాతో పోల్చవచ్చు. చూడడానికి మామూలు మనుష్యులులాగా కనిపించినా వారు మాత్రం అంతరంగంలో తీవ్రమైన భక్తి కలవారుగా ఉంటారు.

చిన్నతనంలోనే వారికి ఆ జ్ఞానం కలగడానికి ముఖ్యకారణం వారి పూర్వజన్మ సంస్కారమే. గత జన్మలలో వారు అనేక సాధనలు చేసి ఉంటారు. బాల్యం, వృద్ధాప్యం ఇత్యాదులన్నీ దేహానికేగానీ ఆత్మకు కాదు. ఈ కుర్రవాళ్ళు ఎలాంటి వారంటే పిందె వేసిన తరువాత పువ్వు పూసే గుమ్మడితీగలలాంటి వాళ్ళు. వీరికి ముందుగానే భగవ ద్దర్శనం కలుగుతుంది. తరువాత ఆయన మహిమలనూ, గుణాలనూ శ్రవణం చేస్తారు. చివరకు భగవంతుడిలో ఐక్యం చెందుతారు. వీరినే 'నిత్య సిద్ధులు' అంటారు.

## 13. భగవంతుడి లక్షణాలు

***165. ప్రశ్న: భగవంతుడున్నాడా? ఉంటే ఆయన దర్శనం ఎలా లభిస్తుంది?***

సమాధానం: ఉన్నాడు! పగటివేళ ఆకాశంలో నక్షత్రాలు కనిపించనంత మాత్రాన నక్షత్రాలే లేవని అనకూడదు కదా! పాలలో వెన్న ఉంది. కానీ పైనుంచి చూస్తేనే అది అర్థమవుతుందా? పాలను తోడుపెట్టాలి. ఆ తర్వాత చిలకాలి. అప్పుడే వెన్న లభిస్తుంది. చెరువులో చేపలుపట్టే ముందు చేపలుపట్టే కళను నిపుణుల నుంచి నేర్చుకోవాలి. ఆ తర్వాత ఎంతో ఓపికగా ఎరను, బెండును అమర్చిన గాలం వేసి కూర్చోవాలి. కొంతసేపటికి చేప ఎరను పట్టుకుంటుంది. బెండు కదలగానే చేపను ఒడ్డు మీదికి లాగివేయాలి. అదే విధంగా కేవలం కోరినంత మాత్రాన భగవంతుడి సాక్షాత్కారం లభించదు. సాధువుల బోధనల మీద నమ్మకం ఉంచాలి. వాటిద్వారా చిట్టచివరికి భగవత్సాక్షాత్కారంతో ధన్యుడవవుతావు.

***166. ప్రశ్న: సర్వత్రా వ్యాపించి ఉన్న భగవంతుణ్ణి కేవలం దేవాలయాలలోనే దర్శించడం ఎందుకు?***

సమాధానం (భూతేశానందజీ): సర్వత్ర వ్యాపించివున్న భగవంతుణ్ణి సర్వత్రా దర్శించగలిగినంత భక్తి, శ్రద్ధ, విశ్వాసం, శక్తీ నీకున్నాయా? ఆవు శరీరాన్నంతటినీ తాకినా, లేదా కొమ్ములను పిండినా పాలు రావు. పొదుగును పిండితేనే పాలు

లభిస్తాయి. అలాగే భగవంతుడు సర్వత్రా వ్యాపించివున్నా, ఆయన ఉన్నాడన్న భావనను మనలో జాగృతం చేయడానికి దేవాలయాలు అవసరమవుతాయి. భగవంతుణ్ణి సర్వకాల సర్వావస్థలలో దైవస్మరణ చేయగలిగిన స్థితికి చేరుకున్ననాడు, మనం ఇంట్లో ఉన్నా, దేవాలయానికి వెళ్ళినా ఒక్కటే. అలాంటి స్థితి కలగనంతవరకూ పుణ్యక్షేత్రాల సందర్శనం ఆధ్యాత్మిక ప్రగతికి ఎంతో అవసరం.

***167. ప్రశ్న: మానవులందరిలో భగవంతుడున్నాడని అంటారు. అలా అయితే వారు అన్ని దుఃఖాలలో ఉండడానికి కారణం ఏమిటి?***

సమాధానం: మానవులందరిలో ఈశ్వరుడు ఉన్నాడు. కానీ ఆ విషయాన్ని గుర్తించగలిగింది బహు కొద్దిమంది. అలా గుర్తించగలిగినవారే ఈశ్వరుడిలో ఉన్నట్టు! వారు ఈశ్వరుడిలో లేకపోవడంవలనే దుఃఖాలలో మునిగితేలుతూ ఉంటారు.

***168. ప్రశ్న: భగవంతుడు సర్వవ్యాపి అంటారు కదా? మరి అంతటా ఆయనను ఎందుకు చూడలేకపోతున్నాము?***

సమాధానం: కొలను గట్టునుంచి చూస్తే, కొలనంతా దట్టంగా పాచిపట్టి ఉండడం చూస్తాము. నీరు ఎక్కడా కనిపించదు. నీటిని చూడాలంటే, పైనున్న పాచిని తొలగించాలి. అలాగే మాయ అనే తెర ఈశ్వరుణ్ణి చూడకుండా మనల్ని అడ్డుకుంటోంది. ఆ తెరను తొలగిస్తే ఆయనను చూడవచ్చు.

***169. ప్రశ్న: మీరెప్పుడూ దివ్యావేశంలో ఉంటారు కదా! మరి గిరీశ్ వేసే నాటకాలకు ఎందుకు వెడుతున్నారు?***

సమాధానం: ఆ నాటకాలలో పాట, తాళం, శ్రుతి – అన్నీ చక్కగా అమిరాయి. దానికి తోడు నారాయణుడే నటుల రూపంలో వేషం ధరించి నటిస్తున్నట్లు, అమ్మ నాకు చూపింది. నటులందరూ కలసి ఒకే స్వరంలో పాడుతూ ఉంటే నాకు మహదానందం కలుగుతుంది.

***170. ప్రశ్న: (ఈశ్వరచంద్ర విద్యాసాగర్) భగవంతుడు కొందరికి ఎక్కువ శక్తి, కొందరికి తక్కువ శక్తి ప్రసాదించాడా?***

సమాధానం: ఔను. భగవంతుడు తన యొక్క అంశల రూపంలో సర్వత్రా నిండి ఉన్నాడు. అయినా ఆ శక్తి యొక్క వ్యక్తీకరణలో తారతమ్యాలున్నాయి. లేకపోతే మిమ్మల్ని చూడడానికి మేము ఎందుకు రావాలి? మీకేమైనా రెండు కొమ్ములు మొలిచాయా? మీకు పాండిత్యం, దానగుణం రెండూ ఉన్నాయి. అందుకే మిమ్మల్ని చూడడానికి వచ్చాము. మనుష్యులకు వారివారి పుణ్యకర్మలను బట్టి శక్తిసామర్థ్యాలు ఏర్పడతాయి. అందువల్లనే ఒకడే మనిషి యాభై మందిని కూడా గెలవగలుగుతున్నాడు.

***171. ప్రశ్న: గ్రంథాలు చదివిన పండితులు ఈశ్వరుణ్ణి గురించి అతిగా వర్ణిస్తుంటారు. అదంతా నిజమేనా?***

సమాధానం: గ్రంథాలు చదివి, ఈశ్వరుణ్ణి వర్ణించడం ఎలాంటిదంటే – అట్లాసు (ప్రపంచ పటం)లో కాశీనగరాన్ని చూపిస్తూ, ఆ క్షేత్రం గురించి వివరించడం వంటిది. ఆ విధంగా ఎంత వర్ణించినా, కాశీపట్నం యొక్క గొప్పదనాన్ని

శ్రోతలు గ్రహించలేరు కదా! భగవంతుడు అవాఙ్మానసగోచరుడు. అంటే వాక్కుకి, మనస్సుకి అతీతుడు. ఆయనను ఎవరికి వారే అనుభూతి చెందాలి కానీ, వేరొకరు వర్ణించలేరు.

***172. ప్రశ్న: మా గ్రామంలోని రాధాకృష్ణ మందిరంలోని కృష్ణ విగ్రహం మీది ఆభరణాలను దొంగలు దోచుకెళ్ళారు. మరి సర్వశక్తిమంతుడైన ఆ భగవంతుడు కనీసం తన ఆభరణాలను కూడా కాపాడుకోలేడా?***

సమాధానం: ఇవన్నీ మతిలేని మాటలు. సాక్షాత్తు మహాలక్ష్మియే తన పరిచారికగా కల ఆ భగవంతుడికి సంపదలకు కొదవేమి ఉంటుంది? ఆభరణాలు మీకు విలువైనవి కావచ్చు, కానీ ఆయనకు అవి మట్టిముద్దలతో సమానం. ఆయన వైభవం పెంచడానికి అసలు ఆభరణాలు పనికివస్తాయా? కాబట్టి ఏ సమయంలో ఏది జరగాలో అది ఆయన నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. ఆయన శక్తిని సందేహించడం మూర్ఖత్వం.

***173. ప్రశ్న: భగవంతుడికి పక్షపాత బుద్ధి ఉందా? లేకపోతే, కొందరికి సకల సంపదలూ ఇచ్చి, మరికొందరిని పేదవారిగా ఎందుకు ఉంచాడు?***

సమాధానం: భగవంతుడికి ఎటువంటి పక్షపాతం లేదు. కొంతమందిలో ఆయన శక్తి యొక్క వ్యక్తీకరణ అధికంగా ఉంటుంది. మరికొంతమందిలో అది తక్కువగా ఉంటుంది.

సూర్యకిరణాలు నేల మీద ఒకరకంగా, చెట్టు మీద ఇంకొకరకంగా, అద్దంలో పూర్తిగా వేరే విధంగా

ప్రతిబింబిస్తాయి. అద్దంలో ప్రతిబింబం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ కారణం వలనే 'అధికార భేదం' అనే వాదం వచ్చింది. ఆధ్యాత్మిక అనుభూతికి అందరూ ఒకే అర్హత కలిగివుండరు. కొందరిలో ఆధ్యాత్మికత త్వరగా జాగృతం అయితే మరికొందరికి చాలాకాలం పడుతుంది.

***174. ప్రశ్న: లౌకికుడు, భక్తుడు, బ్రహ్మజ్ఞాని - ఎలా ఉంటారో మాకు సులభంగా అర్థమయ్యేటట్లు చెప్పండి?***

సమాధానం: ఉప్పు బొమ్మ నీటిలో కరిగిపోతుంది. తన ఆకృతిని పూర్తిగా కోల్పోతుంది. ఇదే విధంగా బ్రహ్మజ్ఞాని ఆత్మ పరమాత్మలో లీనమయివుంటుంది. గుడ్డతో చేసిన బొమ్మ చాలా నీటిని లోనికి పీల్చుకుంటుంది. కానీ ఆకృతిని పోగొట్టుకోదు. భగవంతుణ్ణే తన ఊపిరిగా భావించే భక్తుడు ఇలా ఉంటాడు. రాతిబొమ్మ నీటిని తనలోకి చొరనివ్వదు. ఎంతకాలం నీటిలో ఉన్నా దానిలో ఏ మార్పు కలుగదు. హృదయంలో తత్త్వజ్ఞానానికి అణుమాత్రమైన అవకాశం ఇవ్వని శుద్ధలౌకికుడి పరిస్థితి ఇలా ఉంటుంది.

***175. ప్రశ్న: మహాశయా! జ్ఞానం ద్వారా భగవంతుడి గుణాలు తెలుసుకోవచ్చునా?***

సమాధానం: పాండిత్యం ద్వారా, శాస్త్రజ్ఞానం ద్వారా భగవంతుడి లక్షణాలను తెలుసుకోలేము. అవి తెలుసుకోవాలంటే సాధన చేయాలి. మన స్వభావానికి తగినట్టుగా శాంతభావం, దాస్యభావం, వాత్సల్యభావం లాంటి ఏదోవొక భావాన్ని ఆశ్రయించి సాధన చేయాలి.

***176. ప్రశ్న: నా మిత్రుడొకడు తీవ్రమైన వ్యాధితో బాధపడుతూ, భగవంతుడు కూడా దాన్ని నయం చేయలేడనీ, వ్యాధితో బాధపడవలసిందిగా ఆయనే ఆదేశించాడు గనక అది తప్పదనీ, ఆయన ఏర్పరచిన నియమాలను తానైనా ఉల్లంఘించలేడనీ అంటున్నాడు. మీరేమంటారు?***

సమాధానం: మథుర్‌నాథ్ కూడా ఇలానే అన్నాడు. కానీ భగవంతుడు తలచుకుంటే తాను ఇచ్చిన శాసనాన్నీ, నియమాలనీ రద్దు చేయగలడు లేదా అందుకు బదులుగా మరొక శాసనాన్ని అమలు పరచగలడు. మందార మొక్కకి గల ఒకే కొమ్మకు ఎఱ్రపూవు, తెల్లపూవు కూడా పూచి ఉండడం మథుర్‌నాథ్ చూసి, భగవంతుడు ఏమైనా చేయగలడని విశ్వసించాడు. కాబట్టి మీ మిత్రుడి విషయంలో అదే నిజం. భగవంతుడికి అంతా సాధ్యమే. మానవరూపం దాల్చినపుడు భగవంతుడు కూడా తన భువనమోహన మాయలో మైమరచి ఉన్నట్లు నటిస్తాడు. సీత కోసం విలపిస్తూ రాముడు అడవి అంతా గాలించాడు. కాని మనం ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. భగవంతుడు సంకల్పమాత్రం చేత మనిషికి ముక్తి కలిగించగలడు. ఆయనకి అసాధ్యమైనదేదీ లేదు.

## 14. భగవత్సాక్షాత్కారం

***177. ప్రశ్న: మహాశయా! నేను మహా అజ్ఞానిని, గుడ్డివాణ్ణి, నాకేమీ తెలియదు. నేనెలా తరిస్తాను?***

సమాధానం: ఎప్పుడూ అలా అనుకోకు. నువు అజ్ఞానివే అయినా, గుడ్డివాడివే అయినా నిన్ను చూడడానికి భగవంతుడి కళ్ళు ఉన్నాయి. ఆయన కరుణారసదృష్టి నీ మీద పడితే నీ అజ్ఞానం అంతా పటాపంచలు అయిపోతుంది. భగవంతుడి మీద ప్రేమను పెంచుకో.

***178. ప్రశ్న: భగవంతుణ్ణి దర్శించగలమా?***

సమాధానం: ఖచ్చితంగా దర్శించవచ్చు. కానీ దాని కోసం 1. అప్పుడప్పుడు ఏకాంతవాసం, 2. భగవంతుడి నామ సంకీర్తన, 3. నిత్యానిత్య వస్తువిచారణ చేయాలి. వీటినన్నింటినీ మించి భగవంతుణ్ణి వ్యాకులతతో ప్రార్థిస్తే ఆయనను దర్శించవచ్చు. జనులు ఆలుబిడ్డల కోసం కడవల కొద్దీ కన్నీరు కారుస్తారు. ధనం కోసం వెంపర్లాడతారు. కానీ భగవంతుణ్ణి పొరపాటున కూడా తలుచుకోరు.

అరుణోదయం లాంటిది వ్యాకులత. అది కనిపించినపుడు మనలో నిజమైన భక్తి పెరుగుతున్నదని అర్థం. అరుణోదయం తర్వాత సూర్యదర్శనమైనట్టు, వ్యాకులత కలిగిన తర్వాత దైవదర్శనమౌతుంది.

సగటు మనిషికి ఉండే మూడు రకాలైన ఆకర్షణలు కలిస్తే ఎంత ఆకర్షణ అవుతుందో అంత వ్యాకులత ఆయన మీద కలిగితే దర్శనం అవుతుంది. అవి, 1. విషయలోలుడికి ప్రాపంచిక విషయాల మీద ఉండే ఆకర్షణ, 2. తల్లికి

సంతానం మీద ఉండే ఆకర్షణ, 3. పతివ్రతకు భర్త మీద ఉండే ఆకర్షణ.

**_179. ప్రశ్న: ఈ జీవితకాలంలో భగవత్సాక్షాత్కారం లభించడం సాధ్యమా?_**

సమాధానం: నీవు ఏది ఆకాంక్షిస్తే అది లభిస్తుంది. నమ్మకమే విజయానికి కీలకం.

**_180. ప్రశ్న: మహాశయా! మేము ఇలా ఎందుకు బంధింపబడి ఉన్నాం? ఎందుకు ఈశ్వరుణ్ణి చూడలేకుండా ఉన్నాం?_**

సమాధానం: మాయవలననే మనుష్యులు బంధించబడి ఉన్నారు. జీవుల అహంకారమే మాయ. ఈ అహంకారమే అన్ని అనర్థాలకూ మూలం. తాను కర్త కాదు, భగవంతుడే అన్నింటికీ కర్త అనే జ్ఞానం కలగాలి. అందుకోసం సాధన చేయాలి. ఆ సాధనకు భగవంతుడి కృప తోడైనప్పుడు జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం వల్ల ముక్తి కలుగుతుంది.

**_181. ప్రశ్న: మానవ జన్మ పొందిన మాకు అసలు ముక్తి అనేది లభిస్తుందా, లేదా అని నిరాశానిస్పృహలు కలుగుతుంటాయి. మీ సలహా ఏమిటి?_**

సమాధానం: కాశీలో అన్నపూర్ణ దేవాలయంలోకి ప్రవేశించిన వారు ప్రసాదం తీసుకోకుండా బయటకు రాలేరు. కొందరికి వెంటనే ప్రసాదం లభిస్తుంది. కొందరికి ఆలస్యంగా లభిస్తుంది. ఇంకొందరికి బాగా ప్రొద్దుపోతుంది. కానీ ప్రసాదం దొరకని వారంటూ ఉండరు. అందరికీ దొరుకుతుంది. అలాగే, జన్మనెత్తిన వారందరికీ ముక్తి

లభిస్తుంది. కొందరు ఈ జన్మలోనే ముక్తిని పొందుతారు. ఇంకొందరు రెండుమూడు జన్మల తర్వాత ముక్తిని పొందుతారు. మరి కొందరు లెక్కలేనన్ని జన్మలు ఎత్తవలసి వస్తుంది, కనుక ముందు వెనుకే గానీ అందరికీ ముక్తి లభిస్తుంది. అయితే, ఆవగింజంత కోరిక మిగిలి ఉన్నా, ఈశ్వర దర్శనం సాధ్యం కాదు, కనుక ఆధ్యాత్మికపరమైన కోరికల్ని మాత్రమే నీలో ఉంచుకోవాలి. నీలో దాగివున్న ప్రాపంచికమైన, అక్రమమైన, విషయసంబంధమైన కోరికలను వివేకం చేత, విచారణ చేత పోగొట్టుకోవాలి.

***182. ప్రశ్న: మా గ్రామంలో ఒక వ్యక్తికి భగవద్దర్శనం అయిందని చెప్పకుంటారు. చాలామంది తమకే భగవద్దర్శనం అయిందని చెప్పకుంటున్నారు. అటువంటి వారిని గుర్తించడం ఎలా?***

సమాధానం: (భగవంతుణ్ణి దర్శించిన వారికి కొమ్ములు మొలవవు అని ఒకసారి శ్రీశారదాదేవి అన్నారు.) భగవద్దర్శనం అయిన వారిని గుర్తించడం అంత సులభం కాదని మనం గ్రహించాలి. మనలో ఉన్న ఆధ్యాత్మికత ఒక స్థాయిని దాటినపుడే మనం అటువంటివారిని గుర్తించగలం.

భాగవతంలో అటువంటివారిని బాలోన్మత్తజడపిశాచవత్ అని పేర్కొన్నారు. భగవద్దర్శనం అయినవారు ఒక్కొక్కసారి చిన్నపిల్లవాడిలాగా త్రిగుణాలకు అతీతుడుగా, మరొకప్పుడు పిచ్చివానివలె, ఒకసారి కూర్చున్నచోటి నుండి కదలని లేదా కదలలేని జడుడివలె, మరొకసారి బూచివానివలె ప్రవర్తిస్తుంటారు.

***183. ప్రశ్న: భగవత్సాక్షాత్కారం లేదా ఆత్మవికాసం లేదా జ్ఞానసిద్ధి కలిగేది ఎలా?***

సమాధానం: వివేకవైరాగ్యాలు కావాలి. శాస్త్రాలలో ఉన్న వర్ణనలను చదవడం ద్వారా ఇసుమంతైనా ఉపయోగం లేదు. మన సిరిసంపదలను, మనశ్శరీరాలను ధారపోసి, వివేకవైరాగ్యాలతో సాధన చేసినపుడే భగవత్ప్రాప్తి లేదా ఆత్మ వికాసం సాధ్యపడుతుంది.

మనిషిలో అహంకారం ఉన్నంతవరకూ జ్ఞానసిద్ధి కలుగదు. 'నేను', 'నాది' అనే భావాల వలనే జీవుడు నానా అగచాట్లు పడుతున్నాడు. ఇదే అజ్ఞానం. నీవెవరివో ఒకసారి ఆలోచించి చూడు. నీవు శరీరమా? ఎముకలా? రక్తమాంసాలా? ఇవేవీ కాదు. నీలోనే భగవంతుడి అంశ ఉంది. ఆ విధమైన దృష్టి కలగడానికి, "ఓ ఈశ్వరా! అన్నీ చేసేది నీవే! నీవే అన్నింటినీ నడిపించేవాడివి! నీవెలా నడిపిస్తే అలాగే నడచుకుంటాను," అని నిజాయతీగా ప్రార్థించాలి.

భగవంతుడే అన్నింటికీ కర్త అనే అంతర్దృష్టినే జ్ఞానం అంటారు. ప్రార్థనల ద్వారా జీవాత్మ పరమాత్మలో సంయోగం చెందుతుంది. జ్ఞానసిద్ధి కలుగుతుంది. ఇక ఆ వ్యక్తి భగవంతుడికి సంబంధించిన విషయాలనే ఇష్టపడతాడు. తక్కిన విషయాలు వినడానికి ఇష్టపడడు. సప్త సముద్రాలు, సప్త నదులు నీటితో నిండిపోయివున్నా చకోరపక్షి దాహార్తి తీర్చుకోవడానికి వర్షధారనే కోరుకుంటుంది. దానికోసం నోరు తెరుచుకొని వేచివుంటుంది.

***184. ప్రశ్న: ఈశ్వరుణ్ణి ఎవరు తెలుసుకోగలరు?***

సమాధానం: నిజమే! ఈశ్వరుణ్ణి యథార్థంగా ఎవరు తెలుసుకోగలరు? మనకు ఎంత కావాలో అంత తెలుసుకుంటే చాలు! ఒక చీమ ఒక చక్కెర రాశి దగ్గరకు వెళ్లింది. ఒక పలుకు చక్కెరతో దాని కడుపు నిండిపోయింది. ఇక ఆ రాశిలో ఎంత చక్కెర ఉన్నదో దానికి అవసరం లేదు కదా!

***185. ప్రశ్న: మానవుడికి ముక్తి ఎప్పుడు లభిస్తుంది?***

సమాధానం: అహంకారం నశించినపుడే మానవుడికి ముక్తి లభిస్తుంది.

***186. ప్రశ్న: ఈ కళ్ళతో భగవంతుణ్ణి చూడగలమా?***

సమాధానం: భగవంతుణ్ణి ఈ చర్మచక్షువులతో చూడలేము. సాధనలు చేయగా, చేయగా ప్రేమచక్షువులు, ప్రేమకర్ణాలతో కూడుకున్న ప్రేమమయ దేహం ఏర్పడుతుంది. ఆ ప్రేమమయమైన కనులతో భగవంతుణ్ణి దర్శించవచ్చు. ఆ ప్రేమమయమైన చెవులకు దైవవాణి వినపడుతుంది. ఐతే భగవంతుడి పట్ల గాఢమైన ప్రేమ కలుగకుండా ఇది సంభవం కాదు. అట్టి ప్రేమకలవాడు సమస్త ప్రపంచాన్నీ భగవన్మయంగా చూస్తాడు.

(నరేంద్రునితో) ఈ విసనకర్రను ఎలాగైతే ఎదురుగా ప్రత్యక్షంగా చూస్తున్నానో, అంత చక్కగా నేను భగవంతుణ్ణి చూశాను!

## 15. నామస్మరణ, సంకీర్తన

***187. ప్రశ్న: భగవన్నామం శక్తిసామర్థ్యాలు ఎంత?***

సమాధానం: భగవంతుడి నామానికి ఉన్న శక్తి అపారం. దానిని తక్కువగా అంచనా వెయ్యకూడదు సుమా! ఒక్కసారి భగవన్నామాన్ని జపిస్తే కోటిజన్మల పాపాలు పటాపంచలవుతాయి. (ఒక కథ చెపుతా విను! 48. గుహుని కథ)

***188. ప్రశ్న: భగవన్నామ స్మరణలో మహిమ ఉందా?***

సమాధానం: నిస్సందేహంగా భగవన్నామ స్మరణ మహిమాన్వితమైనదే. అయితే, నోటితో నామస్మరణ చేస్తున్నా, మనస్సును మాత్రం కామకాంచనాల మీదే ఉంచితే ప్రయోజనం ఉండదు. భగవన్నామ స్మరణతో మనస్సు పవిత్రం అవుతుంది. భగవన్నామ స్మరణతో పాటు ప్రార్థన కూడా చేయాలి. భగవంతుడి మీద అనురాగం కలిగేలా ప్రార్థించాలి.

ధనం, పేరుప్రతిష్ఠలు, భోగవిలాసాలు – ఇవన్నీ మూణ్ణాళ్ళ ముచ్చట్లే. నామస్మరణ కామాన్ని తొలగిస్తుంది. చెట్టు క్రింద నిలబడి చప్పట్లు చరిస్తే చెట్టుమీది పక్షులు ఎగిరిపోయినట్లు, నామస్మరణ పాపపు రాశులను పటాపంచలు చేస్తుంది. సంసార బాధలనే రోగాలను నివారిస్తుంది. మానసిక ప్రశాంతతను ఇస్తుంది.

***189. ప్రశ్న: ఈ ప్రపంచంలో అన్యాయాలు చేసేవారు కూడా భగవంతుణ్ణి పొందగలరా?***

సమాధానం: అన్యాయాలు చేసినవారయినా శరీరం విడిచిపెట్టే ముందు భగవన్నామ స్మరణ చేస్తే ఆయనను పొందగలరు. కానీ, వారు ముందు నుంచీ సాధన చెయ్యాలి. మరణం ఎప్పుడు సంభవిస్తుందో ఎవరికి ఎరుక?

***190. మా ఇంటిపక్కాయన చాలా ఆచారనిష్ఠాగరిష్ఠుడు. సంధ్యావందనం, అభిషేకం వంటివాటిని నియమంగా చేస్తుంటాడు - ఇటువంటి కర్మకాండలను ఎన్నాళ్ళు ఆచరించాలి? నేను కూడా అలా చేస్తే భగవత్సాక్షాత్కారం కలుగుతుందా?***

సమాధానం: భగవన్నామాన్ని ఉచ్చరించగానే కళ్ళ నుంచి అశ్రువులు స్రవించి, శరీరం పులకరించి, రోమాంచితమయితే ఇక పూజలు, పురస్కారాలు మొదలైన కర్మకాండతో పనిలేదు. 'ఓం రామ్' అంటూ ఒక్కసారి ఉచ్చరించగానే కళ్ళవెంట ఆనందాశ్రువులు కారితే, ఇక కర్మలేవీ మిగలవు. ఆ స్థితికి చేరుకున్న తర్వాత సంధ్యాదికర్మలు అనుష్ఠించవలసిన అవసరం లేదు.

మొక్క చిన్నదిగా ఉన్నప్పుడు దానికి కంచె వేసి, నీరు పోసి, సంరక్షించాలి. అదే పెద్ద చెట్టుగా ఎదిగిన తర్వాత దానికి అటువంటి సంరక్షణ అవసరం లేదు సరికదా దానికే ఒక ఏనుగును కట్టివేసినా అది ఆపగలుగుతుంది. గతుకుల రోడ్డులో పోయేటప్పుడు కారు స్టీరింగును గట్టిగా పట్టుకుంటాం. నునుపైన రోడ్డును చేరగానే పట్టు తగ్గించి ఒక చేత్తోనే కారు నడపవచ్చు.

పండు తయారవ్వగానే పూవు రాలిపోతుంది. పూవు రాలిపోతేనే పండు తయారవుతుంది! కర్మలే పూవులు. భక్తి అనేది ఫలం!

***191. ప్రశ్న: భగవన్నామ స్మరణం వల్లనే అన్నీ సాధించగలమని మీరు చెపుతుంటారు కానీ నాకు అసలు భగవన్నామం చేయాలనే అనిపించడం లేదు. నామం చేయాలంటే రుచి, అభిరుచి కలగాలి కదా? అదెలా కలుగుతుంది?***

సమాధానం: భగవంతుడి పట్ల రుచి ఏర్పడాలని మనస్ఫూర్తిగా ప్రార్థించండి. ఆయన కరుణిస్తాడు. భగవదనుగ్రహం లేకుండా భగవన్నామాన్ని ఉచ్చరించలేము. మీకు నచ్చిన నామరూపాన్ని దేనినైనా మనస్సులో నిలుపుకుంటే, దాని వలన భగవంతుడి ఎడల రుచి ఏర్పడుతుంది. భగవత్కృపకు పాత్రులవుతారు. భగవంతుడు ఎప్పుడూ మీ మనస్సును చూస్తాడే తప్ప బాహ్యమైన ఆడంబరాలను చూడడు. మనస్సులో భగవంతుడిపట్ల నిజమైన ప్రేమ ఉంటే, ఆయనే భగవన్నామం పట్ల మీకు రుచి కలిగించి మీకు దగ్గరవుతాడు.

మనస్సులోని భావాన్నే భగవంతుడు చూస్తాడు కాబట్టి 'భావగ్రాహీ జనార్దన!' అంటారు. (ఒక కథ చెపుతా విను! 69. ఇద్దరు మిత్రుల అంతరంగాలు)

***192. ప్రశ్న: భగవన్నామస్మరణ యొక్క శక్తి ఏమిటి?***

సమాధానం: భగవన్నామంలో, మంత్రంలోని బీజాక్షరాలలో గొప్ప శక్తి ఉంది. ఆ శక్తి మనలోని అవిద్యను నశింపజేస్తుంది. బీజంలో నుంచి బయటకు వచ్చిన అంకురం

చాలా మృదువుగా ఉంటుంది కానీ అది నేలను చీల్చుకుని పైకి రాగలదు. నిరంతరం కామకాంచనాల సంసర్గం వలన మన మనస్సు ఏకాగ్రతను కోల్పోయి, వాటివైపే పరుగులు తీస్తుంది. అందువలన వాటిని దరిచేరనీయకుండా అప్రమత్తంగా మసలుకోవాలి. సర్వదా భగవంతుడి మీదనే మనస్సు నిలిపి పరిశ్రమించాలి. ముందు శ్రమపడితే, ఆ తరువాత పించను తీసుకోవచ్చు!

***193. ప్రశ్న: స్వామీ! జపం చేయడం మంచిదేనా?***

సమాధానం: తప్పకుండా! జపం చేత భగవల్లాభం చేకూరుతుంది. ఏకాంతమైన చోట, పూర్తి ఏకాగ్రతతో చేసిన జపం వలన భగవంతుడికి చేరువవుతాము. పూజ కన్నా జపం, జపం కన్నా ధ్యానం, ధ్యానం కన్నా భావం, భావం కన్నా మహాభావప్రేమ శ్రేష్ఠమైనవి. శ్రీచైతన్యులకు మహాభావప్రేమ కలిగింది. అటువంటి ప్రేమ కలిగినప్పుడు భగవంతుణ్ణే బంధించి వేయగలిగిన త్రాడు మన చేతిలోకి వస్తుంది.

***194. స్వామీ! మా ప్రక్కింటతను కొన్నాళ్ళ క్రితం ఒక గురువు వద్ద మంత్రం తీసుకుని, జపం చేసి, అంతా సాధించాననుకుంటున్నాడు. ఇంకొకతను అన్నదానం చేస్తూ, మరొకరు వస్త్రదానం చేస్తూ, ఆధ్యాత్మికంగా పురోభివృద్ధి సాధించామనుకుంటున్నారు. అటువంటి వారి గురించి మీరేమంటారు?***

సమాధానం: జపసాధనతో కొద్దిపాటి ఆనందం కలగగానే మనలోని ఆధ్యాత్మిక చైతన్యం జాగరూకమైనదని

అనుకోకూడదు. ఇంకా ముందుముందుకు సాగాలి. చిట్టచివరకు భగవదనుభూతిని పొందాలి. (ఒక కథ చెపుతా విను! 68. చరైవేతి)

శంభుచరణ్ మల్లిక్ తాను మరింతగా దానధర్మాలు చేయగలిగేటట్లు దీవించమని నన్ను కోరాడు! కానీ కర్మ చేయడమే జీవితలక్ష్యం కాదని అతడికి చెప్పాను. భగవంతుడే కనిపిస్తే ఆయనను ఆస్పత్రులు, చెరువులు, సత్రాలు కావాలని కోరతామా అని అడిగాను. నిజానికి నిష్కామ కర్మ చేయడం చాలా కష్టం. కర్మ అనేది ఆధ్యాత్మిక పథంలో తొలిమెట్టు మాత్రమే.

## 16. శరణాగతి

***195. ప్రశ్న: సంపూర్ణ శరణాగతి ఎలా ఉంటుంది?***

సమాధానం: సంపూర్ణ శరణాగతి సాధించినవాడు గాలిలో కొట్టుకు పోయే విస్తరిలాగా ఉంటాడు! అంటే అర్థం తెలుసా? నేల మీద పడివున్న విస్తరాకు గాలి ఎటువీస్తే అటువైపుకు కొట్టుకుపోతుంది. అదే విధంగా భగవంతుడి మీద మనం ఆధారపడి ఉండాలి. ఆ దివ్యచైతన్యశక్తి ఎటువైపు కదిపితే అటువైపు మనస్సు కదలాలి.

***196. ప్రశ్న: ఈ ప్రపంచంలో మేము ఎదుర్కొంటున్న మాయ నుంచి బయటపడే దెలా?***

సమాధానం: భగవంతుణ్ణి చిత్తశుద్ధితో శరణువేడితే మాయనుంచి బయటపడేమార్గాన్ని ఆయనే చూపుతాడు.

***197. ప్రశ్న: నేనెన్నో తప్పలు చేశాను. భగవంతుడు నన్ను క్షమిస్తాడా?***

సమాధానం: భగవంతుడు మన సొంత తల్లి లాంటి వాడు. 'హే భగవాన్! ఉద్దేశ్యపూర్వకంగానో, తెలియకనో నేనెన్నో పాపాలు చేశాను. ఇక మీదట చేయను!' అని పశ్చాత్తాపంతో భగవంతుణ్ణి శరణు వేడితే ఆయన మనను తన అక్కున చేర్చుకుంటాడు.